thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 251 కరీంనగర్ మంగళవారం, 18 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఉబర్ ఓలాకు పోటీగా భారత్ ట్యాక్సీ

న్యూఢిల్లీ : క్యాబ్ సర్వీసులు అందించే ఓలా, ఉబర్‌లకు పోటీగా 'భారత్ ట్యాక్సీ' వస్తోంది. క్యాబ్ నిర్వాహకుల నుంచి ఎలాంటి కమీషన్లు వసూలు చేయకుండా, సహకార పద్ధతిలో నిర్వహించే ఈ సర్వీసుతో.. అటు క్యాబ్ నిర్వాహకులకు, ఇటు ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. ఓలా, ఉబర్ సంస్థలు క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్ల నుంచి అడ్డగోలుగా 25 వరకు కమీషన్లు వసూలు చేస్తున్నాయని.. ప్రయాణాల రద్దు, రద్దీ సమయాల పేరిట ప్రయాణికుల నుంచి అడ్డగోలు చార్జీలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రైవేటు క్యాబ్ సర్వీసులకు ప్రత్యామ్నాయాన్ని అందుబాటులోకి తేవడం.. క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్లకు ప్రయాణ చార్జీలు పూర్తిగా అందేలా చేయడం లక్ష్యంగా.. కేంద్ర సహకారశాఖ, జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం (ఎన్ఈజీడీ) 'భారత్ ట్యాక్సీ'ని రూపొందించింది. రూ.300 కోట్ల మూలధనంతో 'సహకార్ ట్యాక్సీ కో-ఆపరేటివ్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేసింది.

# హజ్ యాత్రలో ఘోర విషాదం..

# 45 మంది సజీవదహనం..

# అంతా హైదరాబాద్ వారే..!





హైదరాబాద్ : సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 45 మంది భారతీయ ఉమ్రా యాత్రికులు మరణించినట్లు సమాచారం.. మక్కా నుంచి మదీనాకు భారతీయ ప్రయాణికులతో వెళ్తున్న ప్యాసింజర్ బస్సు.. డీజిల్ ట్యాంకర్ ఢీ కొన్నాయి.. దీంతో భారీగా మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది.. అందులో ఉన్న 45 మంది ప్రయాణికులు సజీవదహనమైనట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. మృతుల్లో చాలా మంది భారతీయులు ఉన్నారని.. వారిలో హైదరాబాద్‌కు చెందిన వారే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర ప్రమాదం బదర్ – మదీనా మధ్య ముఫ్రిహాత్ ప్రాంతంలో జరిగింది. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ప్రమాదం జరిగిందని.. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. హజ్ యాత్రలో భాగంగా మక్కాలో తమ ఆచారాలను ముగించుకున్న యాత్రికులు మదీనాకు వెళుతుండగా.. బస్సు, డీజీల్ ట్యాంకర్ ఢీకొన్నాయి.. ఈ ఘటన జరిగినప్పుడు చాలా మంది ప్రయాణికులు నిద్రలో ఉన్నారని సమాచారం.

స్థానిక వర్గాలు 42 మంది మరణించినట్లు నివేదించినప్పటికీ, అధికారులు దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

**సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి..** సౌదీ అరేబియాలో భారతీయ యాత్రికులతో ఉన్న బస్సు ఘోర ప్రమాదానికి గురవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బాధితులకు సంబంధించి సీఎం పూర్తి వివరాలు తెలుసుకోవాలని సీఎస్, డీజీపీ ని అదేశించారు. తెలంగాణ కు చెందిన వారు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడాలని సూచించారు. అవసరమైన సహాయ చర్యలకు రంగంలోకి దిగాలని అదేశించారు. సీఎం అదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఢిల్లీ లో ఉన్న రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ను అప్రమత్తం చేశారు. ప్రమాదంలో మన రాష్ట్రానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరించి వెంటనే అందించాలని అదేశించారు. అంతేకాకుండా సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. o91 79979 59754?, o91 99129 19545? ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. ఒక ప్రైవేట్ టూర్స్ అండ్ ట్రావెల్స్ నుండి వీళ్లంతా దుబాయ్ వెళ్లినట్లు సమాచారం..

ఈ ట్రావెల్స్ నుండి 16 మంది వెళ్లినట్లు తెలుస్తోంది. మరికొంత మంది మరో ట్రావెల్స్ ద్వారా ఉమ్రా యాత్రకు వెళ్లారు.




హైదరాబాద్, నవంబర్ 17: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించాలని తీర్మానించిన కేబినెట్.. ఆ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై డిస్కషన్ నడిచినట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించింది మంత్రివర్గం. ప్రజాపాలన వారోత్సవాలు ముగిసిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబర్ 2వ వారంలో గానీ.. 3వ వారంలో గానీ ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన దరిమిలా.. అదే ఉత్సాహంతో లోకల్ బాడీ ఎలక్షన్స్‌కు వెళ్లాలని ప్రభుత్వం ఫిక్స్ అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందనే విషయాన్ని ప్రజాపాలన వారోత్సవాల్లో వివరించాలని మంత్రివర్గం తీర్మానించింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. లోక్‌బాడీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని నిర్ణయించింది. ఇప్పటికే జూబ్లీహిల్స్ విజయంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు.. ప్రజాపాలన వారోత్సవాలతో గ్రామ స్థాయి కేడర్‌లో మరింత ఉత్సాహం నింపి స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని భావిస్తున్నారు.



## సింగరేణి సీఎండీ ఆఫీస్ ముట్టడికి కవిత పిలుపు

ఖమ్మం : డిపెండెంట్ ఉద్యోగాలు కాపాడుకోలేని స్థితిలో ఇప్పుడు ఉన్నామని జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. ఈరోజు సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సింగరేణిలో కార్మికులతో కవిత మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా మెడికల్ బోర్డ్ కోసం కోట్లాడుతున్నామన్నారు. డిసెంబర్ 13న సింగరేణి సీఎండీ కార్యాలయాన్ని ముట్టడి చేయబోతున్నామని ప్రకటించారు. సింగరేణి ఉద్యోగం ఒక కుటుంబానికి ఇన్సూరెన్స్ లాంటిదని... డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తామన్నారు. సింగరేణి గని కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని.. 'మీకోసం పోరాటం చేసే మాకు అండగా ఉండాలి అని కోరుతున్నాం' అని కవిత అన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు వేలం వేయడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం సింగరేణికి అక్షరాలా రూ.40 వేల కోట్ల అప్పు ఉందని తెలిపారు. సింగరేణి కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణం చేసే లోపు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెర్మినెంట్ అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. బొగ్గు బావిలోకి దిగే ముందు మైసమ్మకు మొక్కుకుని జాగ్రత్తగా ఉండాలని కవిత సూచించారు.




మక్కా యాత్రకు వెళ్లిన పలువురు భారతీయ యాత్రికులు మదీనాలో రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో పెద్ద సంఖ్యలో యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'మదీనా రోడ్డు ప్రమాదంలో భారతీయులు మృత్యువాత పడటం బాధాకరం. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబసభ్యులకు నా ప్రగాఢసానుభూతి. గాయపడ్డ వారు అత్యంత త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. రియాద్‌లో ఇండియన్ ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ సాయం అందిస్తున్నాయి.

భారత అధికారులు సౌదీ అధికారులతో ఈ ప్రమాదం గురించి ఎప్పటికప్పుడు చర్చిస్తూ ఉన్నారు' అని అన్నారు. కాగా, సోమవారం తెల్లవారు జామున భారతీయ యాత్రికులు మక్కాలో ప్రార్థనలు ముగించుకుని బస్సులో మదీనా వెళుతూ ఉన్నారు. వారు ప్రయాణిస్తున్న బస్సు 1.30 గంటల ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. పెద్ద సంఖ్యలో యాత్రికులు సజీవ దహనం అయ్యారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు.



# బై పోల్స్..!?

# ఇక తప్పదు

## పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు. జూబ్లీహిల్స్ ఫలితం తరువాత అనూహ్య నిర్ణయాలు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల పైన నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ కు సుప్రీం సూచనలు చేసింది. నిర్దేశిత సమయం ముగియటంతో ఈ రోజు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో, ఇప్పటికే వీరి విషయంలో విచారణ చేస్తున్న స్పీకర్... తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కాగా, వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయక తప్పదని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఇక. .వీరి రాజీనామాకు ముహూర్తం.. బై పోల్స్ పైనే అధికార పార్టీలో చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో ఇద్దరి పైన పూర్తి ఆధారాలు ఉండటం తో వీరి పైన ప్రస్తుతం అధికార పార్టీలో చర్చ జరుగుతోంది. దీంతో, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తర్వలో రాజీనామా చేస్తారని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇద్దరి పైనా ఆధారాలు ఉండటంతో.. స్పీకర్ చర్య తీసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తుందనే విశ్లేషణలు ఉన్నాయి. న్యాయ నిపుణుల సూచనల మేరకు ఈ ఇద్దరూ రాజీనామా దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విచారణకు రావాలని స్పీకర్ నోటీసులు పంపినా.. వీళ్లిద్దరూ విచారణకు హాజరు కాలేదు. దీంతో అప్రమత్తమైన ఇద్దరు స్పీకర్ నిర్ణ యం కంటే ముందే రాజీనామా చేస్తే హుందాగా ఉంటుందనే ఆలోచనలో ఉన్నట్టు పార్టీ నేతల సమాచారం. ఇదే జరిగితే రాష్ట్రంలో మరో రెండు అసెంబ్లీ స్థానాలకు కూడా ఉప ఎన్నికలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ కు పది మంది ఎమ్మెల్యేలు దగ్గరయ్యారు. తమ పార్టీ గుర్తు మీద గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించిన ఈ 10 ఎమ్మెల్యేలపై ఫిరాయింపు చట్టాన్ని ప్రయోగించి అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. చర్యలు తీసుకోడానికి స్పీకర్ వెనకాముందాడటంతో బీఆర్ఎస్ తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బీఆర్ఎస్ పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది జూలై 31న సుప్రీంకోర్టు ఆదేశిం చింది. సుప్రీం ఆదేశాల మేరకు ఈ ఏడాది అక్టోబర్ 31లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వీరిలో కడియం శ్రీహరి, దానం నాగేందర్ మినహా మిగతా 8 మంది ఎమ్మెల్యేలు స్పీకర్ విచారణకు హాజరయ్యారు.

రెండు విడతల్లో 8 మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తయింది. అనంతరం స్పీకర్ తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, ఈ రోజు సుప్రీంకోర్టులో ధిక్కారణ పిటీషన్ పైన విచారణ జరిగింది. రోజు వారీ విచారణ దిశగా సీజేఐ సూచన చేసారు. నాలుగు వారాల్లో విచారణ పూర్తి చేస్తామని అసెంబ్లీ తరపు న్యాయవాదులు స్పష్టం చేసారు. అయితే, బీఆర్ఎస్ గుర్తు మీద ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన అనంతరం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. కారు గుర్తు మీద స్టేషన్ ఘన్‌పూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి, సీఎం రేవంత్ సమక్షంలో పార్టీలో చేరారు. తన కూతురు కడియం కావ్యకు కాంగ్రెస్ నుంచి హనుమకొండ పార్లమెంట్ నియోజకవర్గం టికెట్ ఇప్పించుకొని ఆమె కోసం పని చేశారు. కాంగ్రెస్ జెండాలు పట్టు కొని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని ఓడించాలని ప్రచారం చేశారు. పక్కా ఆధారాలతో దొరికిపోయిన ఈ ఇద్దరిపై వేటు తప్పదని ప్రచారం సాగుతోంది. దీంతో వేటు కంటే రాజీనామా బెటర్ అని ఇద్దరూ ఆలోచిస్తున్నట్టు తెలిసింది. అయితే రాజీనామా ఎప్పుడు చేయాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ఇద్దరు రాజీనామా చేస్తే.. వచ్చే ఉప ఎన్నికలకు సమాయత్తం పైనా ఆలోచన తరువాత ఫైనల్ నిర్ణయం ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

చురకలు






హైదరాబాద్, నవంబర్ 17: సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. బాధితులకు అండగా నిలవాలని ఈ భేటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యేతోపాటు మైనార్టీ విభాగానికి చెందిన ఉన్నతాధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపాలనీ కేబినెట్ నిర్ణయించింది. బస్సు ప్రమాదంలో మరణించిన మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబసభ్యులకు చెందిన ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ తీసుకెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సౌదీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 మంది మరణించారు. వీరంతా హైదరాబాద్ వాసులని తెలంగాణ హజ్ కమిటీ ఒక ప్రకటన వెల్లడించింది. మృతుల్లో 17 మంది పురుషులు, 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. హైదరాబాద్‌లోని మొత్తం 4 ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నవంబర్ 9వ తేదీన వీరంతా ఉమ్రాకు బయలుదేరి వెళ్లారు. మక్కా యాత్ర పూర్తి చేసుకుని వారంతా మదీనాకి వెళ్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబంలోని 18 మంది ఈ ప్రమాదంలో మరణించారు.




## సౌదీ ప్రమాదం.. సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ వాసులు మృతి చెందడంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించాలని సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డిని ఆదేశించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సౌదీ ఎంబసీతో మాట్లాడాలని ఆదేశించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు. మరోవైపు బస్సు ప్రమాదం దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

**కంట్రోల్ రూమ్ నంబర్లు:** తెలంగాణ సచివాలయంలో: o91 79979 59754, o91 99129 19545.
జెడ్డాలోని భారతీయ ఎంబసీలో: 80024 40003

**రియాద్‌లో భారత ఎంబసీతో మాట్లాడా: ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ...** సౌదీలో బస్సు ప్రమాదంలో హైదరాబాద్ వాసులు మృతి చెందడంపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రియాద్‌లో భారత ఎంబసీతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రమాద ఘటనపై వివరాలు సేకరించాలని వారిని కోరామన్నారు. హైదరాబాద్‌కు చెందిన రెండు ట్రావెల్ ఏజెన్సీలతోనూ కాంటాక్ట్ అయినట్లు చెప్పారు. యాత్రికులు మక్కా నుంచి మదీనాకు వెళ్తుండగా బస్సు ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. ఈ ఘటనలో చనిపోయిన వారి మృతదేహాలను భారత్‌కు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌ను కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తోన్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొనడంతో 45 మంది సజీవదహనమయ్యారు. మృతులంతా హైదరాబాదీలే.

## సౌదీలో భారతీయుల సజీవదహనం ఘటన.. స్పందించిన ఎస్.జైశంకర్



యాత్రికులతో వెళ్తోన్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొనడంతో సౌదీ అరేబియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పందించారు. మదీనాలో భారత పౌరులకు జరిగిన ప్రమాదంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రభావిత కుటుంబాలకు రియాద్‌లోని ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నాయని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. మక్కా యాత్ర ముగించుకొని మదీనా వెళ్తుండగా.. సోమవారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో (భారత కాలమానం ప్రకారం) ఈ ఘటన చోటుచేసుకుంది. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనగానే మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో యాత్రికులంతా నిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు సహా 42 మంది సజీవ దహనమయ్యారని మీడియా కథనాలు వెల్లడించాయి. మృతుల్లో ఎక్కువమంది హైదరాబాద్‌వాసులని సమాచారం.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ.. స్పీకర్‌కు 4 వారాల గడువు

దిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. అలాగే మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై కోర్టు ధిక్కరణ కింద



చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలుచేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ 36వ నంబరులో ఉంది. స్పీకర్ మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవడంలో విఫలమైనందున నేరుగా న్యాయస్థానమే తమ పిటిషన్లపై విచారణ చేపట్టి నిర్ణయం వెలువరించాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన మరో రిట్ పిటిషన్ 37వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.







హైదరాబాద్: హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో సినీ పెద్దలు భేటీ అయ్యారు. అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు ఈ భేటీలో పాల్గొన్నారు. ఇటీవల పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీపెద్దలు సజ్జనార్‌తో అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. "పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో చాలా మంది చనిపోయారు.

ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉంది. ఇంత డేటా అతడి వద్ద ఉండటం ప్రమాదకరం. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉంది" అని సజ్జనార్ వెల్లడించారు.

**పోలీసులు వెంటపడ్డాక దేశ పౌరసత్వం వదులుకున్నాడు...** "ఇమ్మడి రవి స్వస్థలం విశాఖ.. బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడు. అతడు వేరే పేర్లతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులు తీసుకున్నాడు. మొదటి నుంచి నేర ప్రవృత్తితో ఉన్నాడు. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారు. దీంతో భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019లో ఐబొమ్మ ప్రారంభించి 21 వేల సినిమాలు పైరసీ చేశాడు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లను పెట్టాడు. 110 డొమైన్స్ కొనుక్కున్నాడు. ఒకటి బ్లాక్ చేస్తే మరొకటి ఓపెన్ చేస్తూ పైరసీ సినిమాలు విడుదల చేశాడు. ఈ రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం" అని సజ్జనార్ తెలిపారు.




## తగ్గేదేలేదంటున్న హైడ్రా.. అక్రమ నిర్మాణాలపై కొరడా

హైదరాబాద్, నవంబరు17 : భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో గచ్చిబౌలిలో ఇవాళ(సోమవారం) భారీ కూల్చివేతలు చేపట్టారు. ఎఫ్‌సీఐ లే అవుట్‌లో అక్రమంగా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ భవనాలను నేలమట్టం చేశారు. హైడ్రాలిక్ జాక్ క్రషర్‌తో నిర్మాణాలను కూల్చివేశారు. తమ ప్లాట్లను ఆక్రమించి సంధ్యా శ్రీధర్ రావు రోడ్లు వేశారని తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు బాధితులు. ఈ క్రమంలో సంధ్యా శ్రీధర్ రావు అక్రమాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది హైకోర్టు. న్యాయస్థానం ఆదేశాలతో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే, అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు దూకుడుతో ముందుకెళ్తున్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అధికారులకు ఫిర్యాదులు వస్తే శరవేగంగా చర్యలు చేపడుతున్నారు. హైడ్రా అధికారులు తమకు అండగా నిలవడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## 46 మందిలో ఒక్కడే బతికాడు.. సౌదీ బస్ ప్రమాదంలో తప్పించుకున్న వ్యక్తి ఎవరంటే..

సౌదీ అరేబియాలోని మదీనాకు సమీపంలో ఘోర విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 45 మంది యాత్రికులు మృతి చెందారు. మక్కా నుంచి మదీనాకు యాత్రికులతో వెళ్తున్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. 46 మందితో ప్రయాణిస్తున్న ఆ బస్సు మంటల్లో చిక్కుకోవడంతో 45 మంది మరణించారు. ఈ ఘోర ప్రమాదం నుంచి అబ్దుల్ షోయబ్ అనే ఒక్క వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం ఆయన స్థానిక హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. 24 ఏళ్ల మొహమ్మద్ అబ్దుల్ షోయబ్ డ్రైవర్ పక్కన కూర్చోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. షోయబ్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి. గాయాల పాలైన షోయబ్‌ను హాస్పిటల్‌లో చేర్చారు. అయితే అతడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం బయటకు రాలేదు. కాగా, ఈ ప్రమాదంలో షోయబ్ కుటుంబ సభ్యులందరూ చనిపోయినట్టు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి మొత్తం 54 మంది నవంబర్ 9వ తేదీన జెడ్డాకు బయల్దేరి వెళ్లారు. నవంబర్ 23వ తేదీ వరకు వీరి టూర్ ప్లాన్ చేశారు. వీరిలో నలుగురు ఆదివారం మక్కా నుంచి మదీనాకు కారులో వెళ్లిపోయారు. మరో నలుగురు మక్కాలోనే ఉండిపోయారు. దీంతో 46 మంది బస్సులో మదీనాకు బయల్దేరారు. మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలో ఆ బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో 45 మంది మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు.

పాట్నా: రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వి యాదవ్ బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. పాట్నాలోని తేజస్వి నివాసంలో సోమవారంనాడు జరిగిన ఆర్జేడీ ఎమ్మెల్యేల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రఘోపూర్ నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా తేజస్వి గెలిచారు. ఆర్జేడీ ఎమ్మెల్యేలు జరిపిన సమవేశంలో ఎన్నికల్లో 'మహాగర్‌బంధన్' ఓటమికి కారణాలను విశ్లేషించినట్టు తెలుస్తోంది. ఆర్జేడీ దయనీయ పరిస్థితికి లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య కారణమంటూ ఆరోపించిన సంజయ్ యాదవ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. విస్తృత చర్చల అనంతరం ఈవీఎంల హ్యాకింగ్, ఎన్నికల కమిషన్ పక్షపాత వైఖరే ఓటమికి కారణాలనే అభిప్రాయానికి వచ్చారు. ఈనెల 14న వెలువడిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే మూడింట రెండు వంతులకు పైగా సీట్లు గెలిచి ఘన విజయం సాధించింది. 243 సీట్లలో ఎన్డీయే 202 సీట్లు గెలుచుకోగా, మహాకూటమి 35 స్థానాలకు పరిమితమైంది. వీటిలో 25 స్థానాలను ఆర్జేడీ గెలుచుకుంది. కాంగ్రెస్ కేవలం 6 సీట్లకే పరిమితమైంది.

# కళా తపస్వి శాంతారాం

## - నవంబర్ 18... దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత శాంతారాం జయంతి



శాంతారాం రాజారాం వణకుద్రే (నవంబరు 18, 1901 – అక్టోబరు 30, 1990) భారత దేశపు చలనచిత్ర రంగంలో చరిత్ర సృష్టించిన అద్భుత చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు వి. శాంతారామ్. ఆయన ఒక కళా తపస్వి. శాంతారామ్ దాదాపు ఏడు దశాబ్దాలుగా చిత్రనిర్మాతగా వృత్తిని కలిగి చలనచిత్ర మాద్య మాన్ని సాంఘిక మార్పుకు సాధనంగా వినియోగించు కోవడానికి ప్రయత్నం చేశారు. ప్రారంభ చిత్రనిర్మాతలలో ఆయన ఒక వైపు మానవతా వాదాన్ని సమర్థించడానికి, మరోవైపు మూర?త్వం మరియు అన్యాయాన్ని బహిర్గతం చేయడానికి చిత్రాలను విజయవంతంగా ఉపయోగించారు. ఆయన "డా.కోట్నిస్ కీ అమర్ కహానీ" (1946), "అమర్ భూపాలి" (1951), "దో ఆంఖె బారహ్ హాథ్" (1957), "నవ రంగ్" (1959), "దునియా నా మానే" (1937), "పింజ్రా" (1972) వంటి చిత్రాలతో అందరికి పరిచితుడు. ఆయన తీసిన చిత్రాలన్నీ ఆణిముత్యాలే. ప్రతీ చిత్రంలో ఏదో ఒక కళకు ప్రాముఖ్యత ఇచ్చి నిర్మించారు' ఝనక్ ఝనక్ పాయల్ బాజేలో' నృత్యానికి, 'నవరంగ్' లో కవిత్వానికి, 'గీత్ గాయా పత్తరోన్' చిత్రంలో (తెలుగులో 'అమరశిల్పి జక్కన' చిత్రానికి ఆధారం. సాంఘిక చిత్రంగా మలిచారు) శిల్పానికి, ఇలా ఎన్నో కళలని దృశ్య కావ్యాలుగా మనకి అందించారు. వారి చిత్రాలలో పాటలు అమృత గుళికలు. 'జల్ బిన్ మచిలీ' చిత్రంలో ఒక పాము డాన్స్ చాలా అద్భుతంగా ఉంటుంది. అది మన తెలుగుచిత్రం 'అగ్నిపూలు' లో జయప్రద చేశారు. అంతే కాదు వారి చిత్రాలు సందేశాత్మకంగా ఉండి ప్రజలని ఆలోచింపజేసేలా ఉంటాయి. ఉదాహరణకి 'తూఫాన్ అవుర్ దియా' చిత్రంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని నిలబడాలని, 'దో ఆంఖేన్ బారా హాత్' చిత్రంలో మంచితనంతో ఎంత దుర్మార్గులనైనా మార్చ వచ్చునీ, 'సుభా క తారా' చిత్రంలో వితంతు వివాహ సంస్కరణ గురించి చెప్పారు.. ఇలా ఎన్నో అద్భుత చిత్రాలు ఆయన దర్శకత్వంలో వెలువడ్డాయి. డా వి.శాంతారామ్ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు సమీప గ్రామంలో తేదీ-18-11-1901వ సంవ త్సరంలో జన్మించారు. 1921లో నటుడిగా చిత్ర రంగప్రవేశం చేసిన ఆయన మూకీ, టాకీలు అన్నీ కలిపి 25 చిత్రాల్లో నటించారు. సుమారు 90 సినిమాలు నిర్మించారు. వీటిలో 55 సినిమాలకు స్వయంగా ఆయనే దర్శకత్వం కూడా వహించారు. కళాత్మక, వ్యాపార దృక్పథాలను మేళవించిన విలక్షణ దర్శకునిగా పేరుగాంచారు. అమరజ్యోతి, ఆద్మీ, దునియా న మానే, పడోసీ, స్త్రీ, అమర్ భూపాలీ, డా కోట్నిస్ కీ అమర్ కహానీ మొదలగు సినిమాలు శాంతారామ్ దర్శ కత్వంలో వచ్చిన కొన్ని ఆణి ముత్యాలు. నవరంగ్, గీత్ గాయా పత్థరోంనే, ఝనక్ ఝనక్ పాయల్ బాజే మొ చిత్రాల్లో కళాకారుడి అంతరంగాన్ని, ఆవేదనను ఆవిష్కరించారు. 'శాంతారామ' అనే పేరుతో తన ఆత్మకథను రాసుకున్నారు. చిత్రపరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ... 1985లో కేంద్ర ప్రభుత్వం 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డును బహూకరించింది. ఉత్తమ దర్శకుడికి ఫిల్మ్‌ఫేర్ అవార్డు (1957)బీ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుబీ పద్మ విభూషణ్‌బీ నాగపూర్ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందిన ఆయన అక్టోబరు 18, 1990 వ సంవత్సరంలో మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# అసమానాలు... సరిహద్దు సైనికుల సేవలు

## నవంబర్ 18...భారత సరిహద్దు సైన్య దినోత్సవం



భారత దేశ ప్రజలు అనుక్షణం ప్రశాంత జీవనం గడుపుతూ సంతోషంగా ఉన్నారంటే కారణం భారత సైనికులు ఇరవై నాలుగు గంటలు సరిహద్దుల్లో దేశానికి కాపలా కాస్తూ ఎడారి ఎండల్ని, మంచుకొండల మంచును, నిరంతరం కురిసే వర్షాలను లెక్క చేయకుండా దేశ రక్షణలో ప్రాణ త్యాగానికైనా సిద్ధపడి ఉండడం వల్ల మాత్రమే. కోట్లాది భారతీ యుల కోసం తమ కుటుంబాలకు దూరంగా మంచు కొండల్లో, ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తూ దేశాన్ని కంటికి రెప్పలా కాపలా కాస్తూ, కేవలం దేశరక్షణకే పరిమితం కాకుండా వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల రక్షణలోనూ ముందుంటున్న మన సైనికుల రుణాన్ని ఏ విధంగా తీర్చుకోవడం సాధ్యం.. దేశానికి అన్నం పెట్టేది రైతన్న అయితే, దేశాన్ని కాపాడేది సైనికుడు. అందులోనూ త్యాగానికి ప్రతీక సైనికుడు. అందుకే "జై జవాన్, ఆ తరువాత జై కిసాన్" దని అని దేశ మలి ప్రధాని లాల్ బహదూర్ లాంటి పెద్దలు అన్నారు. దేశసేవ కోసం ఎంతో మంది సైనికులు సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్నారు. సైనికులలో మూడు బృందాలుండేవి. మద్రాస్ శాపర్స్, బెంగాల్ శాపర్స్, బాంబే శాపర్స్ ఉండగా 1932 నవంబర్ 18న వీటిని విలీనం చేశారు. అప్పటి నుంచి వీరి అత్యున్నత సేవలు చరిత్రలో భాగమయ్యాయి. అటు యుద్ధ సమయం లోనూ, ఇటు శాంతి సమయాల లోనూ వీరి సేవలు అసమానంగా సాగుతూ వస్తున్నాయి. భారతీయ సైన్యం చరిత్ర కొన్ని వేల సంవత్సరాలకు పైబడిందే. మహాభారత కాలాల్లో కురుక్షేత్ర సంగ్రామంలో లక్షలాది మంది యుద్ధంలో పాల్గొన్నారు. రథాలు, గుర్రాలు, ఏనుగులపై నుంచి యుద్ధం సాగించడమే కాకుండా నేలపై నుంచి కూడా యుద్ధం చేసారు. అప్పట్లో విశ్వశాంతి, ధర్మ పరిరక్షణల కోసం అనేక యుద్ధాలు జరిగాయి. క్రమక్రమంగా రాజ్య విస్తరణ కాంక్షతో, నాగరికత పెరిగే కొద్దీ వాయవ్య దిశగా హిందూకుష్ పర్వతాల ద్వారా చొరబాట్లు పెరిగాయి. ఎన్నో శతాబ్దాల పాటు అక్కడ పర్యవేక్షణ లేదు. ఆ తరువాత చొరబాట్లకు అనేక మార్గాలు ఏర్పడ్డాయి. వీటిని ఎదుర్కొనేందుకు ఆయా ప్రదేశాల రాజ్యాధినేతలు యుద్ధాలు చేయాల్సి వచ్చేది. స్వదేశీ తెగల్లోని సైన్యం ప్రధాన ఆయుధాలు విల్లు, బాణాలు. ఆనాటి యుద్ధ కారణాలు పరిమితంగా ఉండేవి. మనుగడ, చొరబాట్లకు సంబంధించినవే ఎక్కువ. భారతీయ రాజకీయ చరిత్రలో చెపుకోదగ్గ తొలి చొరబాటు క్రీ.పూ.327 లో అలెగ్జాండర్ అధ్వర్యంలో గ్రీకులది. ప్రాచీన భారతీయ సాహిత్యంలో రాజకీయాల్లో యుద్ధాల ప్రస్తావనలు ప్రముఖంగా కనిపిస్తాయి చంద్రగుప్త మౌర్యులు కాలంలోని సైన్యాన్ని ఈ సందర్భముగా ప్రస్తావనార్హం. ఆనాటి సైనిక చరిత్రకు అర్ధశాస్త్రం ప్రామాణికం లాంటిది. కళింగ రాజుల కాలంలో యుద్ధభూమిలోకి ఏనుగులు వచ్చాయి. ఇవి 17 వ శతాబ్దిదాకా సాగాయి. మౌర్యుల కాలంలో శాంతి స్థాపన జరిగినది. గుప్తుల కాలం లో మన దేశానికి ప్రపంచ గుర్తింపు లభించినది. ఈ విధంగా రాజ్యాల రక్షణ కోసం సైన్యము సైనిక అవసరాలు కలిగాయి. స్వాతంత్ర్యం సాధించుకున్నాక, స్వతంత్ర రాజ్యమైన కాశ్మీర్ మహారాజు ఇటు భారత దేశంలో లేదా అటు పాకిస్తాన్‌లో విలీనానికి అంగీకరించలేదు. ఈ కారణంగా పాకిస్తాన్ కొంతమంది చొరబాటు దారులను కాశ్మీరుకు పంపి ఊళ్ళను ఆక్రమించుకో సాగింది. మరి కొద్దిరోజులను తన సైన్యాన్ని పంపి కాశ్మీరును ఆక్రమించు కోవడానికి ప్రయత్నిస్తున్నపుడు మహారాజు భారత ప్రభుత్వాన్ని శరణు కోరి భారత దేశంలో కాశ్మీర్‌ను విలీనం చేయడానికి అంగీకరించి ఒప్పందం చేసాడు. అప్పుడు భారత ప్రభుత్వం జనరల్ తిమ్మయ్య నేతృత్వంలో సైన్యాన్ని పంపి పాకిస్తాన్ సైన్యాన్ని కాశ్మీర్ నుండి వెళ్ళగొట్టే చర్యలుచేపట్టింది. ఆ సమయంలో ఐక్యరాజ్య సమితి రెండు దేశాల మధ్య శాంతి చర్చలు ప్రారంభించి సరిహద్దు రేఖను నిర్ణయించడంతో వివాదానికి తెరపడింది. తర్వాత... బ్రిటీష్, ఫ్రెంచ్ సైన్యాలు భారత దేశాన్ని విడిచి వెళ్ళినా, పోర్చుగీసు సైన్యం విడిచి వెళ్ళక గోవా, డామన్ డయ్యులను తన ఆధీనంలో ఉంచుకుంది. పోర్చుగీస్ అధికారులు చర్చలకు అంగీక రించక పోవడంతో భారత ప్రభుత్వం ఆపరేషన్ విజయ్ పేరుతో సైన్యాన్ని పంపింది. భారత సైన్యాన్ని తట్టుకోలేక పోర్చుగల్ దేశం భారతదేశంతో సంధికి ఒప్పుకొని అన్ని ప్రాంతాలను విడిచి వెళ్ళేందుకు అంగీకరించింది. చైనాతో 1962లో జరిగిన యుద్ధంలో సైన్యం అంతులేని సాహసాలు ప్రదర్శించారు. కాశ్మీర్ ప్రజలు పాకిస్తాన్ కు మద్దతు ఇస్తారు అన్న అపోహలతో 1965లో పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ తన సైన్యాన్ని పంపి కాశ్మీర్‌ను కొంత మేరకు ఆక్రమించు కున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఈ యుద్ధంలోనే అత్యధికంగా యుద్ధ ట్యాంకులను ఉపయోగించారు. భారత ఆర్మీ హెూరాహెూరీగా పోరాడి అందుబాటులో ఉన్న యుద్ధం ట్యాంకులన్నీ వినియోగించి పాక్ సైన్యానికి తానేమిటో చూపెట్టింది. భారత్ 128 ట్యాంకులను నష్టపోయింది. 150 పాక్ ట్యాంకులను ధ్వంసం చేసి 152 ట్యాంకులను చేజిక్కించుకొంది. తాష్కెంట్‌లో లాల్ బహదూర్ శాస్త్రి - అయూబ్ ఖాన్‌ల మధ్య జరిగిన సంధితో ఈ యుద్ధం ముగిసింది. 1971లో తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్) లో జరిగిన తిరుగు బాటుతో దాదాపు కోటి మంది శరణార్థులు భారత దేశానికి రావడంతో భారత్-పాక్ యుద్ధం మొదలయింది. తూర్పు పాకిస్తాన్‌కు పశ్చిమ పాకిస్తాన్ నుండి విమోచన కల్పించడం భారత్‌కు అన్ని విధాలా శ్రేయస్కర మయింది. తన బలగాలన్నిటినీ పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుత పాకిస్తాన్) వైపే గురి పెట్టగలిగింది. భారత సైన్యం జనరల్ అరోరా నేతృత్వంలో పాక్ సైన్యాన్ని లాహెూర్ వరకు తరిమి కొట్టి 90వేల యుద్ధ ఖైదీలను పట్టుకొంది. పాక్ ఓటమిని అంగీకరించడంతో ఈ యుద్ధం ముగిసింది. 1999లో పాకిస్తాన్ తన సైన్యాన్ని పంపి తీవ్రవాదులతో కలసి ఆ ప్రాంతాలు ఆక్రమించు కుంది. నెమ్మదిగా కీలకమయిన బటాలిక్, ద్రాస్, టైగర్ హిల్‌లను ఆక్రమించు కోవడంతో భారత్ 2లక్షల మంది సైన్యాన్ని సిద్ధం చేసింది. కార్గిల్ యుద్ధం జరుగుతున్న ప్రాంతాల కున్న పరిమితులవల్ల 30వేల మంది మాత్రమే పాల్గొన్నారు. సైన్యం అనేక కీలక పర్వతాలలో, చెక్ పోస్టుల వద్ద ఉన్న తీవ్రవాదులను సమర్థవంతంగా ఎదుర్కొని రెండు నెలల్లో అన్నింటినీ స్వాధీనం చేసుకుంది. ఇలా భారత సరిహద్దు లలో సైన్యం అంతులేని ధైర్య సాహసాలు ప్రదర్శిస్తు, సకల త్యాగాలకు సిద్ధపడి, ప్రాణాలను పణంగా పెట్టి అనుక్షణ అప్రమత్తులై దేశ రక్షణ చేస్తున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**





# శివ పూజకు ఉద్దిష్టమైనది మాస శివరాత్రి

మాస శివ రాత్రి. ప్రతి నెలా వచ్చే మన శివుని పండుగ. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా కృష్ణ పక్షం చతుర్దశి నాడు ఆ భోళా శంకరుని ఉద్దేశించి చేసుకునే పూజ. ఈ రోజున ఉపవాసం, ప్రదక్షిణాలు ప్రత్యేకముగా, విశిష్టముగా ఉంటాయి. చంద్రమా మనసో జాతః అని పెద్దలు చెపుతూ ఉంటారు. అంటే చంద్రుడు మన మనస్సుకు కారకుడు. చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడు కేతువు ప్రభావము ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ చంద్రుడిని తల పైన పెట్టుకున్న చంద్రశేఖరుని శరణు వేడడం సదాచారం. ఓం నమఃశ్శివాయ అనే పంచాక్షరీ మహా మంత్రం యజుర్వేదం రుద్రాధ్యాయం లోనిది. 'న, మ, శి, వ, య. మంత్రం' 'ఓం' కారంతో ప్రారంభం అవుతుంది. ఓం... మహాబీజాక్షరం. 'న' అనేది భగవంతునిలోని కాంతిని తెలియ చేస్తున్న ఈ పంచాక్షరాలను పంచభూతాలు అని కూడా అంటారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు నిర్వచనం చెప్పారు. ఈ మంత్రోచ్చారణ పంచ భూతాల సంబంధంగా చెపుతారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు వివరణ ఇచ్చారు. మానవ శరీరం పంచభూతాత్మకం. నమశ్శివాయ అనే అయిదు అక్షరాలను పలికినప్పుడు పంచ భూతాలతో నిండిన శరీరం శుభ్రమవుతుంది. ఒక్కో అక్షరం ఒక్కో భూతాన్ని శుభ్రం చేస్తుంది. 'న' భూమికి సంబంధించిన భాగాలను, 'మ' నీటికి సంబంధించిన భాగాలను, 'శి' అగ్నికి సంబంధించిన భాగాలను, 'వ' గాలికి సంబంధించిన భాగాలను, 'య' ఆకాశానికి సంబంధించిన భాగాలను పరిశుభ్రం చేస్తాయి. భోళా శంకరుడు అభిషేక ప్రియుడు నాలుగు చుక్కల నీరు పోసి, మూడు దళాలు ఉన్న బిల్వ దళం మనసారా పెడితే సంతోషించి వరాలనిచ్చే వరదుడు. శివభక్తుడైన సౌనంద గణేశ ముని ఒకసారి యమ లోకానికి వెళ్లగా యమధర్మరాజు ఆయనను సత్కరించి, వచ్చిన కారణమేమిటని అడిగాడు. తాను యమలోకంలోని విశేషాలను చూడడానికి వచ్చినట్లు ముని చెప్పారు. దీంతో తన లోకంలో నరక యాతనలు అనుభవిస్తున్న పాపాత్ములను యముడు ఆ మునికి చూపించాడు. వారి పరిస్థితికి జాలిపడిన ఆ మహర్షి.. ఓ జనులారా! ఇది 'ఓం నమశ్శివాయ' అనే మంత్రం దీనిని ఉచ్చరిస్తే మీ యాతనలు పటాపంచ లవుతాయని తెలిపారు. ముని చెప్పగా వారంతా పంచాక్షరిని జపించారు. దీంతో వారికి నరక విముక్తి లభించి, అంతా కైలాసం చేరుకున్నారట. అధికార గర్వముతో దుర్వాస మహర్షిని అవమానించిన దేవేంద్రుడు ఆ మహానుభావుని శాప కారణంగా తన సమస్త సంపదలు సముద్రం పాలు అవ్వడం చూస్తూ ఉండి పోయాడు. మందర పర్వతమును కవ్వముగా, వాసుకిని తాడుగా చేసుకుని క్షీర సాగరమును మథించినప్పుడు ముందుగా లోకాలన్నిటినీ భస్మం చేస్తుందా అని అనిపించేలా ఉగ్రతతో హాలాహలం పుట్టింది. అమ్మవారి అనుమతి తీసుకుని ఆ లోకాధారుడు ఆ కాలకూట విషయాన్ని తాను స్వీకరించి లోకాలను కాపాడాడు. క్షీరసాగర మథనం మరలా కొనసాగేలా చూసాడు. తన లోపల ఉన్న లోకాలకు కష్టం కలగకుండా గొంతులోనే నిలుపుకుని శ్రీకంఠుడు, గరళకంఠుడు, నీలకంఠుడు అయ్యాడు. శివుడికి ఈ రోజును ప్రీతి పాత్రమైన రోజున శివుడికి అభిషేకాలు, పూజలు చేయడం వలన కోరిన కోర్కెలు నెరవేరుతాయి అని ప్రతీతి. శివరాత్రి అనగా శివుని జన్మదినం (లింగోద్భవం) అని అర్థం. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా జరుపుకునేదే మాస శివరాత్రి. మహాశివుడు లయ కారకుడు. లయానికి (మృత్యువునకు) కారకుడు కేతువు. అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి సమయంలో చంద్రుడు క్షీణించి ఉంటాడు. చంద్రమా మనసో జాతః అనే సిద్ధాంతము ప్రకారము చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడూ జీవులపై ఈ కేతు ప్రభావము ఉండటము వలన వారి వారి ఆహారపు అలవాట్లపై ప్రభావము చూపడం వలన జీర్ణశక్తి మందగిస్తుంది. తద్వారా మనస్సు ప్రభావిత మవుతుంది. మాస శివరాత్రి నాడు ఉపవాసము ఉండి, వీలైతే శివాలయ దర్శనం చేసుకొని, శక్తి మేర 3, 5, 11, 18, 21, 54, 108 ఇలా ప్రదక్షిణలు చేయవచ్చు. అదేవిధంగా ఆరోజు ప్రదోష వేళ శివునకు మారేడు దళములతో లేదా కనీసము గంగా జలముతో అభిషేకాది అర్చనలు చేయడము మంచిది. ఇవేమీ చేయడానికి అవకాశములేని వారు, ఆరోగ్యవంతులు, అలాగే గృహములో అశౌచ దోషము లేనివారు ఈ రోజు ఉపవాసము ఉండడం చేయాలి. శివనామ స్మరణ చేస్తూ సాయంకాలం ప్రదోష సమయంలో శివునికి అభిషేకం చేయాలి. అభిషేకానంతరం, బిల్వాష్టోత్తరం చెపుతూ బిల్వ దళాలను శివునికి అర్పించాలి. కనీసం ఉపవాసం ఉండి, సాయం కాలం శివాలయానికి వెళ్ళి దీపారాధన చేసి పంచాక్షరీ మంత్రమైన ఓం నమః శివాయను జపించడం కూడా మంచిది. పన్నెండు మాస శివరాత్రులలో ఏ శివరాత్రికైనా సత్కర్మలు చేయడం వల్ల సత్ఫలితాలు పొందుతారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# జాతీయ జంతువు సంరక్షణ సామాజిక బాధ్యత

## నవంబర్ 18... జాతీయ జంతువుగా పులిని స్వీకరించిన దినం



జంతు రాజ్యంలో అడవికి రాజైన సింహం తర్వాత అగ్రస్థానం పులిదే. పెద్దపులి రాజసం ఇతర ఏ జంతువుకు రాదు. వేటగాళ్ల బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. గత వందేళ్లలో పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పులులు మనగడను ప్రశ్నార్థకముగా మార్చేస్తున్నాయి. పెద్దపులులను భవిష్యత్ తరాలు జూలోనే చూసేలా పరిస్థితులు తయారవుతున్నాయి. నాగరిక సమాజం పులుల పాలిట శాపంగా మారుతోంది. 1972 నవంబర్ 18 వ తేదిన భారత జాతీయ జంతువు గా పెద్దపులిని స్వీకరించారు. ప్రభుత్వం జాతీయ జంతువుగా ప్రకటించింది. పులి భారతదేశం, బంగ్లాదేశ్, మలేషియా, దక్షిణ కొరియా దేశాలకు జాతీయ జంతువు. శాస్త్రయ నామం పాంథేరా టైగ్రిస్. టైగర్ అనే పదం గ్రీకు భాషలోని టైగ్రిస్ నుండి వచ్చింది. దాని అర్థం బాణం. పాంథేరా అంటే పసుపు జంతువు అని అర్థం. సుమారు 11 అడుగుల పొడవు, 300 కిలోల వరకు బరువు ఉంటుంది. సుమారు 5 మీటర్ల దూరం వరకు దూకుతుంది. గంటకు 65 కిమీ వేగంతో పరుగెడుతుంది. పులి ఒంటి మీద దాదాపుగా 100 చారలు ఉంటాయి. ఏ రెండు పులుల ఒంటి మీద చారలూ ఒకేలా ఉండవు. పెద్ద పులి ఉందంటే ఆ అడవిలో పర్యావరణ సమ తుల్యం పరిఢవిల్లుతుంది. ఒక పులి సంచరించే ప్రాం తం చుట్టుపక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్‌లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ఆ ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువు లుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతోకూడిన దట్టమైన అడవి అయ్యి ఉండాలి. ఇది పెద్దపులి రాజసం. మన దేశంలో రాయల్ బెంగాల్ టైగర్ ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన జాతి. రాణా టైగర్‌గా వ్యవహరించే ఈ పులిని మన ప్రభుత్వం జాతీయ జంతువుగా ప్రకటించింది. పులి (పాన్థెర టైగ్రిస్) ఫెలిడే కుటుంబానికి చెందినదిబీ పాన్థెరా తరగతికి చెందిన నాలుగు పెద్ద పిల్లులలో ఇది ఒకటి. భారతదేశం ప్రపంచంలో కెల్లా అత్యధికంగా అడవులలో నివసించే పులుల జనాభాను కలిగి ఉన్న దేశం. వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ప్రకారం, ప్రపంచంలోని పులులలో, భారత దేశంలోనే ఉన్నాయి. పూర్వకాలములో పులులు ఎక్కువగా వుండేవి. ప్రజారక్షణ కారణంగా రాజులు వాటిని వేటాడేవారు. ఇప్పుడు వాటికే రక్షణ కరువైంది అనటంలో ఎటువంటి సందేహము లేదు. పులులను వేటాడటానికి , స్మగ్లింగ్ చేయటానికి కారణం పులి చర్మం, గోర్లు, దంతాలు చాలా విలువైనవి గా భావిస్తున్నారు. పులిలో ఔషధగుణాలు వున్నాయి అని నమ్ముతారు. ఔషధ గుణాలు వున్నట్టు ఎటువంటి శాస్త్రీయమైన ఆదారాలు లేవు. పులుల్ని వేటాడటం ఆ తర్వాత వాటి చర్మాలను ఇంట్లోని గోడలకు వేలాడదీయటం మన పూర్వపు రాజులకు ఒక ఆట. పులిగోర్లను లాకెట్లలో ధరించి మెడలో వేసుకోవటం రాచరికానికి హెూదాగా భావించేవారు. మొఘల్ చక్రవర్తులలో అక్బర్ కు పులుల వేట అంటే చాలా ఇష్టం. పులుల్ని వేటాడటం అనేది రాచరికపు హుందాతనానికి దర్పణంగా భావించేవారు. జానపద సాహిత్యంలో రాజకుమారుల వీరత్వాన్ని తెలపాలంటే, శౌర్యాన్ని ప్రదర్శించాలంటే పులులతో తలపడటమే ఉండేది. రాజులు, జమీందారులు పూర్వం వేటను వినోదంగా భావించేవారు. గ్రామాల్లోకి వచ్చే పులులను వేటగాళ్ళు కాపుకాసి మట్టుబెట్టేవారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవటం వలన, ఇలాంటి వేటల వలన కారణాలే మయితేనేం నేడు పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చాల రకాల పులులు ప్రస్తుతం విలుప్తమై పోయాయి. కొన్ని రకాల పులులు విలుప్తమయే ప్రమాదస్థితిలో జీవిస్తున్నాయి. పులి రాజసానికి, ఠీవికి పేరు. దాని కళ్ళలోని స్ఫురద్రూపం, నడకలో గాంభీర్యం చూస్తేనే వణుకు పుడుతుంది. పులి మన జాతీయ జంతువు. పూర్వపు రాజులు పులుల బొమ్మలను తమ జెండాల మీదా, మిలటరీ చిహ్నాలుగానూ ఉపయోగించేవారు. క్రీడల పోటీల సమయంలో వాటిని ఆయాదేశాల మస్కట్ లుగా కూడా రూపొందిస్తునారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల, వేటగాళ్ళ వల్ల పులుల సంఖ్య 2010 సంవత్సరంలో లెక్కల ప్రకారం 3200 సంఖ్యకు తగ్గిపోయాయి. పెద్ద సైజు అడవి పులులు 3.38 మీటర్ల పొడవు వరకు ఉంటుంది. 380 కిలోల బరువును కలిగి యుంటుంది. సాధారణ మగపులి దాదాపు 250 కిలోల బరువు ఉంటుంది. ఆడపులి సుమారు 160 కిలోల వరకు బరువు ఉండవచ్చు. సాధారణంగా పులులలో 41 రకాల ఉపజాతులున్నాయి. వీటిలో ఎన్నో రకాల పులులు ప్రస్తుతం అంతరించాయి. అంతరించిపోయే దశలో ఉన్నాయి. అందువలననే పులుల సంరక్షణ చాలా ఆవశ్యకం. ప్రస్తుతం ఉన్న జాతుల్లో బెంగాల్ టైగర్, ఇండో చైనీస్ టైగర్, మలయన్ టైగర్, సైబీరియన్ టైగర్, సౌత్ చైనా టైగర్, సుమత్రన్ టైగర్ ఉన్నాయి. భారత్, నేపాల్, టర్కీ భూటాన్, రష్యా దేశాలలో పులులు ఎక్కువగా ఉంటాయి. 1913లో ప్రపంచ వ్యాప్తంగా పులులు లక్షదాకా ఉండేవి. పులులు అధికంగా జీవిస్తున్న దేశాలలో భారతదేశం మొదటి స్థానంలో ఉన్నది. మన దేశంలో పలు 47 అభయారణ్యాలు ఉన్నాయి. భారత్‌లో పన్నెండేళ్లలో పులుల సంఖ్య రెట్టింపైంది. 2006లో 1,411గా ఉన్న వీటి సంఖ్య, 2010లో 1,706గా ఉన్న పులుల సంఖ్య 2014 నాటికి 2,226కు, 2018లో 2,967కు చేరింది. గత ఆరేళ్లలో ఏడు వందలకు పైగా పెరిగింది. 2014లో అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్‌లో పులుల సంఖ్య 68 కాగా, 2018 నాటికి ఏపీ, తెలంగాణల్లో కలిపి వీటి సంఖ్య 74కు చేరింది. ఏపీలో 48, తెలంగాణలో 26 పులులు ఉన్నాయి. పెద్దపులులు గతంలో దట్టమైన అరణ్యాల్లోనే ఉండేవి. మనుషుల జాడ ఉంటే మకాం మార్చేవి. కొన్నాళ్లుగా పులుల సంతతి పెరుగుతోంది. అదే సమయంలో అటవీ విస్తీర్ణం తగ్గుతోంది. ఈ క్రమంలో ఆవాసం కోసం అటవీ శివారు ప్రాంతాలకు అంటే జనావాసాల సమీపానికి పులులు వచ్చేస్తున్నాయి. అడవుల పెంపకం పై దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు

## సంపాదకీయం

# జూబ్లీహిల్స్ గెలుపు.. రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెంచుతుందా?

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అసాధారణ విజయం కాంగ్రెస్ లో కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చింది. నగరంలో అసలు ప్రాతినిధ్యమే లేని కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించింది. ఈ రెండు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇదే సమయంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో సాధించిన విజయం కన్నా, జూబ్లీహిల్స్ లో దక్కిన గెలుపు కాంగ్రెస్ పార్టీని అమితానందానికి గురిచేస్తోందని అంటున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి దక్కిన విజయం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిందని అంటున్నారు. గత మూడు ఎన్నికల్లో ఈ స్థానంలో ఎదురుదెబ్బలు తిన్న కాంగ్రెస్ పార్టీ విజయం అంచనాలకు మించినదిగా వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్ఎస్ సంస్థాగత బలం, అభ్యర్థి మాగంటి సునీతపై సానుభూతిని అధిగమించి 51 శాతం ఓట్లతో కాంగ్రెస్ విజయం సాధించడమంటే చిన్న విషయం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా బలం పెంచుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు అవుతోంది. ఆరు గ్యారెంటీ హామీలతోపాటు అనేక వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి అంతంతమాత్రమే సహకారం లభిస్తున్నా, ఏదో ఒక విధంగా ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారనే అభిప్రాయం ఉంది. అయితే సీఎం సమస్యలు క్షేత్రస్థాయిలో ప్రజలు పెద్దగా పట్టించుకునే పరిస్థితి ఉండకపోవడంతో చాలా హామీలు అమలు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని ప్రచారం జరిగింది. ఎన్నికల సమయంలో తమకు వాగ్దానం చేశారు కనుక హామీలు అమలు చేయాల్సిందేనని ప్రజలు పట్టుబడుతున్నారనే చర్చ జరిగింది. ఈ పరిస్థితుల్లో జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రభుత్వం ఇబ్బంది పడే అవకాశం ఉందని కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సందేహించారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ చాణక్యంతో ఈ సమస్యను అధిగమించారని జూబ్లీహిల్స్ ఫలితాలు రుజువు చేశాయని అంటున్నారు. సగం హామీలు అమలు చేయలేదన్న విమర్శలు ఉన్నప్పటికీ, బాకీ కార్డు అంటూ బీఆర్ఎస్ పార్టీ మాటల దాడి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తట్టుకుని నిలబడ్డారని అంటున్నారు. దీనివల్ల రాష్ట్రంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలోనూ నమ్మకం కలిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ నెగ్గుకురాగల సమర్థత ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల రానున్న స్థానిక ఎన్నికల్లోనూ గెలిచేస్తామన్న నైతిక బలాన్ని జూబ్లీహిల్స్ విజయం ఇచ్చిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విజయయాత్ర భవిష్యత్తులోనూ కొనసాగుతుందనే ధీమా కాంగ్రెస్ లో కనిపిస్తోందని అంటున్నారు.

# ప్రజాస్వామ్యం రక్షణలో చారిత్రాత్మక అడుగు: ముకుల్ రాయ్ కేసు తీర్పు

## రాజకీయ నైతికతకు పునరుత్థానం: డిఫెక్షన్‌పై కోర్టు నిర్ణయం - ఓటరు నిర్ణయం అవమానిస్తే... అనర్హత తప్పదని స్పష్టం చెందిన హైకోర్టు

పశ్చిమ బెంగాల్ మాజీ బీజేపీ ఎమ్మెల్యే ముకుల్ రాయ్ పార్టీ మార్పుపై వెలువడిన తాజా హైకోర్టు తీర్పు దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు పార్టీలు మార్చడం ప్రజా తీర్పుకు, ప్రజాస్వామ్య నైతికతకు స్పష్టమైన విశ్వాస ఘాతం అని సంవత్సరాలుగా వాదిస్తూ వచ్చిన 'ఆంటీ–డిఫెక్షన్' చట్టానికి ఈ తీర్పు కొత్త భాష్యంతో, కఠిన నిర్ణయంతో నిలిచింది. బీజేపీ అభ్యర్థిగా గెలిచి, అనంతరం టీఎంసీలో చేరిన రాయ్‌పై స్పీకర్ నిర్ణయం ఆలస్యం కావడంతో నెలకొన్న అనిశ్చితిని హైకోర్టు తొలగించి ఆయనను నేరుగా అనర్హుడిగా ప్రకటించడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ అధికారాలు, న్యాయవ్యవస్థ జోక్యం, పదవ షెడ్యూల్ అమలు – ఈ మూడింటి మధ్య ఉన్న సంబంధాన్ని మళ్ళీ వెలుగులోకి తెచ్చింది. పదవ షెడ్యూల్ క్రమాన్ని స్పీకర్ నిరవధికంగా వాయిదా వేస్తే, న్యాయవ్యవస్థ చేతులు కట్టుకొని ఉండలేదని సుప్రీంకోర్టు ఇంతకు ముందు పలుసార్లు స్పష్టం చేసింది. కర్ణాటకలో 2019లో, మణిపూర్‌లో 2020లో, మహారాష్ట్రలో 2023లో ఇదే న్యాయ సూత్రం అమలైంది. ఇప్పుడీ పశ్చిమ బెంగాల్ కోర్టు తీర్పు ఆ ధోరణికి మరింత బలం చేకూర్చింది. పార్టీ గుర్తుపై గెలిచిన ప్రతినిధి మరో పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజా పర్వాన్ని అపహాస్యం చేసే చర్యని కోర్టు పదే పదే పేర్కొంది. ముకుల్ రాయ్ కేసులో కోర్టు ఈ సూత్రాన్ని మరింత స్పష్టంగా ప్రయోగించి, పార్టీ మార్పు చేసిన ఎమ్మెల్యేలను రక్షించే మార్గాలు ఇక చాలా సంకుచితమని జాతీయపరంగా సంకేతం ఇచ్చింది. ఈ తీర్పు సహజంగానే తెలంగాణ రాజకీయాల్లో అలజడి రేపుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచి, అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రకటించుకున్న పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పార్టీ మార్పులపై బీఆర్ఎస్ ఎన్నికల కమిషన్, గవర్నర్, స్పీకర్, హైకోర్టు వద్ద ఎన్నో ఫిర్యాదులు చేసింది. అయితే స్పీకర్ నిర్ణయం ముందుకు సాగక పోవడం, విచారణలు నిలకడగా సాగక పోవడం రాష్ట్ర రాజకీయాల్లో అనిశ్చితిని పెంచింది. ఇప్పుడు ముకుల్ రాయ్ కేసులో తీర్పు వెలువడటంతో ఈ ఫిర్యాదులకు కొత్త ఉత్సాహం వచ్చి, తెలంగాణ కేసులు వేగం పుంజుకునే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. న్యాయ పద్ధతి ప్రకారం, భారత రాజ్యాంగం లోని పదవ షెడ్యూల్ స్పష్టంగా చెబుతుందిఒక ఎమ్మెల్యే స్వచ్ఛందంగా మరో పార్టీలో చేరితే, అది అనర్హతకు లోబడి తప్పించుకోలేని చర్య. దానికే స్పీకర్ ఆమోదం ఇవ్వాలని కూడా ఎక్కడా చెప్పలేదు. అందువల్ల స్పీకర్ ఆలస్యం చేస్తే కోర్టు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నేరుగా జోక్యం చేసుకోవచ్చు. ఈ అర్థాన్ని ముకుల్ రాయ్ తీర్పు మరింత బలపరిచింది. దీని ప్రభావం తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కేసులపై నేరుగా పడుతుంది. ప్రస్తుతం తెలంగాణలో పది మంది వరకు వేర్వేరు నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో, నియోజక వర్గాల అభివృద్ధి కోసం చేరినట్లు ప్రకటించుకున్న నేపథ్యం ఉంది. స్థానిక స్థాయిలో ఇది విపరీతమైన రాజకీయ కలకలానికి దారి తీసింది. బీఆర్ఎస్ ఇప్పటికే వీరిపై కోర్టులో వాదిస్తూ ఓటర్లు ఒక గుర్తుపై, ఒక పార్టీపై నమ్మకం ఉంచి ఓటేశారుబీ కానీ గెలిచిన తర్వాత ప్రజా తీర్పును విస్మరించడం ప్రజాస్వామ్యంపై అపచారం అని నొక్కి చెపుతున్నది. ఈ కోణం ముకుల్ రాయ్ కేసు తర్వాత మరింత బలపడింది. ఒకవేళ కోర్టులు ఈ కేసుల్లో కూడా స్పష్టమైన న్యాయ తర్కంతో నిర్ణయం వెలువరిస్తే, అనేక నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు తప్పవు. ఇది రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చగలదు. ఇక మరో ముఖ్యాంశయ స్వార్థం కోసం పార్టీ మార్చడం నేరం మాత్రమే కాదుబీ ప్రజా విశ్వాసానికి అవమానం. ఈ విషయాన్ని తెలంగాణ కేసుల్లో బీఆర్ఎస్ బలమైన వాదనగా ముందుకు తెస్తోంది. ఒకవేళ హైకోర్టు ఈ దిశగా పరిశీలిస్తే, ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో భారీ మార్పులు రావడం ఖాయం. ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనది, దీన్ని అపవిత్రం చేసే చర్యలను న్యాయపరంగా ఎట్టి పరిస్థితుల్లోనూ మన్నించ లేమని పశ్చిమ బెంగాల్ తీర్పు ఘాటుగా గుర్తు చేసింది. ఈ తీర్పుతో తెలంగాణలో పార్టీ మార్పుపై ఆందోళనలు మళ్లీ గట్టిగా మోగించ నున్నాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు తమ తీర్పును విస్మరించకుండా ఉండేలా న్యాయవ్యవస్థ కఠిన వైఖరి తీసుకుంటోందని ఇది సూచిస్తోంది. అందుచేత, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ తీర్పు ప్రజాస్వామ్య నైతికత రక్షణలో ఒక కీలక మలుపుగా నిలిచింది. తెలంగాణ సహా రాష్ట్రాలన్నింటిలో పార్టీ మార్పులపై న్యాయపరమైన కట్టుదిట్టత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే నెలలు తెలంగాణ రాజకీయాలకు అత్యంత నిర్ణాయకమని, పార్టీ మార్పు చేసిన ఎమ్మెల్యేల భవితవ్యమే కాదురాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపైనా ఈ తీర్పు స్పష్టమైన దిశానిర్దేశం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ప్రాచీన గ్రంథాలను పరిరక్షించాలి - పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా



చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారు మ్రోగుతూనే ఉంటాయి. నేను నా భార్య బిడ్డల కన్నా పుస్తకాలనే ఎక్కువగా ప్రేమిస్తాను. "పుస్తకాలు దీపాల వంటివి. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలిగిస్తుంది"... భారత రత్న ప్రపంచ మేధావి అంబేద్కర్ మాటలు మనకు నిత్య జ్ఞాపకాలే. పుస్తకం జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఆనందాన్నిస్తుంది, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుంది. అలవాట్లను మారుస్తుంది. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. జీవితానికి మార్గనిర్దేశం చేస్తుంది. తరాల మధ్య వారధిగా, జ్ఞానాన్ని పంచే మాధ్యమంగా పుస్తకం మనిషి జీవితంలో విడదీయరాని భాగం. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా. పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం. అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలం లోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి ఆయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రు లలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని "గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాల లాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యాన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వ్మాయం శృత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత, భాగవత, రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతక మైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదులు దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతులు ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సహజ అభ్యుదయ కవి ఆవంత్స - నవంబర్ 18...సోమసుందర్ జయంతి



ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ కవి, విమర్శకుడు, రచయిత. తెలంగాణ ఉద్యమాన్ని కోస్తా ప్రాంతం నుండి సమర్థించి కవిత్వం వెలువరించిన నిష్పక్షపాత వ్యక్తిత్వం ఆయనది. "ఖబడ్దార్ హే నిజాం పాదుషా .... ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు" అని గర్జించిన సాహసి. ఆయన జీవితమే కవిత్వం అని నమ్మి, జీవితాన్నే కవిత్వానికి అంకితం చేసిన వ్యక్తి, శతాధిక గ్రంథకర్త. కవిగా, కథకుడిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, అను వాదకుడిగా భిన్న రూపాలతో గత 74 సంత్సరాలుగా సాహితీ సేవ చేసాడు. సోమసుందర్ తూర్పు గోదావరి జిల్లా అన్నవరం సమీపంలో ఉన్న శంఖవరం అనే గ్రామంలో కాళ్ళూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు నవంబరు 18, 1924 న అష్టమ సంతానంగా జన్మించాడు. ఆయన ప్రాథమిక విద్యాభాసం అంతా పిఠాపురంలోనే జరిగింది. 1943లో పెద్దాపురం ఎమ్.ఆర్.కళాశాలలో చేరి, ఉన్నత విద్య నభ్యసించాడు. సోమసుందర్ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొని, 1942 లో విద్యార్థులను కూడదీసి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేశానని చెప్పేవాడు. 1944లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) లో చేరి 1945లో రాయల్ ఇండియన్ నేవీ నిర్వహించిన ధర్నాను ప్రోత్సహిస్తూ తన మొట్టమొదటి అభ్యుదయ కవిత "ఇంక్విలాబ్ జిందాబాద్"ను ప్రకటించాడు. నిజాం పాలనకు వ్యతిరేకంగా దాశరథి వంటి కవులు సాగిస్తున్న పోరాటానికి ఉత్తేజితుడై తెలంగాణ పోరాటానికి మద్దతుగా అనేక కవితలు వెలువరించాడు. యువతను ఉద్యమించమని పిలుపునిస్తూ వజ్రాయుధం అనే కవితను వ్రాశాడు. ఆ కాలంలో నిజాం వ్యతిరేక పోరాటానికి మద్దతుగా వ్రాసిన కవితలన్నింటిని ఒక సంకలనంగా వజ్రాయుధం పేరుతో విడుదల చేశారు. సోమసుందర్ స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిష్టు పార్టీ సభ్యునిగా, 1954 వరకూ కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర వహించాడు. రాజకీయాలు, సాహిత్య వ్యాసంగము ఏకకాలంలో నిర్వహించటం సాధ్యం కాదని, రాజకీయాలకు స్వస్తి పలికాడు. సోమసుందర్ నాలుగో ఫారం చదువుతున్న రోజుల్లో పద్య ప్రక్రియపై మోజు కలిగి, ఛందస్సు ను క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు. 1943 వరకూ కూడా భావ కవిత్వం ఈయనకు తారస పడలేదు. తరువాత తనదైన వచనా శైలిని అలవరచు కొన్నాడు. సోమసుందర్ కమ్యూనిష్టు భావజాలం ఈయన కవిత్వంలో అంతర్లీనంగా జాలు వారుతుంది. ఈయన కవిత్వానికి మానవుడే ప్రాతిపదిక, సమాజమే నేపథ్యం.. వజ్రాయుధం నుండి ఆమ్రపర్ణి వరకూ సుమారు ఆరున్నర దశాబ్ధాల పాటు సోమసుందర్ చేసిన కవితాయానంలో సమాజ సంకుల సమరమే అన్ని కోణా ల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఈ కవి మానవుని విస్మరించి, ఆకాశంలో విహరించిన సందర్భాలు కన పడవు. ఆయన కవిత్వం వ్రాయటం ఒక పూవు వికసించటం లాగా, చెట్లు వసంతాన్ని ధరించటం లాగా ప్రకృతి సహజమైన పనిగా పెట్టుకున్నారా అనిపిస్తుంది. ఈయన 1969–73 ల మధ్య కాకినాడ కు మకాం మార్చి "కళా కేళి" అనే సాహిత్య పత్రికను నడిపాడు. ఈ ప్రక్రియలో ఈయన కొంత ఆర్థికంగా నష్టపోయి, కొంత భూమిని కూడా అమ్ముకోవలసి వచ్చింది. ఆరున్నర దశాబ్ధాల సాహితీ యాత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు, ప్రళయాలు, కరువులు, ఎన్నో కనిపిస్తాయి. జాతి చైతన్యాన్ని కవితా చైతన్యంగా సమర్ధవంతంగా తర్జుమా చేసిన అభ్యుదయ కవిగా వన్నె కెక్కాడు. సోమసుందర్ ఓలేటి శశాంకతో పాటు రామకృష్ణ, మల్లిక్, చందు సుబ్బారావు, పెనుగొండ లక్ష్మీనారాయణ వంటి చాలా మందిని ఎందరో కవులను ప్రోత్సహించాడు. మహాకవి శ్రీశ్రీ ఆయన కవిత్వానికి దాసుడనని చెప్పుకున్నాడు. అప్పటి సమాజం అత్యంత నీచంగా చూసే దివాన్ దాసీ కులం వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేసాడు. ఆయన 1979 లో సోవియట్ లాండ్ నెహ్రూ బహుమతి, రాజాలక్ష్మీ ఫౌండేషను అవార్డు, పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్, 2008 సంవత్సరానికి ఎన్టీఆర్ స్మారక జాతీయ పురస్కారం పొందాడు. ఆవంత్స సోమసుందర్ 77 పుస్తకాలు రచించారు. చాలా పుస్తకాలు అనేక పునర్ముద్రణలు పొందాయి. వజ్రాయుధం పేరుతో నిజాం వ్యతిరేక పోరాటానికి మద్దతుగా వ్రాసిన కవితాసంకలనం. 1946 అక్టోబరు 26న దొడ్డి కొమరయ్య మరణంపై వ్రాసిన ఖబడ్దార్ అనే కవితతో ఇది మొదలవుతుంది. ఈ పుస్తకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. 1956 లో నీలం సంజీవరెడ్డి ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసింది. ఇది ఇప్పటికి 5 ముద్రణలు పొందింది. శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వారు దీనిని పాఠ్యపుస్తకంగా స్వీకరించారు. జీవితాంతం ప్రతిఏటా ఒకటో రెండో పుస్తకాలు రాస్తూనే ఉన్నాడు. ఇంకా 10 పుస్తకాలవరకూ అముద్రితంగా ఉన్నాయి. సోమసుందర్ 1979లో అత్యంత ప్రతిష్ఠాకరమైన సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి పొందాడు. రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, గౌరవ డాక్టరేట్ వంటివి పొందాడు. 2008 సంవత్సరానికి గాను ఎన్టీఆర్ జాతీయ సాహితీ పురస్కారాన్ని, 1986లో అ.ర.సం. గుంటూరు శాఖచే కొండేపూడి సాహితీ సత్కారం అందు కున్నాడు. అకాడమీ ప్రైజులు, అవార్డులు అనేకం పొందారు. ఆయనకు అనేక మంది రాజకీయ నాయకులతో, అధికార పీఠాల్లో ఉన్నవారితో మంచి సన్నిహిత సంబంధాలు వుండేవి. సోమసుందర్ తన సమ కాలీనులలో ఎవరికైనా అవార్డు వస్తే, వారిని అభినందిస్తూ వ్యాసమో, పుస్తకమో వ్రాసి ఆ అవార్డేదో తనకే వచ్చినంత ఆనందించటం ఆయన కల్మష రహిత వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలుస్తుంది. సోమసుందర్ లిటరరీ ట్రస్టును ఏర్పరచి ప్రతీ ఏటా ఐదుగురు కవులకు ఆరువేల రూపాయిల నగదు బహుమతిని అందచేస్తూ వస్తున్నారు. 2006 లో ట్రస్టు ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి ఆధునిక మహిళా సాహిత్య సదస్సు జరిపారు. దానికి రాష్ట్రం నలుమూలల నుంచీ అనేక మంది కవయిత్రులు విచ్చేసి పాల్గొన్నారు. 2016, ఆగస్టు 12 వ తేదీన కాకినాడలో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఉత్తమ ఫలితాలే లక్ష్యం

సిరిసిల్ల : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. మంగళవారం నుంచి జనవరి 9వ తేదీ వరకు 73 రోజుల పాటు వార్షిక పరీక్షలు ముగిసేదాకా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఉపాధ్యాయులు సిద్ధం అవుతున్నారు.

**3,834 మంది విద్యార్థులు**

జిల్లాలో మొత్తం 3,834 మంది పదో తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఆదర్శ, కస్తూర్బా, ఎయిడెడ్, తెలంగాణ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు రోజుకు గంటపాటు సాయంత్రం 4:15 నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రతిరోజు నిర్వహించిన ప్రత్యేక తరగతుల రికార్డు అందుబాటులో ఉండాలని.. సంబంధిత ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని.. ప్రత్యేక తరగతులు ఆరుబయట కాకుండా తరగతి గదిలోనే నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచించారు.

గతేడాది డీసీఈబీ ద్వారా సబ్జెక్టు నిపుణులతో ప్రతి సబ్జెక్టు నుంచి సుమారుగా 60 ముఖ్యమైన ప్రశ్నలు ఇచ్చారు. ఈ సంవత్సరం



డిసెంబరు నుంచి గతేడాది మాదిరిగానే ప్రతి సబ్జెక్టు నుంచి ముఖ్యమైన ప్రశ్నలు ఇచ్చి విద్యార్థులచే ప్రాక్టీస్ చేయించనున్నారు.

ప్రతీ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. ఎప్పటికప్పుడు సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తూ వారి సామర్థ్యాలను మెరుగుపరచనున్నారు.

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు గతంలో జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు దాతలుగా మారి అల్పాహారం అందించారు. ఈ సంవత్సరం సైతం అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతాం**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం. దీనికోసం ఎఫ్ఏ-1 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని 3 గ్రేడులుగా విభజించి విద్యాబోధన చేయనున్నాం. ప్రతి ఉపాధ్యాయుడికి వారి సబ్జెక్టుకు సంబంధించిన ప్రణాళికను అందజేశాం. సెలబస్ పూర్తయిన తర్వాత రివిజన్ క్లాసులు నిర్వహించాలి. ఆ తర్వాత డీసీఈబీ ద్వారా సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన ముఖ్యమైన ప్రశ్నలతో సాధన చేయించనున్నాం. జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతాం.

- శ్రీనివాస్, డీసీఈబీ సెక్రెటరీ

# నత్త.. నమిలేస్తోంది..!

గుర్రంపోడు: తెగుళ్లు చీడ పీడలతో సతమతమవుతున్న రైతులకు నత్త గుల్లల రూపంలో మరో ప్రమాదం వచ్చి పడింది. ఈసారి వానాకాలం సీజన్ నుంచి పండ్లు, ఆకుకూరలు, కూరగాయల తోటల్లో రాత్రివేళ లేత చిగుళ్లు, ఆకులు, కొమ్మలు, పూత, కాయలను నత్తలు కొరికి నమిలేస్తున్నాయి. ఉదయం ఎండ సమయానికి కనిపించకుండా పోతున్నాయి. ఏం జరుగుతుందోనని అన్నదాతలు తెలుసుకునే లోపే పంట అంతా నాశనం అవుతోంది.

జిల్లాలో బత్తాయి, దానిమ్మ, బొప్పాయి వంటి పండ్ల తోటలతో పాటు వంగ, టమాట, బీర, వంటి కూరగాయలు, పాలకూర, తోటకూర, గోంగూర వంటి ఆకుకూరలు, విస్తారంగా పండిస్తారు. సరిగ్గా జూన్ నుంచి సెప్టెంబరు మాసాల్లో తోటలకు ఇగుళ్లు రావడం, పూత పూయడం జరుగుతుంది. ప్రతిసారి ఒకటి రెండు కనిపించే నత్తలు ఈసారి అధిక సంఖ్యలో కనిపించడంతో రైతులు అనుమానించినా...అవి రాత్రి పూట వచ్చి రాత్రంతా పూతను ఇగుళ్లను కొరికిపోవడం మాత్రం ఆలస్యంగా గ్రహించి లబోదిబోమంటున్నారు. ప్రతి రైతు నత్తల బాధితులుగా మిగిలిపోవడం గమనార్హం. అధిక తేమ, నీరు భూమిలోకి ఇంకని నేలల్లో నత్తల పెరుగుదల అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణ ప్రాంతంలో నత్తల ఉనికి చాలా తక్కువ. ఇక్కడి పొడిబారిన నేలలు, మెట్ట భూముల్లో నత్తలు జీవించలేవు. బాగా తడి ప్రాంతంలో తేమ కూడిన వాతావరణంలో ఇవి మనుగడ సాగిస్తాయి. అయితే ప్రస్తుతం కనిపించే నత్తలు ఆఫ్రికా నుంచి నర్సరీ మొక్కల ద్వారా



ఇక్కడికి దిగుమతి అయి ఉంటాయని ఉద్యాన నిపుణులు భావిస్తున్నారు. పైగా ఈసారి నిత్యం కురిసే వానలతో అవి బాగా వృద్ధి చెంది ఉంటాయని చెబుతున్నారు.

వీటి నివారణకు నాలుగు లీటర్ల నీటిలో కిలో ఉప్పు కలిపి ద్రావణంగా తయారు చేసి అందులో గోనె సంచిని ముంచి నత్తలు గుంపులుగా ఉన్న చోట వేయటం ద్వారా ఉప్పు ఘాట్‌కి నత్తలు చనిపోతాయని ఉద్యానవన నిపుణులు చెబుతున్నారు.

అంచనా వేయిస్తాం...

సుభాషిణి, జిల్లా ఉద్యానవన అధికారి ...

పంటల మీద పడి నత్తలు ధ్వంసం చేయటం కొత్తగా గమనిస్తున్నాం. గతంలో ఈ సమస్య మన రాష్ట్రంలో లేదు. అధికారులను పంట భూములకు పంపించి తీవ్రతను అంచనా వేయిస్తాం. ఉద్యాన శాస్త్రవేత్తలతో చర్చించిన అనంతరం తగిన రసాయన మందులను రైతులకు సూచిస్తాం.

# ఆ పల్లెల వెనుక.. రాచర్ల చరిత్ర



ఎల్లారెడ్డిపేట : ఆనాటి కాకతీయుల పాలనకు స్మృతి చిహ్నంగా ఆ పల్లెలు పూర్వ వైభవాన్ని చాటుతున్నాయి. ఎన్నో శతాబ్దాల పురాతన చరిత్రను భావితరాలకు అందజేస్తున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆరు గ్రామాలకు ముందు ఓ కోట పేరు ఇమిడిపోయి ఉంది. అదే 'రాచర్ల' కోట. రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, రాచర్ల కోరుట్లపేట, రాచర్ల తిమ్మాపూర్, రాచర్ల బాకురుపల్లి, రాచర్ల గుండారం నామ ధేయంతో పిలువబడుతున్నాయి.

**పేరెలా వచ్చిందంటే..**

జిల్లా కేంద్రం నుంచి కామారెడ్డి వైపు 20 కిలోమీటర్లు ప్రయాణించగానే కనిపించే చారిత్రక పదం 'రాచర్ల'. ఈ ప్రాంతాన్ని కాకతీయుల సామంతులు పరిపాలించిన ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. అద్భుత శిల్పకళకు నిదర్శనంగా కొన్ని శిథిల కళాఖండాలు, కట్టడాలు ఇక్కడ దర్శనమిస్తుంటాయి. జక్కులమ్మ చెరువు, సింగసముద్రం చెరువులు నాటి సింగభూపాలుడు(సింగ మహారాజు) పాలనను గుర్తు చేస్తుంటాయి. కాకతీయుల కాలంలో రాచర్ల కోట సామంతరాజ్యంగా విరాజిల్లింది. ఆ తర్వాత రేచర్ల పద్మనాయకుల పాలనలోకి వెళ్లగా సింగభూపాలుడు ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు. ఈ 'రేచర్ల' పదమే వ్యవహారికంలో 'రాచర్ల'గా మారి ఉంటుందని చెబుతుంటారు.

**వంద ఎకరాల విస్తీర్ణంలో కోట..**

14, 15వ శతాబ్దంలో సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో కోటను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. కోట చుట్టూ తవ్విన అగాధాలను నీటితో నింపడానికి అప్పట్లో జక్కులమ్మ చెరువులో ఏర్పాటుచేసిన రహస్య బుంగ ఇప్పటికి అధికారులు కనుగొనలేకపోతున్నారు. కోటకు తూర్పు, పడమర వైపులకు ముఖ ద్వారాలను రాళ్లు, మట్టితో నిర్మించారు. కోట నుంచి చెరువులోకి వెళ్లేందుకు విశాలమైన ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఏనుగులు నీటిని తాగడానికి ఈ ద్వారం గుండా చెరువులోకి వెళ్లేవని, దాంతో ఏనుగుదిడ్డిగా ప్రసిద్ధి గాంచిందని పూర్వీకులు చెబుతున్నారు. సింగభూపాలుడు అంజనం ద్వారా బయటి విషయాలను తెలుసుకునేవారని.. మాచర్ల రాజులు కోటపై దండెత్తడంతో సింగభూపాలుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారంలో ఉంది. ఆ సమయంలో కోటలో నివసించిన ప్రజలు, వ్యాపారులు ప్రాణభయంతో పారిపోయి చుట్టుపక్కల స్థిరపడ్డారు. అప్పటి నుంచి గ్రామాలకు ముందు 'రాచర్ల' అనే పదం ఇంటిపేరులా చేరిపోయింది.

# పేదలకు గృహయోగం



పెద్దపల్లి : పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించి వదిలేసిన రెండు పడకల ఇళ్లపై దృష్టిసారించారు. అసంపూర్తి భవనాలను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించారు. భవనాలు పూర్తయిన చోట్ల మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న వాటిని ఇందిరమ్మ పథకంలో అనుసంధానిస్తున్నారు. ఇంటి స్థలం లేని ఎల్-2 కేటగిరీ వారికి పంపిణీ చేసి నిర్మించాలని నిర్ణయించారు. వచ్చే నెల 15 గడువు విధించారు. నెల వ్యవధిలో ప్రగతి లక్ష్యాలు చేరుకుంటేనే పేదల గూడు సాకారం కానుంది.

**ఇందిరమ్మ పథకంతో ..**

అసంపూరి రెండు పడకల ఇళ్లను ఇందిరమ్మ పథకంలో అనుసంధానించి పంపిణీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు వివరాలు సేకరించారు.సుల్తానాబాద్‌లో 80, ఫైవింక్లయిన్‌లో 160, పూట్నూర్‌లో 15, కాకర్లపల్లిలో 45 ఉన్నట్లు గుర్తించారు. వీటిని ఇందిరమ్మ పథకంలో సొంతింటి స్థలం లేని ఎల్-2 కేటగిరీ వారిలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గృహాలు పొందిన వారికి ఇంటి ప్రగతిని బట్టి బిల్లులు చెల్లించనున్నారు.

**మౌలిక వసతుల కల్పన**

పెద్దపల్లి నియోజకవర్గం ఓదెల 150, కాల్వశ్రీరాంపూర్‌లో 140 ఇళ్లు పూర్తయ్యాయి. ఓదెలలో విద్యుత్తు కోసం రూ. 23.83 లక్షలు, తాగు నీటికి రూ. 45 లక్షలు, కాల్వశ్రీరాంపూర్‌లో విద్యుత్తు రూ. 18 లక్షలు, తాగు నీటికి రూ. 74 లక్షలు, మురుగు కాలువల కోసం రూ. 56 లక్షలు కేటాయించారు. ఆయా పనులు కొనసాగుతున్నాయి.

**ఇక్కడ ఎంపిక అవసరం**

రామగుండం నియోజకవర్గం జనగామలో 650 ఇళ్లు పూర్తయ్యాయి. రూ. 1.24 కోట్లతో విద్యుత్తు, రూ. 3.10 కోట్లతో తాగునీరు, రూ. 3.50 కోట్లతో మురుగు కాలువలు నిర్మిస్తున్నారు. లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. అంతర్గాంలో 60 ఇళ్లు పూర్తి కావడంతో విద్యుత్తు కోసం రూ. 6 లక్షలు, తాగునీటి కోసం రూ. 25 లక్షలు, మురుగు కాలువలకు రూ. 8 లక్షలు కేటాయించారు.

# తాండూరుకేమైంది?



తాండూరు : తాండూరు సబ్‌డివిజన్ పరిధిలో గుట్టుగా నేరాలు కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణం, మండలాల్లో వ్యాపార, వాణిజ్యం పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ నేరాలతోపాటు, ఇతర ఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు, ప్రజలు కలవరపడుతున్నారు. మన ప్రాంతంలో ఇలాంటి నేరాలకు పాల్పడేవారున్నారా? అని ప్రజలు విస్తుపోతున్నారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పర్యవేక్షణ కొరవడడంతో ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**పోలీసుల కొరత**

కొన్ని పోలీస్‌స్టేషన్లలో పోలీసుల కొరత తీవ్రంగా ఉంది. ఠాణాకు 25- 30 మంది ఉండాల్సి ఉండగా, 10- 15 మందికి మించి లేరు. గ్రామీణ ఠాణాల నుంచి పట్టణ ఠాణాలకు అటాచ్ చేయించుకొని పని చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నేరశోధన కుంటుపడుతోందని పోలీసు వర్గాల్లోనే ఆందోళన నెలకొంది. కొన్ని కేసుల్లో రాజకీయ ఒత్తిళ్లు కారణమైతే, మరికొన్నింటిలో క్షేత్రస్థాయి సిబ్బంది లోతైన విచారణ చేయలేకపోతున్నారు. నిఘా సిబ్బంది, పోలీసుల మధ్య సమన్వయం కొరవడిందని ఆరోపణలున్నాయి. ఇటీవల క్లిష్టమైన కేసులు పరిష్కరించేవారిని తప్పించారన్న ఆరోపణలూ వచ్చాయి. మరికొన్ని కేసుల ఛేదనలో కొందరు పోలీసులపై ఆర్థికపరమైన ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి సంఘటనలతో జిల్లాలో పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేరాల అడ్డుకట్టకు, కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఓ పోలీసు అధికారి'కు చెప్పారు.

**కొన్ని ఘటనలు..**

తాండూరు కేంద్రంగా యువకుల బృందం దొంగనోట్లను ముద్రించి, హైదరాబాద్‌లో చెలామణి చేయడం పట్టణ వాసుల్లో కలకలం రేపింది. వారిని గురువారం పోలీసులు పట్టుకోవడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. పెద్దేముల్ మండల కేంద్రంలో గతంలో ఓ వ్యక్తి బ్యాంకులో నగదు జమ చేసేందుకు వెళ్లగా, నకిలీ నోటు రావడంతో బ్యాంకు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసు ఇంతవరకు కొలిక్కి రాలేదు.

తాండూరులో ఓ వ్యక్తి నీలి చిత్రాలు తీసి ఓ ముఠాకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. పట్టణం తోపాటు సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామాల్లో రెండేళ్ల వ్యవధిలో నాలుగు భారీ దొంగతనాలు జరిగాయి. కేసు దర్యాప్తు చేస్తూనే ఉన్నారు.

# సహకారం.. నిధుల పలహారం

హైదరాబాద్: రైతులకు సేవలందించే సహకార సంఘంలో నిధులు పక్కదారి పట్టాయి. సభ్యుల్లో కొందరు పొదుపు చేసుకున్న సొమ్మును ఇచ్చేందుకు డబ్బుల్లేవు. డిపాజిట్ల గడువు పూర్తయి నా చెల్లించలేక వాయిదాలు వేస్తున్నారు. సభ్యులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్పందించిన సహకారశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించగా.. ఇష్టానుసారంగా నిధులు ఖర్చుచేశారని తేలింది. శంషాబాద్ మండలం పాలమాకుల సహకార సంఘం లో చోటుచేసుకున్న అక్రమాలు రైతులను అందోళనకు గురి చేస్తున్నాయి. ఇందులో మూడువేల మంది సభ్యులున్నారు.

రుణాల్లో అవకతవకలు.. ఈ సహకార సంఘంలో పంటరుణాల మంజూరులోనూ భారీగా అవకతవకలు జరిగాయి. రైతుల ప్రమేయం లేకుండానే వారి పేర్లతో రుణాలు తీసుకుని లెక్కలు రాసుకున్నారు. బొద్దం ఆంజనేయులు ఆయన భార్య లక్ష్మి పేర్లతో మూడేళ్ల క్రితం రూ. 50 వేలు పంట రుణం ఇచ్చామంటూ పుస్తకాల్లో రాసుకున్నారు. అసలు, వడ్డీ కలిపి రూ. 2,19,626 బకాయిలున్నట్టు రికార్డుల్లో చూపించారు. నగదు డిపాజిట్ల చెల్లింపులూ రెండేళ్ల నుంచి వాయిదాలు వేస్తున్నారు.

రేపుమాపంటూ వాయిదా వేస్తున్నారు

పంతంగి పోచమ్మ (80) రెండేళ్ల క్రితం రూ. 3 లక్షల నగదును పాలమాకుల సహకార సంఘంలో ఏడాది కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. గడువు ముగిసినా రేపుమాపంటూ కాలయాపన చేస్తున్నారు. బ్యాంకు లావాదేవీలపై అనుమానాలతో ఆందోళన చెందుతోంది.

ఖాతాదారులకు

న్యాయం చేస్తాం-రఘు, సీఈవో

ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాదారులందరికీ న్యాయం చేస్తాం. దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు, వాహనాల కొనుగోలు, వ్యాపారాల కోసం రూ. 5 కోట్ల వరకు రుణాలు ఇచ్చాం. భారీ వ్యయంతో వాణిజ్య సముదాయం నిర్మించాం. వ్యాపారులు వాయిదాలు చెల్లించలేక చేతులెత్తేశారు.

# చక్కెర పరిశ్రమలో మట్టి దొంగలు

మల్లాపూర్: మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర పరిశ్రమకు చెందిన స్థలంలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎకరాలకొద్దీ భూమిలో మట్టి తవ్వుతూ రవాణా చేస్తున్నా చర్యలు తీసుకోకపోవడం సందేహాలకు తావిస్తోంది. పదేళ్లుగా లేఆఫ్ కారణంగా పరిశ్రమను మూసివేశారు. క్వార్టర్ల వెనుక పరిశ్రమకు చెందిన భూములున్నాయి. అందులో నుంచి కొందరు మట్టిని తరలిస్తుండగా మరికొందరు భూమిని చదును చేసి సాగు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు గానీ, పరిశ్రమ యాజమాన్యం గానీ పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రింబవళ్లు దర్జాగా..**

పరిశ్రమ పరిధిలో ప్రస్తుతం 204ఎకరాల భూమి ఉంది. ఇందులోనే పరిశ్రమతో పాటు రహదారికి ఉత్తరం వైపు క్వార్టర్లు నిర్మించారు. వాటి వెనకాల దాదాపు 60 ఎకరాల వరకు ఖాళీ స్థలం ఉంది. రహదారికి దూరంగా ఉండటం, నిర్మానుష్యంగా ఉండటంతో రాత్రింబవళ్లు హుస్సేన్‌నగర్ వైపు డి-29 కాలువ వైపు నుంచి మట్టిని తరలిస్తున్నారు.

**సూత్రధారులు ఎవరు?**



పరిశ్రమకు చెందిన దాదాపు మూడు ఎకరాల భూమి నుంచి నిత్యం వేల ట్రిప్పుల మట్టిని తరలిస్తుండటంతో ఆ ప్రాంతం చెరువును తలపిస్తోంది.ఒక్కో చోట 4 మీటర్ల లోతు వరకు మట్టిని పొక్లెయిన్లతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించడంతో భారీగా గోతులు ఏర్పడ్డాయి. రోజుల తరబడి మట్టి తరలిస్తున్నా అధికారులు 'మామూలు'గా తీసుకోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఇటీవల మొరానికి ఏర్పడిన డిమాండ్ దృష్ట్యా పలువురు అక్రమార్కులు రేయింబవళ్లు మట్టిని తరలిస్తున్నారు.

పరిశ్రమ పరిధిలోని ముత్యంపేట, వేంపేట, చిట్టాపూర్, యుసుఫ్‌నగర్ గ్రామాలకు మట్టిని తరలిస్తున్నారు.

పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. మట్టి దందా వెనుక సూత్రధారులు ఎవరు? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం

-ప్రవీణ్, ఇన్‌ఛార్జి మేనేజర్, ముత్యంపేట పరిశ్రమ

మట్టి తరలింపుపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశాం. వారు పట్టించుకోకపోవడంతో శివారు గ్రామాల వారు తరలిస్తున్నారు. అక్రమార్కులను గుర్తించి కేసులు పెట్టినా తీరు మార్చుకోవడం లేదు.

# ఇరుకు గదులు.. ఇక్కట్ల నడుమ చదువులు

పెద్దపల్లి :విద్యార్థులు వరండాలో ఉన్న ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 166 మంది విద్యార్థులు, మరో 24 మంది పూర్వప్రాథమిక పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులోనే రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పైపెచ్చులు ఊడిపోయి, ఉరుస్తున్నాయి. మిగిలిన మూడు గదుల్లో తరగతులను నడుపుతుండగా మరో గదిని స్టాఫ్‌రూంగా వినియోగిస్తూనే అందులోనే పాఠాలు బోధిస్తున్నారు. మిగతా తరగతులను వరండాల్లో కొనసాగిస్తున్నారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న పాఠశాల భవనం పురాతనంగా మారడంతో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద నిర్మించిన నూతన పాఠశాల భవనం ఇదీ. రూ. 28 లక్షల సీడీపీ, రూ. 7.80 లక్షల 'మన ఊరు- మనబడి' నిధులను వెచ్చించారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో నాలుగు తరగతి గదులున్నాయి. ఈ భవనం వెనుకాలే రూ. 24 లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ. 3.40 లక్షల ఈజీఎస్ నిధులతో వంటగది, బాలురు, బాలికలకు వేర్వేరుగా రూ. 12.40 లక్షలతో శౌచాలయాలు,



రూ. 9.50 లక్షల ఈజీఎస్ నిధులతో ప్రహరీలను నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ. 4 లక్షల విలువైన కరెంటు, రంగులు వేసే పనులు మిగిలిపోయాయి. ఇలా అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తయి సుమారు నాలుగేళ్లు దాటుతున్నా వినియోగంలోకి తేవడం లేదు. జిల్లాలో 503 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద 283 బడులను ఎంపిక చేశారు. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో విద్యుత్తు, తాగునీరు, భవనాల మరమ్మతులు, శౌచాలయాల మరమ్మతులు, లేనిచోట కొత్తగా నిర్మాణాలు తదితర కనీస వసతుల కల్పనకు రూ. 11 కోట్లు వెచ్చించారు. అంతకుముందు 'మన ఊరు- మన బడి'లో భాగంగా 172 పాఠశాలల్లో ఆయా వసతులు కల్పించారు. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. 128 సర్కారు బడుల్లో కనీసం 189 అదనపు తరగతి గదులు అత్యవసరమని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు లేక అనేక పాఠశాలలు నీరసించిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇరుకు గదులు, వరండాలు, చెట్ల కింద తమ చదువులను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి, పాఠశాలల్లో నెలకొన్న అదనపు తరగతి గదుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు: వినోద్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను నిత్యం సందర్శిస్తున్నాం. ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల కొరతను గుర్తిస్తున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నాం. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడడమే మా లక్ష్యం. నిధులు మంజూరు కాగానే అదనపు తరగతి గదుల నిర్మాణాల పనులు చేపడుతాం.

# అయిదు తరగతులకు ఒకే పాఠం!

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేట మండలం రాఘవానితండా ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కరే ఉపాధ్యాయురాలు. అయిదు తరగతులకు బోధన చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో ఆమె సెలవు కూడా పెట్టలేని పరిస్థితి. ఇక ఒకే పాఠం అయిదు తరగతుల వారు వినాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 234 పాఠశాలల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది.జిల్లా వ్యాప్తంగా: మెదక్ జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 623. వీటిలోనే అధికంగా 234 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీటిల్లో విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉండడంతో బోధనకు ఒక్కరినే కేటాయించారు. వీటిలో 51 పాఠశాలల్లో పదిలోపే విద్యార్థులు ఉండటం గమనార్హం. మారుమూల ప్రాంతాల్లో ఈబడులు కొనసాగుతుండటం వల్ల విద్యార్థుల సంఖ్య లేకపోవడం వల్ల ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. అయితే ఉన్న విద్యార్థులకు



మాత్రం సరిగా బోధన అందడం లేదు. ఉన్న ఒక్క ఉపాధ్యాయులపై పాఠశాల నిర్వహణ బాధ్యత పడటంతో బోధనకు పూర్తి స్థాయి సమయం దొరకడం లేదు.

**తప్పని ఇబ్బందులు**

ఉపాధ్యాయులకు యూడైస్ ఆన్‌లైన్ పని, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, హాజరు, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు వంటి పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాలలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. బోధన సరిగా సాగక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఉన్న ఒక్క ఉపాధ్యాయులు అన్ని తామై నడిపించడం భారంగా మారుతోంది. ఉపాధ్యాయులకు అత్యవసర పరిస్థితిలో సెలవుపై వెళ్లాలంటే ప్రత్నామ్నాయంగా ఒక ఉపాధ్యాయులైనా, సీఆర్పీ అయినా పాఠశాలకు రావాల్సిందే. పాఠశాల మూసేయకుండా ఉండేలా ఆదేశాలు ఉండడంతో సెలవు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యావాలంటీర్లు ఉన్న సమయంలో వెసులుబాటు ఉండేది. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలు, దృశ్యసమీక్షలు వంటి ఇతర సమావేశాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తోంది. ఇలా ఇబ్బందులు నడుమ ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగక తప్పడం లేదు.

**మూతపడకుండా చర్యలు**

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇబ్బందులు నడుమ కొనసాగుతున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తున్నాం. వాటిని మూసివేయకుండా ప్రత్యామ్నాయంగా అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సంఖ్య పెరిగితే ఉపాధ్యాయుల సర్దుబాటు, పోస్టుల మంజూరు చేసే అవకాశం ఉంటుంది. రాధాకిషన్ జిల్లా విద్యాధికారి

# తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో!


సిద్దిపేట : మారిన పరిస్థితుల్లో చరవాణి తోడుగా.. ఆన్‌లైన్ వేదికగా లావాదేవీలకు ప్రాధాన్యం పెరిగింది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ నమోదు.. నవీకరణ పేరిట.. గాలం వేసి బురిడీ కొట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి సందర్భాల్లో ఈ కేవైసీ(నో యువర్ కస్టమర్) అవసరం.. ప్రక్రియను ఎక్కడ.. ఎలా చేపట్టాలనే సమాచారం మీకోసం..

**పథకాల లబ్ధిదారులకు..**

ప్రభుత్వ రాయితీ, వివిధ పథకాల కింద లబ్ధి పొందాలంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కింద బ్యాంకులు ఆధార్, మొబైల్ నంబరు, ఇతర వివరాలు(కేవైసీ) జత చేయాలని సూచిస్తుంటాయి. ప్రధానంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు, చేయూత పింఛనర్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నగదు జమ క్రమంలో ప్రత్యేకంగా అడుగుతుంటాయి. ఖాతాకి ఆధార్, పాన్ కార్డును లింకు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తుంటారు.

**మూడు విభాగాల్లో పరిశీలన**

బ్యాంకు వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. లో రిస్క్ (చిరువ్యాపారులు, ఉద్యోగులు) పదేళ్లకోసారి, మీడియం రిస్క్(స్థిరాస్తి, ఉన్నత స్థాయి వ్యాపారులు, కంపెనీలు నిర్వహించే వారు) ఎనిమిదేళ్లకోసారి, హైరిస్క్(ఎగుమతి-దిగుమతి వ్యాపారులు, అధిక రిస్కు దేశాల్లో ఉండేవారు, నేర చరితులు) రెండేళ్లకోసారి రీ-కేవైసీ చేయాలి.




**వీరు బ్యాంకుకు వెళ్లాల్సిందే..**

సంతకాలు, ముఖ కదలికలు, వివిధ రకాల వివరాల మార్పు సహజంగా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఖాతాదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా బ్యాంకులు ఆహ్వానిస్తుంటాయి. లావాదేవీలు సక్రమంగా చేపట్టేందుకు, నవీకరణకు పునః ప్రక్రియ దోహదం చేస్తుంది. ఖాతా ఏడాది నుంచి రెండేళ్ల పాటు వినియోగించకుంటే ఇన్‌యాక్టివ్ దశలోకి వెళ్తుంది. బ్యాంకు ద్వారా వడ్డీ లాంటివి జమ అయినా.. ఖాతాదారుల లావాదేవీలు మాత్రం స్తంభిస్తాయి. రీ-కేవైసీ, ఈ-కేవైసీ పత్రాల సమర్పణను బ్యాంకుల్లో నేరుగా ఖాతాదారు చేపట్టడం ఉత్తమం. **నేరుగా సంప్రదించాలి**హరిబాబు, ఎల్‌డీఎం, సిద్దిపేట

రెండేళ్లుగా ఖాతాను వినియోగించని వారు సంబంధిత బ్యాంకుల్లో అధికారులను నేరుగా సంప్రదించాలి. నిర్దేశిత ధ్రువపత్రాలతో కేవైసీ ఫారాన్ని పూరించి సమర్పించాలి. గుర్తుతెలియని, అనుమానిత నంబర్ల నుంచి వచ్చే లింకులు, ఫోన్లకు స్పందించవద్దు.

# రాళ్లు వెనకేసుకొంటున్నారు..



బషీరాబాద్: మండలంలోని నాలుగు గ్రామాల్లో నాపరాయి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా యంత్రాలను వినియోగించి మట్టిని తోడేసి నాపరాళ్లను వెలికి తీస్తున్నారు. ఈ విషయం గనులు, భూగర్భ, రెవెన్యూ శాఖల అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అక్రమ తవ్వకాలను కొందరు వ్యక్తులు పోటాపోటీగా సాగిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఎక్మాయి గట్టుపై దాడులు చేసి లారీని పట్టుకున్నారు. హెచ్చరించినా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు.

**మండలంలో ఎక్కడెక్కడంటే..**

మండల పరిధి ఎక్మాయి గట్టు, క్యాద్గిర, జీవన్గీ, కొర్విచేడ్‌లో వందల ఎకరాల ప్రభుత్వ భూముల్లో నాపరాయి గనులున్నాయి. ఎక్మాయి గట్టుపై, క్యాద్గిర భూముల్లో నాపరాళ్లు నాణ్యంగా ఉంటాయన్న పేరుంది. గతంలో కొందరికి ఇచ్చిన అనుమతుల గడువు ముగిసినా.. అవే పత్రాలను పట్టుకొని నేతల అండతో గనులు తోడేస్తున్నారు. మరికొందరు ఎలాంటి అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపి లారీల్లో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి..**

రాయల్టీ లేకుండా తరలిస్తుండడంతో రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఆయా గ్రామాల ప్రజలు, యువకులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప గనులు, రెవెన్యూ శాఖల అధికారులు దాడులు నిర్వహించడం లేదు. దాడులు చేసినా పూర్తిస్థాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఆయా గ్రామాల్లో నాపరాళ్లను కోత కోసేందుకు విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నారని, అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

గ్రామాలు: 5మొత్తం గనులు: 180

నాపరాళ్లు తరలించే లారీలు: 30 (రోజువారీగా)

దాడులు నిర్వహిస్తాం..: షాహిదాబేగం, తహసీల్దార్, బషీరాబాద్

ప్రభుత్వ భూముల్లో అనుమతుల్లేకుండా ఎలాంటి పనులు చేయొద్దు. రెవెన్యూ, గనులశాఖ అనుమతులు తీసుకొని నాపరాళ్లను తవ్వాలి. లేదంటే దాడులు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# కూరగాయల సాగు.. రాయితీలు బాగు



ధర్మారం :కూరగాయల సాగులో స్వయం సమృద్ధిని సాధించేందుకు ప్రభుత్వాలు రాయితీ అందిస్తున్నాయి. అవసరానికి సరిపడా కూరగాయల సాగు విస్తీర్ణం పెరిగేలా ప్రోత్సహించడం, దిగుబడి పెరిగేలా సాంకేతిక విధానాలను వివరించడం ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే పూర్తి రాయితీపై మేలు రకాల వంగడాలకు సంబంధించిన నారు అందించడంతోపాటు మల్చింగ్, బిందు సేద్యం, స్టేకింగ్(తీగజాతి రకాలకు ఊతకర్రలు, స్టేకింగ్) ఏర్పాటుచేసుకునేందుకు రాయితీ అందిస్తోంది. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి.

**50 శాతం రాయితీతో మల్చింగ్**

నేలలో తేమ నిలుపుదల, కలుపు నివారణకు దోహదం చేయడానికి తోడ్పడే మల్చింగ్ కవర్లు వినియోగిస్తారు. ఇందుకు ఎకరాకు రూ.16 వేలు ఖర్చవుతుంది. ఇందులో ప్రభుత్వం 50 శాతం రాయితీని అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు అవకాశముంది. టమాటా సాగులో దారాలతో స్టేకింగ్ చేస్తారు. దీనికి సైతం హెక్టారుకు రూ.10 వేల రాయితీ అందిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**బిందు సేద్యానికి..**

జిల్లాలో 800 ఎకరాలకు బిందు సేద్యం ఏర్పాటు చేసేందుకు వీలుంది. అయిదు హెక్టార్లు(12.5 ఎకరాలు) వరకు రాయితీ వర్తిసుంది. ఎస్సీ ఎస్టీ రైతులు కేవలం జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది. బీసీలు జీఎస్టీతోపాటు యూనిట్ ఏర్పాటు ఖర్చులో 10 శాతం చెల్లించాలి. ఇతర రైతులకు అయిదెకరాల వరకు 90 శాతం, ఆపై 80 శాతం రాయితీ వస్తుంది. జీఎస్టీలోనూ ప్రభుత్వం రూ.5 వేల వరకు రాయితీ ఇస్తోంది.

ఉద్యానశాఖ లెక్కల ప్రకారం జిల్లా అవసరాలకు వెయ్యి ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తే సరిపోతాయి. ఈ ఏడాది కేవలం 373 ఎకరాల్లోనే సాగు చేశారు.

**రైతుల ఖాతాకే రాయితీ సొమ్ము**

పట్టాదారు పాసు పుస్తకం, రైతు ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం, పాసుపోర్టు సైజు ఫొటో దరఖాస్తుకు జతచేయాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి మంజూరు చేస్తాం. యూనిట్ గ్రౌండింగ్ పూర్తయ్యాక.. ఏర్పాటు చేసుకున్న పరికరాలకు సంబంధించిన బిల్లులు అందించాలి. రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమవుతోంది.

మహేశ్, ఉద్యానశాఖ అధికారి, పెద్దపల్లి

# దక్షిణాదికి వెలుగు రేఖ



రామగుండం : దక్షిణాదికి వెలుగురేఖగా రామగుండం ఎన్టీపీసీ విరాజిల్లుతోంది. నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ 1978 నవంబరు 14న పునాదిరాయి వేయగా 200 మెగావాట్ల 3 యూనిటు 500 మెగావాట్ల 4 యూనిట్లతో 2600 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు ద్వారా 1600 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాలు పనిచేస్తున్నాయి. త్వరలో మరో 2400 మెగావాట్ల కేంద్రాలను నిర్మించనుంది. నాణ్యతకు మారుపేరుగా నిలుస్తున్న ఎన్టీపీసీతో 48వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

**డిజిటల్ కంట్రోల్ సిస్టమ్...**

సాంకేతిక అభివృద్ధితో డిజిటల్ కంట్రోల్ సిస్టమ్ విధానంలో ఒకే చోట ఉండి నియంత్రణ చేస్తున్నారు. పరిశ్రమలో నీటి సామర్థ్యం, ఉష్ణోగ్రతల తేడాలు, బొగ్గు వినియోగం, బూడిదను డిజిటల్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా నియంత్రణ గది నుంచే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసం 200 మెగావాట్ల మూడు యూనిట్ల టర్బైన్, జనరేటర్ విభాగాలను ఆధునికీకరిస్తున్నారు. గతంలో 2000 మంది ఉద్యోగులు, అధికారులున్న పరిశ్రమలో సాంకేతిక అభివృద్ధితో నేడు 680 ఉద్యోగులు, అధికారులు, 4500 మంది ఒప్పంద కార్మికులున్నారు.

**ఎఫ్‌జీడీ దిశగా...**

రామగుండం ఎన్టీపీసీలో వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఎఫ్‌జీడీ(ఫ్యూయల్ గ్యాస్ డీసల్ఫరైజేషన్) యూనిట్‌ను నెలకొల్పను న్నారు. ఎఫ్‌జీడీ విధానంతో వాతావరణంలో కలిసే విషవాయువులను తగ్గించే దిశగా యాజమాన్యం ముందుకు సాగుతోంది. పర్యావరణ పరిరక్షణ నిర్వహణలో 275 మీటర్ల చిమ్నీ, గ్యాస్ డిసల్ఫరైజేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగించడంతో బొగ్గు వినియోగం తగ్గుతుందని, దీంతో తక్కువ కాలుష్యం వెలువడుతుందని అధికారులు చెబుతున్నారు.

**రూ.7 కోట్లు హరితహారానికి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారానికి ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యత పథకం(సీఎస్సార్) కింద సుమారు రూ.7 కోట్లు హరితహారానికి వెచ్చించారు. సుమారు 35 వేల మొక్కలు నాటడం, 50 వేల మొక్కలు నాటే ప్రక్రియ ఉంది.

**సౌర విద్యుత్తుపై ప్రత్యేక దృష్టి**

సౌర విద్యుత్తును మరింత ఉత్పత్తి చేసేందుకు రామగుండం ఎన్టీపీసీ మరో అడుగు ముందుకు వేసింది. 100 మెగావాట్ల నీటిపై తేలియాడే సౌర ఫలకాల విద్యుత్తు కేంద్రం నిర్మాణం కూడా పూర్తి చేసి విద్యుత్తు వినియోగం ప్రారంభించారు.

**అవార్డులు**ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు-2024

ఎన్టీపీసీకి ఎనర్జీ కంపెనీ అవార్డు

ఎన్టీపీసీకి గ్రామీణ క్రీడల నైపుణ్యం బంగారు అవార్డు

సామాజిక అవగాహన యాడ్ ఫిల్మ్ బంగారు అవార్డు

హెచ్‌ఆర్ వైవిధ్యం బంగారు అవార్డు

ప్రజా ఆధారిత అభ్యాసాల కాంస్య అవార్డు

సీఎస్‌ఆర్ ఆవిష్కరణలకు కాంస్య అవార్డు

అంతర్జాతీయ ఎనర్జీ అవార్డు(ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగవాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌కు అవార్డు లభించింది)ఎస్‌ఆర్‌ఈఐ అవార్డు పవర్ క్విజ్ విజేతగా ఎన్టీపీసీకి అవార్డు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో నిర్వహించిన ఇండియన్ పవర్‌స్టేషన్(ఐపీ ఎస్) సమ్మిట్ 2025 రాజభాష అవార్డు ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణకు గుజరాత్‌లోని గాంధీనగర్ మహాత్మా మందిర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశస్థి పత్రం స్వీకరణ ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియన్సీ ప్లాంటు అవార్డు-2025(సీఐఐ) గెలుచుకొంది.

# ఇందిరమ్మ పేరు.. ఇసుకాసురుల తీరు

రామడుగు: రామడుగు పరిధి గుండా ప్రవహించే మోతెవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నామని చెబుతూ.. సమీప మండలాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోరిటపల్లి, వన్నారం, రామడుగు, రుద్రారం తదితర గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఈ దందా సాగుతోంది.

**మూడు మండలాలకు తరలిస్తూ..**

గత జూన్ వరకు రామడుగు మండలంలో 750 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే మోతెవాగు నుంచి సేకరించే ఇసుకకు అధికారులు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ఇదే అదనుగా అక్రమార్కులు కొత్తపల్లి, గంగాధర, పెగడపల్లి మండలాలకు తరలించి అధిక ధరకు విక్రయించుకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సమీప మండలాలకు తరలిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

**పడిపోయిన భూగర్భ జలాల మట్టం**

ఇసుక అంతరించి భూగర్భ జలాల మట్టం పడిపోతుందని రైతులు వాపోతున్నారు. గతంలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసేందుకు మైనింగ్ శాఖ అధికారులు సర్వే చేశారు. కానీ ఇసుక అక్రమ రవాణాదారులు



స్థానికులను పురమాయించి క్వారీ ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. మరోవైపు డ్రైవర్లు అతి వేగంగా వెళ్తుండటంతో గ్రామాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**అధికారుల కళ్లు గప్పి..**

ఇసుక నింపిన ట్రాక్టర్ మోతె వాగు నుంచి బయలుదేరిన స్థలం నుంచి గమ్యం చేరేవరకు సెల్‌ఫోన్ల ద్వారా అక్రమ వ్యవహారాన్ని అధికారుల కంట పడకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం 25 క్యూబిక్ మీటర్ల(10ట్రాక్టర్ల) ఇసుకను అనుమతించింది. ఈ లెక్కన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన నెల రోజుల్లోనే రామడుగు మండలానికి సరిపడా ఇసుక రవాణా పూర్తవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ అక్రమ రవాణా అరికట్టాలని మోతె వాగు పరిసర రైతులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ రాజేశ్వరిని వివరణ కోరగా.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల అవసరాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఇసుక టోకెన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు.

# గంటలో వైద్యం.. ప్రాణాలు భద్రం

గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో రహదారి ప్రమాదాల్లో సగటున రోజుకు ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోతున్నారు. నిత్యం ఏదో ఒక చోట రహదారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గాయపడ్డ వారికి గంట వ్యవధిలో అత్యవసర చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుంది. ఏదైనా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో వైద్య సేవలందించేందుకు 'ట్రామా' కేంద్రాలు పనిచేస్తాయి. సురక్షితమైన భవిష్యత్తు నిర్మించాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

**ప్రతి 25 కి.మీ.కు ఒకటి**

హైవేలు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో ప్రతి 25 కి.మీ.కు ఒక ట్రామా కేంద్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. దీని వల్ల ప్రమాదం ఎక్కడ జరిగినా కేవలం అరగంట వ్యవధిలోనే ట్రామా కేంద్రానికి క్షతగాత్రులను చేర్చే అవకాశం ఉంటుంది. ట్రామా కేంద్రంలో అత్యవసర చికిత్సకు సంబంధించిన వైద్య సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటంతో ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుంది.

**ప్రమాద తీవ్రత ఆధారంగా చికిత్స**

ప్రమాదాలు చోటుచేసుకునే సమయంలో చాలా సందర్భాల్లో అవయవాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. తీవ్రరక్తస్రావం కావడంతో పాటు ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడతారు. ఆ సమయంలో వైద్యం అందించేందుకు అందుబాటులో ఆస్పత్రులు ఉండవు. ఒకవేళ ఉన్నా అందులో అధునాతన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు ఉండరు. ఇలాంటి సమయాల్లోనే ట్రామా కేంద్రాలు ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో అత్యవసర చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంది.

**క్రిటికల్ కేర్‌తోనే సరి**

అత్యవసర వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. గోదావరిఖని, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించేందుకు పనులు తుది దశకు చేరుకొన్నాయి. సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంకా క్రిటికల్ కేర్ సేవలు అందించేందుకు పనులు మొదలు పెట్టలేదు.

**ఉమ్మడి జిల్లాలో ఒక్క కేంద్రం లేదు**

ఉమ్మడి జిల్లాలో ఒక్క ట్రామా కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. గుండ్లపల్లి నుంచి గోదావరిఖని వరకు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మీదుగా రాజీవ్ రహదారి 100 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇటు కరీంనగర్ నుంచి వరంగల్ వరకు 65 కిలోమీటర్లు, జగిత్యాల నుంచి కరీంనగర్, మెట్‌పల్లి నుంచి జగిత్యాల, కరీంనగర్ నుంచి సిరిసిల్ల, జగిత్యాల నుంచి రాయపట్నం వరకు ప్రధాన రహదారులున్నాయి. కరీంనగర్ నుంచి చొప్పదండి మీదుగా రాయపట్నం వరకు ప్రధాన రహదారి ఉంది. పెద్దపల్లి నుంచి మంథని వరకు ఉన్న రహదారుల్లో ఒక్క కూడా ట్రామా కేంద్రం లేదు. కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్, జగిత్యాల జిల్లాలో వెల్గటూరు వద్ద ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు.

**మన చేతుల్లోనే**

కారు డ్రైవింగ్ చేసే సమయంలో సీటుబెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి మద్యం తాగి, చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపకూడదుఅపసవ్య దిశలో ప్రయాణం చేయొద్దు

# పేరుకే 'డీలక్స్'

హైదరాబాద్: గతంలో ఈసీఐఎల్ నుంచి కోఠి మార్గంలో 3, 3కే, 3కేఎన్ నంబరు డీలక్స్ బస్సులను తిప్పిన ఆర్టీసీ.. అన్ని బస్సులను చర్లపల్లికి మార్చేసింది. దీంతో ఈసీఐఎల్, బర్కత్‌పుర, కాచిగూడ, విద్యానగర్, కుషాయిగూడ, బండ్లగూడ నుంచి నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 16ఏ నంబరు మార్గంలో నడిచే డీలక్స్ బస్సును చర్లపల్లి వరకు పొడిగించిన ఆర్టీసీ.. ఈసీఐఎల్ మీదుగా కాకుండా మరో మార్గంలో మళ్లించడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

గ్రేటర్ పరిధిలో మొత్తం 275 డీలక్స్ బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. అన్ని బస్‌స్టాప్‌లలో నిలపకుండా ప్రయాణికులను త్వరితగతిన గమ్యస్థానాలకు చేరుస్తాయనే ఉద్దేశంతో 9 వేల మంది నెలవారి బస్‌పాసులు తీసుకున్నారు. కొన్నాళ్లకే ఆయా మార్గాల్లో డీలక్స్ బస్సులను తగ్గించిన ఆర్టీసీ వాటిని ఇతర మార్గాలకు మళ్లించింది. దీంతో బస్‌పాస్ కొనుగోలు చేసిన ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. రూ.1830తో నెలవారీ పాస్ తీసుకొని లాభం ఏంటని ప్రశ్నించగా...ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించొచ్చని అధికారులు వింతగా సమాధానమిస్తున్నారు.

గ్రేటర్‌లో ప్రతినెలా 10,000 మంది ఆర్డినరీ మంత్లీ పాస్‌లు తీసుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్ పాస్‌లు 80,000, మెట్రో డీలక్స్ బస్సు పాసులు 9 వేల మంది తీసుకుంటున్నారు. డీలక్స్ పాస్ ఉన్నవారు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లలోనూ ప్రయాణించే వెసులుబాటు ఉంది. అయితే



సులభతర ప్రయాణం, సౌకర్యవంతంగా ఉంటుందని డీలక్స్ పాస్ తీసుకుంటే సర్వీసులు తగ్గించడంతో వీటితో ప్రయోజనం ఏంటన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.గతేడాది ఏప్రిల్‌లో మెట్రో డీలక్స్ బస్సులను రోడ్డెక్కించిన ఆర్టీసీ తొలుత 1హెచ్, 49ఎం, 3కే, 3, 3కేఎన్, 16ఏ మార్గాల్లో ప్రారంభించింది. తర్వాత మరికొన్నింటిని ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్, ఏఎస్‌రావునగర్, సఫిల్‌గూడ, ఆనంద్‌బాగ్, అనుటెక్స్, మల్కాజిగిరి, మెట్టుగూడ, రైల్ నిలయం, సికింద్రాబాద్ (ఉప్పల్ వైపు), అఫ్జల్‌గంజ్, సీబీఎస్, కాచిగూడ క్రాస్‌రోడ్స్, బర్కత్‌పుర, విద్యానగర్, తార్నాక తదితర ప్రాంతాలకు ఉపయుక్తమయ్యేలా సర్దుబాటు చేసింది. అయితే కొన్నాళ్లకు బస్సులను వేరే మార్గాలకు మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

# చేసేది కొంత... బిల్లులేమో చాంతాడంత!

హైదరాబాద్: జలమండలిలో ఎయిర్‌టెక్ మిషన్లు గుత్తేదారులకు కాసులపంట పండిస్తున్నాయి. వారు చేసిందే పని.. అడిగిందే సొమ్ము అన్నట్లుగా నెలనెలా కోట్ల రూపాయలు జలమండలి చెల్లిస్తోంది. పాత ఎయిర్‌టెక్ మిషన్లు వాడుతూ తక్కువ సామర్థ్యంతో తక్కువ పనిచేసి పెద్ద మిషన్లు, పెద్ద యంత్రాలు వాడినట్లు బిల్లులు తీసుకుంటున్నారు. పనిచేసిన వెంటనే మురుగు పొంగడం, బ్లాకేజీలు సాధారణంగా మారింది. మురుగు కాలువల్లో తీసిన స్లడ్జ్‌ని బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో పారిశుధ్య, పర్యావరణ సమస్యలకు దారితీస్తోంది.

వాస్తవమైన మురుగు శుద్ధి రికార్డులు లేకుండా తప్పుడు లాగ్‌లు చూపిస్తున్నట్లు గుర్తించారు.

శిక్షణ లేని ప్రైవేట్ వ్యక్తులను ఉపయోగించడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. మురుగు సమస్యలు పూర్తిగా పరిష్కారంకావడం



లేదు.

**ఆన్‌లైన్ పర్యవేక్షణతోనే అడ్డుకట్ట:** సెక్షన్లవారీగా ఎయిర్‌టెక్‌మిషన్లు కేటాయించారు. ఎంత పనిచేశారు? సమస్య పూర్తిగా పరిష్కారం అయిందా? పనులు చేసిన చోట మళ్లీ సమస్య వస్తోందా? వంటి అంశాల జోలికిపోకుండా కాంట్రాక్టర్లు అడిగిందే తడవుగా బిల్లులను చెల్లిస్తున్నారు. దీనిపై దృష్టి సారిస్తున్నామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. జీపీఎస్ సహా ఆన్‌లైన్ పర్యవేక్షణతోనే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని అభిప్రాయపడ్డారు.

ఎయిర్‌టెక్ మిషన్లు: 200పైగా

వినియోగం: ఐదేళ్లకు పైగా

ఒక్కో మిషన్‌కు నెలకు చెల్లించే మొత్తం: రూ.3.5లక్షలు

ఏడాదికి చెల్లిస్తున్న మొత్తం: రూ.70 కోట్లకు పైగా

# ఆర్టీఏకు కాసుల పండగ

కరీంనగర్ : దసరా.. దీపావళి పండగల సమయంలో ఉమ్మడి జిల్లాలో వాహనాల కొనుగోళ్లు పెరిగాయి. కొత్త వాహనాలు కొనుగోలుదారుల ఇళ్లకు చేరగా.. రవాణా శాఖకు కాసుల పంట పండింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 16 వరకు 4,472 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా రవాణా శాఖకు రూ.28.32 కోట్ల ఆదాయం సమకూరింది. నాలుగు జిల్లాల్లో అన్ని రకాల వాహనాలు 4,472 రిజిస్ట్రేషన్ కాగా ఇందులో 2,754 ద్విచక్ర వాహనాలు, 489 కార్లు ఉన్నాయి. అక్టోబరు- 2024లో దసరా సందర్భంగా 2,096 ద్విచక్ర వాహనాలు, 356 కార్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. రవాణా శాఖకు రిజిస్ట్రేషన్, జీవితపన్ను, ఇతరత్రా రూ.24.59 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సంవత్సరం రూ.28.32 కోట్ల ఆదాయం ఆర్జించింది.గతేడాదితో పోలిస్తే ఈసారి ద్విచక్ర, కార్ల విక్రయాలు పెరిగాయి. సెప్టెంబరు 22, 2025 నుంచి జీఎస్టీలో మార్పులతోపాటు ఆయా కంపెనీలవారు రాయితీలు ప్రకటించడం కూడా వాహనాల కొనుగోళ్లు పెరగడానికి కారణమైంది.

# నకిలీ ఇంజిన్ ఆయిల్.. వినియోగిస్తే వాహనాలకు ముప్పు




హైదరాబాద్ : నగరంలో ఇటీవల ప్రముఖ బ్రాండ్ పేరుతో నకిలీ ఇంజిన్ ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ బ్రాండ్ లేబుల్‌ని బాటిళ్లపై అంటించి అమ్ముతున్నట్లు గుర్తించారు. అతడి నుంచి రూ.3 లక్షల విలువచేసే సుమారు 710 లీటర్ల నకిలీ ఇంజిన్ ఆయిల్ సీజ్ చేశారు.

హైదరాబాద్‌లో ఇంట్లో రెండు ద్విచక్రవాహనాలు, పది మందిలో ఆరుగురికి కార్లు ఉన్నాయి. వాటిల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే.. క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించాలి. నాణ్యమైన ఇంజిన్ ఆయిల్ వినియోగిస్తూ.. దాన్ని ఎప్పటికప్పుడూ మార్చుకోవాలి. ఇలాంటి ఆయిల్‌ని కూడా నకిలీ చేస్తున్నారు. బ్రాండెడ్ ఇంజిన్ ఆయిల్ లేబుళ్లు వేసి తక్కువ ధరకే విక్రయిస్తుండగా అవగాహనలేమితో చాలామంది కొని మోసపోతున్నారు. ఇలాంటి సందర్భంలో జాగ్రత్తలతో నకిలీ ఆయిల్‌ను గుర్తించి, ముప్పుని ముందుగానే ఆపేయవచ్చని ఆటోమొబైల్ నిపుణులు చెబుతున్నారు.

**ప్రధాన సంకేతాలివీ..**

నకిలీ ఆయిల్ బాటిళ్లకు ప్యాకేజీ, సీలింగ్‌లో తేడాలుంటాయి. వాటిపై అర్థంకాని అక్షరాలు, నాణ్యత సరిగాలేని ముద్రణతో లేబుళ్లు ఉంటాయి. ప్రత్యేకంగా బ్రాండ్ హెూలోగ్రామ్, సీల్, క్యూఆర్ కోడ్‌లను తనిఖీ చేయాలి.

నకిలీ ఇంజిన్ ఆయిల్ తేలికపాటి, పలుచని రంగుతో కనిపిస్తుంది. అసలైనది పెట్రోల్ వాసనతో ఉంటుంది. ఘాటు రసాయన వాసన వస్తే నకిలీదిగా అనుమానించాల్సిందే.

నకిలీ ఆయిల్‌ను చాలా తక్కువ ధరకు విక్రయిస్తారు.

తయారీ సంస్థ చిరునామా వంటి ముఖ్యమైన సమాచారం లేకుంటే అనుమానించాల్సిందే.

**కలిగే నష్టాలివీ..**

నకిలీ ఆయిల్ వాడకంతో ఇంజిన్‌లో ఘర్షణ అధికమై.. అంతర్గత భాగాలు అరిగిపోతాయి. బేరింగ్‌లలోనూ సమస్యలు ఉత్పన్నమవుతాయి.

తుప్పు నుంచి రక్షణ, పనితీరును మెరుగుపర్చడానికి ఇంజిన్ ఆయిల్ దోహదం చేస్తుంది. నకిలీది వాడటంతో వాహన ఇంజిన్ జీవితకాలం గణనీయంగా తగ్గిపోతుంది.

నకిలీ ఇంజిన్ వాడకం ద్వారా పెట్రోల్, డీజిల్ ఎక్కువగా కాలుతుంది. మైలేజీ తగ్గుతుంది.

తరచుగా మరమ్మతులతో నిర్వహణ ఖర్చులు పెరిగిపోతాయి.

**నమ్మకస్థుల దగ్గరే కొనాలి**

'ఇంజిన్ ఆయిల్‌ని నమ్మకస్థుడైన, ఆథరైజ్డ్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. తక్కువ ధర వాటిని కొనుగోలు చేసే వాడితే.. వాహనాల పనితీరు మందగిస్తుంది. కొద్దిదూరం ప్రయాణించినా ఇంజిన్ వేడెక్కుతుంది. అగ్నిప్రమాదాలకు కూడా ఆస్కారం ఉంటుంది.'బి.నాగరాజు, ఆటో మొబైల్ నిపుణుడు, ఉప్పల్

# నిబంధనాల ఛత్రం..పదోన్నతులు దూరం



హైదరాబాద్ : 'మీరు మౌఖిక పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోతే.. డీమోషన్ ఇస్తాం.. ఇంతవరకు మీరు పొందిన అధిక వేతనం కూడా రికవరీ చేస్తాం. దానికి మీరు అంగీకారం తెలిపితే ఇంటర్వ్యూకు హాజరుకండి.. లేకపోతే వెళ్లండి..'ఎంతో చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుల పదోన్నతుల్లో ఎదురైన ఇబ్బందికర పరిస్థితి ఇది. స్వయంగా వర్సిటీ వైస్ ఛాన్స్‌లరే ఈ నిబంధన విధించడం గమనార్హం. ఈ షరతుతో.. పలువురు ఇంటర్వ్యూకు హాజరుకాలేదు. యూజీసీ చరిత్రలో ఎక్కడా లేని నిబంధన ఇది. దీనిపై ఆచార్యులు ఆందోళనబాట పట్టారు. మొత్తం 55 మందికి అన్యాయం జరిగిందని వర్సిటీ ఆచార్యుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఉస్మానియా వర్సిటీ పరిధిలో క్యాంపస్ కళాశాలతో పాటు నిజాం కళాశాల, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ, కోఠి కళాశాలలు ఉన్నాయి. కోఠి మహిళా కళాశాలకు ఇటీవల వర్సిటీగా గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 1232 శాశ్వత ఆచార్యుల పోస్టులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 290 మంది మాత్రమే ఉన్నారు. మిగిలినవి ఒప్పంద పద్ధతిలో తీసుకుంటున్నారు. మొదట సహాయ ఆచార్యులుగా ఉద్యోగంలో చేరతారు. తర్వాత పదోన్నతులు ఇవ్వడానికి యూజీసీ నిబంధనల ప్రకారం మార్గదర్శకాలున్నాయి. ఉస్మానియా సొంత షరతులు విధిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గత (సెప్టెంబరు) నెల 16 నుంచి 24 వరకు పదోన్నతుల ప్రక్రియ జరిగింది. ఉస్మానియాలో నిబంధనలను పక్కన పెట్టి ఇంటర్వ్యూలో కేవలం అకడమిక్ ప్రశ్నలు అడిగి, 20కి 8 మార్కులు వేసి ఫెయిల్ చేస్తున్నారని ఆచార్యులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పదోన్నతులకు మౌఖిక పరీక్షలు నిర్వహించాల్సిన ఉప కులపతి ఏడాదికి ఒకసారి మాత్రమే జరుపుతున్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్షకు 103 మందిని పిలిచి 55 మందిని ఫెయిల్ చేశారు. **కొన్ని ఉదాహరణలు పరిశీలిస్తే..**

భౌతికశాస్త్రం విభాగానికి చెందిన ఖలీమ్ అసిస్టెంటు నుంచి అసోసియేట్ పదోన్నతికి హాజరయ్యారు. ఆయన పరిశోధన పత్రాలు నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకం. అయినా ఆయనకు పదోన్నతి లభించలేదు.

జంతుశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు సీనియర్ ప్రొఫెసర్‌కు అర్హత సాధిస్తే.. ఇంటర్వ్యూలో ఫెయిల్ అయితే అసోసియేట్‌కు డీమోట్ చేస్తామని, అంగీకరిస్తేనే హాజరు కావాలని షరతు విధించారు. అంతేకాదు.. డీమోషన్ చేసిన తర్వాత వేతనం రికవరీ చేస్తామని హెచ్చరించారు. దీంతో ఆయన హాజరు కాలేదు.

ఇలా 2010 పాత మార్గదర్శకాల ప్రకారం పీహెచ్‌డీ లేకుండానే అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా నియమితులైన వారందరూ.. ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. కేవలం ఒక్కరు మాత్రమే హాజరయ్యారు.

దీనిపై వీసీ కుమార్ మొలుగరం కు వివరణ ఇస్తూ.. పదోన్నతుల ప్రక్రియ అంతా పారదర్శకంగానే నిర్వహించామని చెప్పారు.

# అధి'కారు'లు.. అద్దె బిల్లులు స్వాహా!



కరీంనగర్ : కొందరు అధికారులు సొంత కార్లు వాడుతూ నకిలీ నంబర్లతో అద్దె బిల్లులు తీసుకుంటున్నారు. సమాచార హక్కు చట్టం కింద ఇటీవల ఒకరు వివరాలు సేకరించగా బల్దియా అధికారులు వాడే 21 అద్దెకార్ల నంబర్లన్నీ తప్పుడు వివరాలతో పొందుపర్చినట్లు తేలింది. టీఎస్ 11 యూసీ 0809 అనే కారును ప్రణాళిక విభాగం అధికారులు వాడుతున్నట్లు లెక్కల్లో రాశారు. వాస్తవానికి ఆ నంబరుతో ఉన్న ఆటో హైదరాబాద్‌లో తిరుగుతోంది. నెలకు ఒక్కో వాహనానికి రూ.33 వేల చొప్పున రూ.6.93 లక్షల బిల్లులు తీసుకుంటున్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖలోని ఓ అధికారి రెండు వాహనాల బిల్లులను జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఆ అధికారి తన పోస్ట్‌కు తగిన కారును వాడుతూనే మరో వాహనం బిల్లును కొన్నేళ్లుగా కాజేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల జిల్లా పరిషత్‌లో ఓ అద్దె కారు బిల్లును సక్రమంగా చెల్లించే విషయంలో చేతివాటాన్ని చూపిన ప్రభుత్వ ఉద్యోగి అనిశాకు పట్టుబడ్డారు. ఈ అద్దె కార్ల విషయంలో అన్ని స్థాయిల్లో ఆమ్యామ్యాల జోరు నడుస్తోంది. నెలకు నిర్ణీత కిలోమీటర్లు తిరగకున్నా తిరిగినట్టు రాసినందుకు సిబ్బంది కొంత మొత్తాన్ని నెల నెలా డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

రూ.అర కోటిపైన.. జిల్లా వ్యాప్తంగా మండలాధికారులతోపాటు జిల్లా స్థాయిలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులంతా కలిపి 152 అద్దె కార్లను వినియోగిస్తున్నారు. ఈ వాహనాలకు అద్దెను నెలకు రూ.33 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ లెక్కన మొత్తం వాహనాలకు నెలలో రూ.50.16 లక్షలను అద్దెగా ఖజానా నుంచి బిల్లులుగా ఇస్తున్నారు. కేవలం 30 శాతం మంది అద్దె వాహనాలు వాడుతుండగా.. మిగతా వారంతా సొంత వాహనాల్లోనే క్షేత్రస్థాయి పర్యటనలకు, కార్యాలయాలకు వెళ్తూ బిల్లులను తీసుకుంటున్నారు.

**ఇలా అభ్యంతరకరం..**

అధికారులు విధిగా పసుపు రంగు బోర్డుతో ఉన్న అద్దె వాహనం వినియోగించాలి. కానీ సొంతవాటిలో తిరుగుతున్నారు.

నెలకు 2500 కి.మీ.లు విధిగా తిరగాలి. కానీ చాలామంది అంతకన్నా తక్కువ తిరుగుతూ బిల్లులు రాసుకుంటున్నారు.

కొందరు 2500 కి.మీ.లు కన్నా అధికంగా బిల్లులు పెట్టి కి.మీ రూ.10 చొప్పున అదనపు బిల్లును పొందుతున్నారు.

ట్యాక్సీ ప్లేట్‌వి వాటితే కొందరికి ఉపాధి అందుతుంది. దీంతోపాటు ఆర్టీఏకు ఆ వాహనం ద్వారా పన్ను సమకూరుతుంది.

సొంత వాహనం వాడుతూ రికార్డుల్లో మాత్రం ట్యాక్సీ ప్లేట్ కలిగిన వాహనాల వివరాలు పొందుపరుస్తున్నారు.

# హద్దులు చెరిపేసి.. అక్రమణలకు తెరతీసి

కరీంనగర్ : పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్, మంథని పట్టణాల్లోని ప్రభుత్వ భూముల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. రెండు నెలల కిందట పెద్దపల్లి బల్దియా పరిధి చందంపల్లి సమీపంలోని ఓ సర్కారు స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు చేశారనే ఫిర్యాదుతో తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది అక్కడికి వెళ్లి హద్దులు నిర్ణయించారు. మేడిపల్లి ఓసీపీ ఏర్పాటు సమయంలో రామగుండం వెళ్లేందుకు నిర్మించిన 100 అడుగుల వెడల్పున్న రహదారి ఆక్రమణకు గురవగా ప్రస్తుతం కుంచించుకుపోయింది.

ఓదెల మండలం మడక గ్రామంలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని గతేడాది డిసెంబరులో ఓ పార్టీ నాయకులు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. పలుమార్లు హద్దులను నిర్ణయించిన ఈ స్థలం ఆక్రమణలోనే ఉండిపోయింది.

భూముల ధరలకు రెక్కలు రావడంతో అందినకాడికి దండుకోవాలనే పంథాలో కొందరు ఆక్రమణదారులు సర్కారు స్థలాలపై కన్నేస్తున్నారు. ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న చోట పక్కనున్న సర్వే నంబరు




భూముల్లో వీటిని కలుపుకొంటున్నారు.

రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పలుచోట్ల భూముల వివరాలు తారుమారయ్యాయి. భూప్రక్షాళన సమయంలో పక్కనున్న వారు సర్కారు స్థలంలోని కొంత భాగాన్ని కలుపుకొన్నారు. ఇందుకు తహసీల్దార్ కార్యాలయాల్లోని పలువురు సిబ్బంది సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్లో ఎకరం స్థలం రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లవరకు ప్రాంతాన్ని బట్టి పలుకుతుండగా స్థిరాస్తి వ్యాపారులు అందినకాడికి ఆక్రమించుకోవాలని చూస్తున్నారు.

**గతంలో గుర్తించినా..**

ఏప్రిల్‌లో జిల్లావ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ స్థలాలను గుర్తించగా 33,334 ఎకరాలున్నట్లు లెక్క తేలింది. పలు మండలాల్లో సగటున 50-60 ఎకరాల ఆక్రమణలు గుర్తించి బోర్డులు పాతారు. మిగతా చోట్ల కూడా ఆక్రమణలు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సామాజిక అవసరాల కోసం గతంలో పరిహారం ఇచ్చి సేకరించిన భూములకు హద్దులు నిర్ణయించి వాటిని కాపాడాలి. వారంలో ఓ రోజు సర్వేయర్లు గ్రామాలవారీగా ప్రభుత్వ స్థలాల హద్దులను గుర్తిస్తూ వాటిని రక్షించే పని చేపడితే ప్రయోజనం చేకూరనుంది.

# మామూళ్ల మత్తులో తూలుతూ!

సిరిసిల్ల : ఎక్సైజ్ శాఖ ఖజానాకు రాబడిని పెంచే క్రమంలో నిబంధనలు, చట్టాలను అధికారులు గాలికొదిలేశారు. జిల్లా కేంద్రంలోని ఓ బార్‌కు ట్రేడ్ లైసెన్సు లేకుండానే ఎక్సైజ్ అధికారులు అనుమతులిచ్చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో మద్యం దుకాణాలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు, సమీప ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.. నెలనెలా అందే మామూళ్లే ఇందుకు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.11 లక్షలకుపైనే..

జిల్లాలో 48 మద్యం దుకాణాలు, 8 బార్లున్నాయి. వీటిలో పోలీసులు, ఎక్సైజ్‌శాఖ మామూళ్ల దందా అంతా ఇంతాకాదు. సిరిసిల్ల పట్టణంలోని ఒక్కో మద్యం దుకాణానికి పోలీసులకు నెలకు రూ.15 వేలు, ఎక్సైజ్ సిబ్బందికి రూ.20 వేలు దండుకుంటున్నారు. వేములవాడలో ఒక్కో దుకాణానికి పోలీసులు, ఎక్సైజ్ వారికి విడివిడిగా నెలకు రూ.18 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోనివి అయితే నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. వీటిలో ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంటువారు నెలకు రూ.3 వేల చొప్పున జేబులో వేసుకుంటున్నారు. ఇలా జిల్లాలో నెలకు మద్యం దుకాణాల ద్వారా రూ.11 లక్షలపైనే



మామూళ్లు చేతులు మారుతున్నాయి.

**ఇష్టారీతిన మద్యం సరఫరా**

జిల్లాలోని మద్యం దుకాణాదారులకు పోలీసుల అండదండలున్నాయనే ఉద్దేశంతో గ్రామాల్లో పోటాపోటీగా అనుబంధ గొలుసు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు అధిక ధరలకు విక్రయించినా, కల్తీ చేసిన నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నా పట్టించుకోవడంలేదు. ఎక్కువ మద్యం గొలుసు దుకాణాలు ఉన్నవారి నుంచి రూ.10 వేల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. వచ్చే నెలాఖరుతో లీజు గడువు ముగుస్తుండటంతో ఈ నెలలోనే ముందస్తు వసూళ్లకు పాల్పడుతున్నారు.

**అనధికార ఆదేశాలపై విమర్శలు**

ప్రభుత్వం పోలీస్‌స్టేషన్ల నిర్వహణకు సంబంధించి పట్టణ ప్రాంతాలకు నెలకు రూ.50 వేలు, మండల కేంద్రాలకు రూ.25 వేల చొప్పున నిధులు విడుదల చేస్తుంది. ఆరు నెలలుగా ఈ నిధులు రావడంలేదు. వాహనాల నిర్వహణ, స్టేషన్‌లో ఇతర అవసరాలకు ఠాణా పరిధిలోని ఒక్కో దుకాణానికి అదనంగా కప్పం కట్టాల్సిందేనంటూ అనధికారిక ఆదేశాలు జారీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో దుకాణ నిర్వాహకులు సైతం నిబంధనలు గాలికొదిలేశారు.

చురకలు



# ఘాట్.. గమ్యం చేరలేం!

ఉదయగిరి : 'ఉదయగిరి- బండగానిపల్లి మార్గంలో అసంపూర్తిగా ఉన్న 3.2 కి.మీ. రోడ్డు పూర్తి చేస్తే పది గ్రామాలకు చెందిన సుమారు 14వేల మందికి ప్రయోజనం కలుగుతుంది. ఆ మేరకు పూర్తి చేయాలని 20 ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా.. ఆందోళనలు చేసినా.. ఫలితం లేకుండా ఉందని కొండ కింద పల్లెలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'

**3.2 కి.మీ.లు**

కొండ కింద ఉన్న బండగానిపల్లి, బిజ్జంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, లింగమనేనిపల్లి, కొత్తపల్లి, జి.అయ్యవారిపల్లి, దేకూరుపల్లి, జి.చెర్లోపల్లి, జి.చెరువుపల్లి, సంజీవరాజుపల్లి గ్రామాల ప్రజలు రోజువారీ అవసరాల నిమిత్తం నిత్యం ఉదయగిరికి రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో శకునాలపల్లి మీదుగా కొండ చుట్టూ సుమారు 25 కి.మీ. పైగా తిరిగి వచ్చేవారు. 2005లో నాటి ప్రభుత్వం పది కి.మీ. దూరం ప్రయాణిస్తే చేరుకునేలా.. ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. మార్గం మధ్యలో 3.2 కి.మీ. అటవీశాఖ అభ్యంతరంతో ఆగిపోయింది. ఈ కాస్త పూర్తిచేస్తే తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని.. తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని.. అప్పటి నుంచి ప్రజలు విన్నవిస్తూనే ఉన్నారు. ఆందోళనలు సైతం చేపట్టారు. దాంతో నాలుగేళ్ల కిందట అటవీశాఖ కోల్పోతున్న 3.2 కి.మీ.కు ప్రత్యామ్నాయంగా నేలటూరు సమీపంలో కేటాయించా రు. రోడ్డు ఏర్పాటుకు అనుమతుల కోసం ఉన్నతాధికారులకు



ప్రతిపాదనలు పంపారు. ఇంత వరకు అనుమతి రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా దృష్టిసారించి.. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**అధికారులు ఏమన్నారంటే...**

అటవీశాఖ కోల్పోతున్న భూమికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిందీ వారి పరిధిలోనే ఉందని చెబుతున్నారని ఆర్అండ్బీ డీఈఈ మదన్కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్చిస్తున్నామన్నారు. అటవీశాఖ రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాతో మాట్లాడగా.. తమశాఖ ఉన్నతాధికారులు కొన్ని వివరాలు అడిగారని, వాటిని పంపాల్సి ఉందన్నారు.

**నిత్యం నరకం..**అసంపూర్తిగా ఉన్న ఘాట్ రోడ్డు రాళ్లు తేలి.. గుంతలమయంగా మారింది. ఉదయగిరికి వెళ్లేందుకు నిత్యం నరకం చూస్తున్నాం. రాకపోకలు సాగించే క్రమంలో ఎందరో తీవ్ర గాయాలపా లయ్యారు. ఈర్ల శంకర్

# పంచాయతీలపై.. ఏదీ పర్యవేక్షణ!

సర్వేపల్లి : కోవూరుతో పాటు పలు నియోజకవర్గాల్లోని పంచాయతీల్లో అక్రమాలు జరిగాయని, నిధులు భారీగా దుర్వినియో గం చేశారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. విచారణ జరిపిన అధికారులు.. అవి నిజమని తేల్చి.. సర్పంచుల చెక్పవర్ రద్దు చేయడంతో పాటు కార్యదర్శులపై వేటు వేశారు. అదే సమయంలో అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వల్లే.. అక్కడ ఆ పరిస్థితులు నెలకొన్నాయన్న విమర్శలు ఉన్నాయి.

పంచాయతీల్లో సర్పంచులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు కాంట్రాక్టర్లు(వెండర్)గా ఉండకూడదు. కార్యదర్శులు రూపాయి కూడా వారి ఖాతాల్లో వేసుకోకూడదు. కానీ, వెంకటాచలం పంచాయతీతో పాటు మరికొన్నిచోట్ల సర్పంచుల కుటుంబ సభ్యులే కాంట్రాక్టర్గా ఉండి.. రూ. లక్షల నిధులు వారి ఖాతాల్లో వేసుకున్నారు. కార్యదర్శులు తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. ఏళ్లుగా జరుగుతున్న ఈ తంతును అధికారులు గుర్తించలేకపోవడం.. పరిస్థితికి అద్దం పడుతోంది.

జిల్లాలో పంచాయతీలపై డివిజనల్, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. తరచూ వాటిని సందర్శించి.. రికార్డులు పరిశీలించడంతో పాటు నిధుల వినియోగంపై విచారణ జరపాల్సిన అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండగా- ఆ ఉదాసీన వైఖరే అన్ని అక్రమాలకు కారణమవుతోంది. జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో డీఎల్పీవో, మండల స్థాయిలో ఈవోపీఆర్డీలు పర్యవేక్షణ బాధ్యత




తీసుకోవాలి. డీఎల్పీవో నెలకు 5 నుంచి 10 పంచాయతీలను తనిఖీ చేయాలి. ఈవోపీఆర్డీలు నెలలో తమ మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో పర్యటించాలి. మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలి. కానీ, చాలాచోట్ల అది పక్కాగా అమలు కావడం లేదు. ఆ క్రమంలోనే భారీగా నిధుల దుర్వినియోగం జరుగుతోందన్న అపవాదు నెలకొంది. ఇక టీపీగూడూరు, వెంకటాచలం, రాపూరు, పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, ఇందుకూరుపేట తదితర మండలాల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందాయి. చాలాచోట్ల ఇంకా విచారణ జరపలేదు. విచారణ చేస్తున్న చోట్లా వాయిదాల పేరుతో కాలయాపన చేస్తున్నారు. వెంకటాచలం మండలంలో ఎనిమిది నెలలపాటు సుదీర్ఘ విచారణ జరిపి.. మొక్కుబడి నివేదిక ఇవ్వడమూ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పరిస్థితులు మార్చాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై డీపీవో శ్రీధర్ స్పందిస్తూ.. త్వరలో జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి.. తనిఖీలు చేయని వారిని గుర్తించడంతోపాటు అన్నిచోట్ల జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.


జిల్లాలో మండలాలు: 37

పంచాయతీలు: 722

డివిజన్లు నాలుగు

అందిన ఫిర్యాదులు: 30

# ఏం చేద్దాం.. ఎలా ఉపయోగిద్దాం!



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వం రుషికొండపై రూ. వందల కోట్ల ప్రజాధనం వ్యయం చేసి విలాసవంత భవనాలు నిర్మించింది. వాటిని ప్రభుత్వ అవసరాలకు కాకుండా జగన్ నివాస అవసరాలకు వీలుగా నిర్మించుకోవడంతో వాటిని దేనికీ వినియోగించు కోలేని దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా... ఆ భవనాల వినియోగంపై ఏ నిర్ణయం తీసుకోలేదు. అయితే... తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఈ భవనాలను ఎలా వినియోగించాలి? అనే అంశంపై ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థ (ఏపీటీఏ) ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీంతో పలువురు తమ ఆలోచనలను పంపుతు న్నారు. భవనాలు చూడకుండా ఎలా వినియోగించాలో చెప్పేదెలా అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు.

**అప్పుడలా..**ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రుషికొండపై హరితా హిల్ రిసార్టు నిర్వహించేది.

42 గదులు, సమావేశ మందిరం, వివాహ వేదిక, రెస్టారెంట్ ఉ ండేవి. ఈ ఒక్క రిసార్టు నుంచే ఏపీటీడీసీకి ఏటా రూ. 7 కోట్ల ఆదాయం వచ్చేది. రాష్ట్రంలో మిగిలిన అన్ని రిసార్టుల కలిపితే ఇంత వచ్చేది. రిసార్టు నుంచి తీరం అద్భుతంగా కనిపించేది. సీజన్లో ఇక్కడ గది దొరకాలంటే చాలా కష్టంగా ఉండేది.

భవనాలు నిర్మించి 15 ఏళ్లు కాకమునుపే కూల్చేశారు.

**ఇప్పుడిలా..**

గత వైకాపా ప్రభుత్వంలో ఆ భవనాలను కూల్చి 9.88 ఎకరాల్లో 13,140 చదరపు మీటర్లలో భవనాలు నిర్మించారు.

రూ.452 కోట్ల ప్రజాధనం వెచ్చించారు. విదేశాల నుంచి తీసుకువచ్చిన సామగ్రితో గదులు అలంకరించారు.

వేంగి, గజపతి, కళింగ, విజయనగర పేరుతో ప్యాలెస్లా నిర్మించారు. భవనాల ముందు సుందరీకరణకు లక్ష మొక్కలతో ఉద్యానవనం అభివృద్ధి చేశారు.

కొంతకాలంగా ఖాళీగా వదిలేయడంతో గదులు దుమ్ము పట్టాయి. తీరం నుంచి వచ్చే ఉప్పు గాలికి పలునిర్మాణాలు, సామగ్రి తుప్పు పడుతున్నాయి. వర్షానికి అక్కడక్కడ సీలింగ్ నుంచి నీరు కారుతోంది.

మెయిల్ చేయండి..

ఆసక్తి ఉన్న వారు ఈ భవనాలను దేనికి వినియోగించాలో తమ అభిప్రాయాలు తెలియజేయొచ్చు.

జాతీయ, అంతర్జాతీయంగా ఆతిథ్యరంగంలో అనుభవం కలిగిన నిర్వాహకుల

అభిప్రాయం తెలుసుకునేందుకు శుక్రవారం విజయవాడలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. %rushikonda.suggestions @aptdc.ap.gov.in% కు మెయిల్ చేయొచ్చు.

# పేరు దేశవ్యాప్తం.. తీరు నిర్లక్ష్యం



పలమనేరు: దేశవ్యాప్తంగా పుంగనూరు దూడలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రధానమంత్రులు, ఎందరో ప్రముఖులు, రాజకీయ నాయకులకు వీటిపై మక్కువ ఉండేది. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసి మరీ ఇళ్లలో పెంచుకోవడానికి చాలామంది ఆసక్తి చూపిస్తుంటారు. వీటిపై పరిశోధనలు చేయడానికి చిత్తూరు జిల్లా పలమనేరులో సుమారు 500 ఎకరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రం మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. సరిపడా సిబ్బంది లేక చాలాపోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**నివాసం ఎలా..?**

ఈ కేంద్రానికి సంబంధించి 33 ఎకరాలను అంతర్జాతీయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు కేటాయించారు. అందులోని సిబ్బందికి క్వార్టర్లు కూడా ఇచ్చేయాల్సి వచ్చింది. ఇప్పటివరకు సిబ్బంది లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నా.. భవిష్యత్తులో భర్తీ చేస్తే నివాసానికి భవనాలు ఉండవు.

**నియామకానికి చర్యలు**

సిబ్బంది కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆబ్కాబ్ కింద వర్కర్ల పోస్టులను భర్తీ చేసుకునేందుకు తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు అనుమతి ఇచ్చారు. సైంటిస్టు పోస్టులు కూడా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. భారతి, సీనియర్ సైంటిస్టు

# బకాయిలు రూ.100 కోట్లు



చిత్తూరు : ఉపాధి హామీ బకాయిలు జిల్లాలో అక్షరాలా రూ.వంద కోట్లు ఉన్నాయి.. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 90 రోజులుగా చెల్లింపులు నిలిచిపోయాయి.. వారంలో అందాల్సిన డబ్బులు మూడు నెలలుగా విడుదల కాకపోవడంతో ఉపాధి హామీ పనులకు హాజరయ్యేవారి సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది..

**కూలీల సొమ్ము రూ.35 కోట్లు..**

రోజుకు సగటున 35 నుంచి 50 వేల మంది వరకూ జిల్లాలో ఉ పాధి పనులు చేశారు. వారికి గత మూడు నెలలుగా రూ.35 కోట్ల బకాయిలు ఉన్నాయి.

**మెటీరియల్కు రూ.65 కోట్లు**

కూలీలు పని చేసి పొందిన వేతన సొమ్ములో 40 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వస్తు సామగ్రి నిధులు విడుదల చేస్తుంది. గ్రామాల్లో నాయకులు, గుత్తేదారులు సీసీరోడ్లు, డ్రైన్లతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేశారు. వీటితో పాటు రైతులు మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్నారు. వాటి తాలూకు బకాయిలు రూ.65 కోట్లు పేరుకున్నాయి. మొత్తంగా ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతనాలు, వస్తు సామగ్రి నిధి రూ.100 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి.

త్వరలో అందుతాయి..

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.100 కోట్లు బకాయిలు ఉ న్నాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉంది. బకాయిలు రాగానే వేతనదారులకు చెల్లిస్తాం. రవికుమార్, పీడీ డ్వామా.

# రిజిస్ట్రేషన్ ఉంటేనే ఆక్వా రాయితీలు

కోట: ఆక్వా రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలంటే చెరువుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వీరికి కోస్తా ఆక్వాకల్చర్ అనుమతులు ఇస్తే అన్ని రకాల పథకాలు వర్తిస్తాయి. 50 రోజులుగా మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా రైతుల నుంచి స్పందన కరవైంది. ఇప్పటివరకు కేవలం సగంమంది మాత్రమే ముందుకు వచ్చారు.

వివాదాస్పద భూములతో సమస్య..

చిట్టమూరు మండలంలోని పిట్టివానిపల్లె, రంగనాథపురం, కోగిలి, పాదర్తివారి కండ్రిగతోపాటు పలు గ్రామాల్లో వివాదాస్పద భూములు, డీకేటీ పట్టా భూముల్లో సాగు ఎక్కువగా ఉంది. దీంతో రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రేషన్లలో జాప్యం జరుగుతోంది. కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో 20 శాతం చెరువులు ఖాళీగా ఉన్నాయి.

సచివాలయంలోనే నమోదు..

విద్యుత్తు రాయితీ పొందాలన్నా, ఇతర దేశాలకు రొయ్యలను ఎగుమతి చేయాలన్నా, బీమా వర్తించాలన్నా రిజిస్ట్రేషన్ అవసరం. రైతులు ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు



ఎకరాకు రూ.1000 చెల్లించి సచివాలయంలో నమోదు చేయించుకోవాలి. మత్స్యశాఖ అధికారులు పరిశీలించి ఆర్డీవోకు పంపిస్తారు. తర్వాత కోస్తా ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు జారీ చేస్తుందని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ తెలియజేశారు. రైతుల వద్దకు వెళ్లి ప్రక్రియ పూర్తి చేయిస్తామన్నారు.

సాగు ఇలామండలాలు: 4 (కోట, చిట్టమూరు, చిల్లకూరు, వాకాడు)

విస్తీర్ణం: 9 వేల ఎకరాలు

రిజిస్ట్రేషన్ జరిగింది: 4,500 ఎకరాలు

# గోరుకల్లు నీరు.. అందని తీరు

డోన్ : డోన్ నియోజకవర్గానికి తాగునీరు అందించే కీలకమైన గోరుకల్లు ప్రాజెక్టు పనులు గడువులోగా పూర్తయ్యేలా అగుపిం చడం లేదు. ప్రస్తుతానికి బేతంచెర్ల మండలంలోని కొన్ని గ్రామాలకు నీరు అందినా.. నియోజకవర్గంలో కీలకమైన డోన్ పట్టణం, మండలంలో మాత్రం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మరోవైపు ప్యాపిలి మండలంలోనూ పలుచోట్ల పైపులైన్ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పూర్తిస్థాయిలో డోన్ నియోజకవర్గ దాహార్తిని తీర్చే గోరుకల్లు నీరు వచ్చే ఏడాదిలోనే పూర్తయ్యే సూచనలు కన్పిస్తున్నాయి.

**70 శాతం పూర్తి**

డోన్ నియోజకవర్గంలోని 131 గ్రామాలకు తాగునీటికి ఉద్దేశించిన గోరుకల్లు ప్రాజెక్టు నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితమే ప్రారంభించారు. రూ.351 కోట్ల వ్యయంతో దీన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా 591 కి.మీ.ల మేర పైపులైన్ పనులు చేపట్టాల్సి ఉండగా.. 70 శాతం మేర పూర్తయింది. పట్టణ ప్రాంతంలో ఒక్కొక్కరికీ 135 లీటర్లు, గ్రామాల్లో 100 లీటర్ల తాగునీరు ఇవ్వాల్సి ఉంది. జలాశయం నుంచి 0.50 టీఎంసీల నీటిని తీసుకునేలా ప్రణాళికలు రూపొందించి



నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 36 గ్రామాలకు తాగునీరు అందుతోంది.

**వచ్చే ఏడాదికే అవకాశం**

నియోజకవర్గంలో డోన్ పట్టణ సమీపంలోని నగరవనం ప్రాంతంలో రెండు మూడు చోట్ల, డోన్ కొండ ప్రాంతంలో కొన్ని చోట్ల, ప్యాపిలి మండలంలోని హుసేనాపురంతో పాటు జలదుర్గం తదితర ప్రాంతాల్లో అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందని అధికారులు పేర్కొంటు న్నారు. దీంతో పనులు ముందుకు సాగక గడువు పెరుగుతూనే పోతోంది. మరోవైపు డోన్ నుంచి ప్యాపిలి వెళ్లే జాతీయ రహదారిలో పలుచోట్ల పైపులు అలాగే ఉన్నాయి. నిర్మాణాలకు సంబంధించిన పనులు 10 శాతం మేర పూర్తికావాల్సి ఉంది. దీంతో జనవరిలోగా డోన్కు, వచ్చే మార్చి, జూన్, జులైలోగా నియోజకవర్గానికి అంతటికీ నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆర్డబ్ల్యూఎస్ డీఈ రమేష్కుమార్రెడ్డి తెలిపారు.

# అడగుకో అగాధం.. గజానికో గుంత!

శృంగవరపుకోట : ఈ రెండు గ్రామాలే కాదు.. జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గంలో క్వారీలున్న ప్రతి గ్రామానిదీ ఇదే పరిస్థితి. అసలే గ్రామీణ రహదారులు.. అడుగడుగునా గుంతలు.. ఏళ్లుగా కానరాని మరమ్మతులు, నిర్వహణ.. దీనికితోడు నిత్యం క్వారీల నుంచి మితిమీరిన లోడ్లతో భారీ వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా మారుతున్నాయి.

**52 రాతి క్వారీల పరిధిలో..**

జిల్లాలోని ఎస్.కోట, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, జామి మండలాల పరిధిలో మొత్తం 83 రాతి క్వారీలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 52 వరకు పనిచేస్తున్నాయి. ఎస్.కోటలో 15, వేపాడలో 18, కొత్తవలసలో 13, జామిలో 6 క్వారీల్లో తవ్వకాలు సాగుతున్నాయి.

**ఎక్కడెక్కడ ఎలా?**గ్రామీణ దారుల్లో 10 టన్నుల లోడు సామర్థ్యం మేరకే వాహనాలు తిరిగేలా నిర్మాణం ఉంటుంది. కానీ భారీ వాహనాలు 50 నుంచి 60 టన్నుల సామర్థ్యంతో వెళ్తున్నాయి.

శృంగవరపుకోట మండలంలోని కొత్తూరు నుంచి కొండమల్లిపూడికి సుమారు 5 కి.మీ మే క్వారీ లారీలు అధికంగా తిరగడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. కొండమల్లిపూడి, మల్లిపూడి, కాశీపతి రాజుపురం గ్రామస్థులతోపాటు రైతులకు ఈ దారిలో పంట భూములున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం పడినా గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఆలుగుబిల్లి, చామలాపల్లి, పుణ్యగిరి, కొత్తూరు ఇదే పరిస్థితి.

వేపాడ మండలంలోని జాకేరు-బొద్దాం, సోంపురం-వల్లంపూడి, సోంపురం-ఆనందపురం, వీలుపర్తి-వావిలపాడు, వీలుపర్తి-కడకొండ, బొద్దాం- రామస్వామిపేట రోడ్లు గుంతలుగా మారాయి.

జామి మండలం జామి-లక్ష్మీపురం, కొత్తవలస మండలంలో కొత్తవలస నుంచి విజయనగరం, సబ్బవరం, కె.కోటపాడు రహదారులు అధ్వానంగా మారి జనం యాతన పడుతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం..**

ఎస్.కోట మండలంలో కొత్తూరు నుంచి కొండమల్లిపూడి రోడ్డు నిర్మాణా నికి రూ.1.40 కోట్లతో, వేపాడ మండలంలో బొద్దాం-కళ్లెంపూడి రోడ్డు మరమ్మతుకు రూ.1.10 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాం. మిగిన వాటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. స్వామినాయుడు, డీఈ, పంచాయతీరాజ్, ఎస్.కోట

**నిత్యం అవస్థలే..**

నా పేరు సుబ్రహ్మణ్యం. మాది వేపాడ మండలం జాకేరు. గ్రామానికి వచ్చే రోడ్డంతా రాళ్లుతేలడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం పడితే అడుగేయలేం.

**పిల్లలు బడికెళ్లాలంటే భయమేస్తోంది..**

నా పేరు శ్యామ్. మాది ఎస్.కోట మండలం కొండమల్లిపూడి. రోజూ పిల్లలు పాఠశాలకు వెళ్లి, వచ్చేవరకూ భయమే. గ్రామానికి 108 వాహనం కూడా రావడం లేదు.

## కాలుష్యం కమ్మేసింది.. కోపంతో ఎరుపెక్కింది



విజయనగరం : వందల ఎకరాలకు సాగునీరు అందించే చెరువది.. పశుపక్షాదులకు ఆసరాగా నిలిచే నీటివనరది.. భూగర్భ జలాల పెంపునకు ఆస్కారం కలిగించే కల్పతరువది.. కానీ నేడు కోపంతో ఎరుపెక్కింది.. ఎవరి పాపమో తెలియదు గానీ ఎర్రటి సంద్రమై బోరుమంటోంది. జామి మండలంలోని అలమండ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న చెరువు ఇటీవల ఒక్కసారిగా ఎర్రగా మారిపోయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో పలు రకాల పరిశ్రమ లు ఉండడం, దుమ్ము, ధూళి, వ్యర్థజలాల కారణంగా ఇలా మారిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పుడప్పుడూ ఇలా జరుగుతోందని పేర్కొంటున్నారు. దీంతో అటుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

# రక్షణ గోడ..గడువుల గాథ!

నెల్లూరు : రెండు సాగునీటి కాలువల పటిష్ఠతకు చేపట్టిన రక్షణ గోడల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. మొదట్లో అంచనాలు, ఆ తరువాత బిల్లుల సమస్యతో పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం పట్టించుకోక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నెల్లూరు నగరంలోని పెన్నా వారధి నుంచి సర్వేపల్లి, కృష్ణపట్నం ప్రాంతాలకు సాగునీటిని తీసుకెళ్లే సర్వేపల్లి కాలువకు 0.6 కి.మీ. నుంచి 3.3 కి.మీ. హరనాథపురం వరకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి రూ.110 కోట్లతో అంచనాలు తయారు చేయగా... రూ.87కోట్ల అగ్రిమెంట్‌తో పనులు ప్రారంభమయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తికానంటున్నాయి. పనులకు 2022లో టెండర్లు పూర్తై 24నెలల కాలపరిమితితో గుత్తేదారుకు పనులు అప్పగించారు. నిర్మాణాలు పూర్తి చేయాల్సిన గడువు గతేడాది మొదటికే ముగిసింది. అనంతరం ఈవోటీ పేరుతో అక్టోబర్ వరకు పొడిగించారు. మళ్లీ ఏడాది కాలం జరిగింది. అయినా పనులు ముందుకు కదలడం లేదు. ఇప్పటి వరకు రెండు వైపులా గోడలతో కలిపి రెండున్నర కిలోమీటర్లు పూర్తి అయ్యాయి. సుమారు రూ.40కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. తర్వాత జరిగిన పనులకు బిల్లులు ఇవ్వలేదు.

**జాఫర్ సాహెబ్ కాలువ**



అలాగే తోటపల్లిగూడూరు మండలం, మైపాడు పరిధిలో ఆయకట్టుకు సాగునీరు తీసుకెళ్లే జాఫర్ సాహెబ్ కాలువకు సంబంధించి పాత చెక్ పోస్టు నుంచి మైపాడు గేటు వరకు 1.15 కిలోమీటర్లు, అక్కడి నుంచి జాతీయ రహదారి వరకు మరో 1.05 కిలోమీటర్లు మేర సుమారు రూ.94కోట్లతో అంచనాలు వేయగా.. రూ.74కోట్ల అగ్రిమెంట్‌తో పనులు మొదలయ్యాయి. 15శాతం వరకు పనులు జరగగా.. రూ.7కోట్లకు బిల్లులు పెట్టారు. సర్వేపల్లి కాలువ రక్షణ గోడ పనులు మొదలు పెట్టిన కొద్ది నెలలకే జాఫర్‌సాహెబ్ కాలువ పనులు గుత్తేదారులకు అప్పగించారు. ఇవి కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

**పూడిక తీతకు తప్పని తిప్పలు**

ప్రస్తుతం సర్వేపల్లి కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. భారీ పొక్లెయిన్లు తీసుకువచ్చి పనులు చేశారు. శెట్టిగుంట రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు పూడిక తీశారు. గోడ నిర్మాణాలు చేసిన చోట పూడిక తీత పనులకు కష్టాలు తప్పడం లేదు. అటు ఇటు గోడ నిర్మాణాలు.. గోడ వెంబడి ఆక్రమణల కారణంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో కొంతమేర మనుషులను పెట్టి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కుబడిగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

# మారనున్న పల్లె పాలనా రూపు

ఒంటిమిట్ట : పంచాయతీ పాలనలో మార్పులకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు నేరుగా చేరేలా అడుగులు వేస్తోంది. పథకాల అమలులో క్షేత్రస్థాయి యంత్రాంగం ముఖ్య భూమిక పోషించేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలుండగా.. అనుబంధంగా 423 చోట్ల గ్రామ సచివాలయాలు సేవలందిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ, మరికొన్ని గ్రామాల్లో తక్కువ మంది సిబ్బంది ఉన్నారు. అవసరం లేని చోట తగ్గించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి అదనంగా సిబ్బందిని నియమించనుంది. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించిన అధికారులు.. సిబ్బంది సర్దుబాటుకు కసరత్తు చేస్తున్నారు.

ఇకపై ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు

ప్రస్తుతం మండలానికి ఒక డిప్యూటీ ఎంపీడీవో(ఈవోపీర్డీ) ఉన్నారు. ఇకపై ఇద్దరు రానున్నారు. ఒకరు తాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తారు. మరొకరు గ్రామ సచివాలయాల నిర్వహణ వ్యవహారాలను చూస్తారు.

**మొత్తం నాలుగు గ్రేడ్లు:** పది వేల జనాభా/ ఏడాదికి రూ.కోటి లేదా అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఆయా పంచాయతీలు ప్రత్యేక శ్రేణి(స్పెషల్ గ్రేడ్)గా పరిగణిస్తారు. కార్యదర్శి స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోను పరిపాలనా అధికారిగా నియమిస్తారు. ఇటువంటివి జిల్లాలో 11 ఉన్నాయి. పురపాలక తరహాలో వీటిలో సేవలు అందిస్తారు. 4 వేలు- 10 వేల మంది జనం, సంవత్సరానికి రూ. 50 లక్షల రాబడి, అంతకంటే ఎక్కువగా ఉంటే గ్రేడ్-1గా ఎంపిక చేస్తారు. జిల్లాలో ఇలాంటివి 59 ఉన్నాయి. కార్యదర్శుల చేతికి పాలనా పగ్గాలు అప్పగిస్తారు. ఇక్కడ 20 మంది సిబ్బందిని నియమించే అవకాశం ఉంది.

2- 4 వేల మంది జనాభా ఉంటే గ్రేడ్-2గా చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటివి 154 ఉన్నాయి. శ్రేణి-2లో మెరుగైన సేవలు అందించడానికి 12 మంది ఉద్యోగులను కేటాయిస్తారు.

జనాభా రెండు వేల లోపు ఉంటే గ్రేడ్-3గా పరిగణిస్తారు. ఇలాంటివి 227 చోట్ల ఏర్పాటు చేశారు. ఇక్కడ తొమ్మిది మంది సిబ్బంది సేవలు అందిస్తారు. గ్రేడ్-4, 5 విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించి గ్రేడ్-3, 2కు బదిలీ చేస్తారు.

# పనులు పంచుకో.. ముడుపులు నంజుకో

కడప: వైకాపా హయాం నుంచి తంబళ్లపల్లెలో అరాచక పాలన సాగుతూనే ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సైతం తెదేపాలో చేరిన వైకాపా కోవర్టుల కారణంగా పరిస్థితులు దారికి రావడంలేదు. ఈ అనైక్యతను ఆసరాగా తీసుకుని అధికారులు సైతం ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. జలవనరులశాఖలో ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గంలో గుత్తేదారుల అవతారం ఎత్తారు. వీరికి వైకాపా కోవర్టులు వత్తాసు పలకడంతో చెలరేగిపోతున్నారు. ఈ శాఖలో ఓ అధికారి తమ్ముడిని రంగంలోకి దింపి గుత్త పనులు చేపట్టారు. వీరికి నియోజకవర్గంలో ఇద్దరు తెదేపా నేతలు అండగా నిలిచి కమీషన్లు తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నియోజకవర్గంలో హోదాను ఓ తెదేపా నేత స్థానికంగా సృష్టించుకుని చెలామణి అవుతున్నారు. ఈయన వైకాపా కోవర్టులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. కురబలకోట మండల నేత వైకాపా వర్గీయులు చెప్పినట్లుగా వింటూ అరాచకాలు సాగిస్తున్నారు. వైకాపా కీలక నేతకు అత్యంత సన్నిహితంగా ఉంటూ పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. రెండు పార్టీల అండతో భూదందాలు సాగిస్తున్నారు. ఈ పరిణామాలను తెదేపా శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ప్రభుత్వంలోనూ వైకాపా నేతల పనులన్నీ సవ్యంగా సాగుతున్నాయి. తెదేపా శ్రేణులు ఇప్పుడూ బాధితులుగానే ఉన్నారు.

ఇంజినీరింగ్ అధికారులదే హవా

జలవనరులశాఖలో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులు నియోజకవర్గాన్ని పంచుకున్నారు. కాంట్రాక్టు పనులన్నీ తమ అనుచరులకు కట్టబెట్టి పరోక్షంగా పనుల్లో భాగస్వామ్యులయ్యారు. ఓ అధికారి అయితే ఏకంగా తమ్మున్నే రంగంలోకి దింపారు. పనులు నాణ్యతా ప్రమాణాల మేరకు జరగడంలేదు. పర్యవేక్షించాల్సిన అధికారులే పనులు చేయడంతో నాణ్యత గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. పెద్దమండ్యం మండలం గుడిసివారిపల్లె చెరువు కట్ట రూ.50 లక్షలతో చేపట్టగా నాణ్యత లేకుండా పోయింది. ఈ తరహాలోనే చిన్నపాటి మట్టి పనులు మరో 22 వరకు తూతూమంత్రంగా చేపట్టి రూ.కోటి వరకు బిల్లులు చేసుకున్నారు. 2021లో నియోజకవర్గానికి వచ్చిన ఇంజినీరింగ్ అధికారి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీ నిర్మించిన ముదివేడు రిజర్వాయర్‌లో అక్రమాలకు వత్తాసు పలికారనే ఆరోపణలున్నాయి. వైకాపాతో అంటకాగిన అధికారి ఇప్పుడూ చలామణి అవుతూ అక్రమాలు సాగిస్తున్నారు.

**నీరు- చెట్టు పనుల్లోనూ అక్రమాలు**

నీరు- చెట్టు కింద పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.12 కోట్లు వరకు విడుదల చేసింది. పెండింగ్ బిల్లులను తాజాగానూ అప్‌లోడ్ చేసే వెసులుబాటు కల్పించడంతో ఇందులోనే అక్రమాలకు తెరదీశారు.

# మఠం సొమ్ము నొక్కేశారు!



అనంతపురం : ఉరవకొండ కేంద్రంగా ఉన్న కరిబసవస్వామి గవిమఠానికి ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 770 శాఖ మఠాలు ఉన్నాయి. అయితే అక్కడి ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయం మఠం ఖాతాకు పూర్తిగా చేరడం లేదు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు పరిధిలోని వ్యాపార సముదాయాల నుంచి వచ్చే అద్దె సొమ్మును మఠం ఖాతాలో జమ చేయకుండా కొందరు పక్కదారి పట్టించారు. పీఠాధిపతి ఏజెంట్‌గా ఉన్న రాజన్న కనుసన్నల్లోనే అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. చర్యలు తీసుకునేందుకు మాత్రం వెనకాడుతున్నారు.

**వివరాలు లేవు**తుమకూరు వ్యాపార సముదాయాలను ఎవరికి అద్దెకు ఇచ్చారనే వివరాలు సైతం మఠం అధికారుల వద్ద లేవు..ఉన్నతాధికారుల ఆదేశాలతో వాటిని పరిశీలించడానికి వెళ్లిన సిబ్బందిపై ఏజెంట్ రాజన్న మనుషులు దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. అసలు ఎన్ని గదులు నిర్మించారు, ఆ గదుల్ని అద్దెకిచ్చారా? లేదంటే అమ్మేసుకున్నారా? అనే అంశాలపై సందేహాలున్నాయి. తుమకూరులో జరిగిన అవకతవక లపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. 9 ఏళ్లుగా తుమకూరులోని వ్యాపార సముదాయం ద్వారా రూ. 80 లక్షలు మాత్రమే అద్దె వచ్చినట్లు శాఖమఠం నుంచి వివరణ వచ్చినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని లేదంటే క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్‌జేసీ ఆదేశించారు. 5 నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేవు.

**తొలగించి మళ్లీ తీసుకున్నారు**

పీఠాధిపతికి అధికారిక ఏజెంట్‌గా ఉన్న రాజన్న కనుసన్నల్లో మఠం కార్యకలాపాలు సాగుతున్నాయి. గతంలోనూ ఆ ఏజెంట్ కర్ణాటక రాయచూర్‌లో విలువైన భూముల్ని జీపీఏ చేసుకుని ఇతరులకు అమ్మేశాడు. అప్పట్లో ఆయనను తొలగించారు. అయితే మళ్లీ ఆయన్నే ఏజెంట్ తీసుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మఠానికి జమ చేయాల్సిన సొమ్మును చెల్లించడానికి ఏడాది సమయం కావాలని పీఠాధిపతి పేరుతో నోట్ తయారు చేయించినట్లు తెలుస్తోంది. అధికారులు ససేమిరా అనడంతో మౌనం వహించారు. గవిమఠం ఇన్‌ఛార్జి ఏసీ రాణిదృష్టికి తీసుకెళ్లగా వివరాలు చెప్పేందుకు నిరాకరించారు.

# అరటిని 'గెల'వలేక..



అనంతపురం : గతంలో ఎన్నడూలేని విధంగా అరటి రైతులు నష్టాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కనీసం పెట్టుబడి రాని దయనీయ దుస్థితి. పండించిన పంటకు మద్దతు ధర లేకుండా పోయింది. దిగుబడిని కొనేవారు కరవయ్యారు. గతంలో వ్యాపారులు పొలం వద్దకు వచ్చి తమకే అరటి గెలలు విక్రయించాలని ముందే డబ్బులు చెల్లించేవారు. ఇప్పుడు వ్యాపారుల వద్దకు వెళ్లి ఎంతో కొంత ఇచ్చి తీసుకోవాలని వేడుకున్నా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మహారాష్ట్ర ప్రభావం**

జిల్లా నుంచి అరటి కొనుగోలు చేసి దిల్లీ మార్కెట్‌కు తరలిస్తే.. లారీకి రూ.1.20 లక్షల రవాణా ఛార్జీలు అవుతున్నాయి. రవాణాకు 4-5 రోజులు సమయం పడుతోంది. మహారాష్ట్ర నుంచి లారీ బాడుగ రూ.20 వేల నుంచి 30 వేలు అవుతుంది. ఒక రోజుకే దిల్లీకి సరకు చేరుతుంది. దీంతో వ్యాపారులు ఇక్కడికి రావడం లేదు. పైగా మహారాష్ట్రలో ఈసారి పంట సాగు బాగా పెరిగింది. జిల్లాలో సుమారు 38 కంపెనీలు అరటిని కొనుగోలు చేస్తున్నాయి. టన్ను రూ.12 వేలతో కంపెనీలు అన్ని కలిసి 9 వేల టన్నులే కొనుగోలు చేస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

**మార్కెట్‌లో డజను రూ.40**

స్థానికంగా కొందరు రైతుల నుంచి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. తిరిగి వారు వ్యాపారులకు కిలో రూ.14-15 చొప్పున అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్లో మాత్రం డజను రూ.30-40 చొప్పున వినియోగదారులకు విక్రయిస్తుండటం గమనార్హం. ప్రధానంగా శీతల గిడ్డంగులు అందుబాటులో లేకనే ఈ పరిస్థితి నెలకొంది. దీనికితోడు గెల మొత్తం ఒకేసారి పండ్లుగా మారకపోవడంతో సమస్యగా మారింది.

**జిల్లాలో ఇలా..**

సాగు విస్తీర్ణం: 15 వేల హెక్టార్లు
హెక్టారులో పెట్టుబడి వ్యయం: రూ.2.72 లక్షలు
ప్రస్తుతం కోత వచ్చింది: 11,500 హెక్టార్లలో
దిగుబడి అంచనా: హెక్టార్‌కు 160.55 టన్నులు
ప్రస్తుతం టన్ను ధర: రూ.4 వేలు నుంచి 5 వేలు

# చింత.. రైతుకేదీ నిశ్చింత



హిందూపురం : రుచి, శుచికి హిందూపురం ప్రాంత చింతపండు ప్రసిద్ధి. పొలాల గట్లపై, తోటల్లో 5, 6 దశాబ్దాల వయసున్న లక్షల చింతచెట్లు ఉన్నాయి. రైతుల పాలిట కల్పవృక్షాలే అయినా ప్రాసెసింగ్ యూనిట్లు లేక అనుకున్నంత లాభాలు గడించడం లేదు. కరోనా కాలం నుంచి ఎగుమతులు ఆగిపోవటంతో రైతులకు గిట్టుబాటు ధర లభించటం లేదు. సీజన్‌లో తగిన ధర లేక రైతులు, పండును కొనుగోలు చేసి నెలల తరబడి శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యాపారులు అవస్థలు పడుతున్నారు.

**ఉత్తరాది పండుకు మొగ్గు**

గతేడాది పంట దిగుబడి లేక ఫ్లవర్ రకం క్వింటాలు రూ.8వేల నుంచి 12వేలు, కరిపుళి రూ.12వేల నుంచి 16వేలు, బోటు రకం రూ.3 నుంచి 4 వేలు పలికాయి. ఇక్కడ ధరలు అధికంగా ఉన్నాయని దేశీయంగా టోకు వ్యాపారులు పండు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో శీతల గిడ్డంగుల్లో సరకు నిల్వ ఉంటోంది. ఉత్తరాదిలో పండిన కట్టెరకం పండు క్వింటాలు రూ.5వేలు పలుకుతుండటంతో అక్కడ కొనుగోలుకు వారు ఆసక్తి చూపుతున్నారు. మరో మూడు మాసాల్లో కొత్తపంట మార్కెట్కు వస్తుంది. పెరిగిన పెట్టుబడి వ్యయంతో గిట్టుబాటు ధర లభిస్తుందా లేదా అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**ప్రాసెసింగ్ యూనిట్లు అవసరం**

చింతపండు: గుజ్జు, ఆహార పదార్థాల తయారీ యూనిట్లకు ప్రోత్సాహం అవసరంపిచ్చులతో: రంగులు, గంజి, మస్కిటోకాయిల్స్, వస్త్రపరిశ్రమ, పసుపుకుంకుమ, జనపనార పరిశ్రమలను అందుబాటులోకి తీసుకురావాలి వ్యవసాయ మార్కెట్: హిందూపురం
గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్కు వచ్చిన చింతపండు: 85,579 క్వింటాళ్లుసరకు విలువ: రూ.80 కోట్లు
చింతపిక్కలు: 7వేల నుంచి 8వేల టన్నులు
గిడ్డంగుల్లో నిల్వలు: 5వేల టన్నులు

# గుత్తి దవాఖానా @ 145

గుత్తిలోని కమ్యూనిటీ వైద్యశాల రోగుల సేవలో 145 ఏళ్లుగా తరిస్తోంది. బ్రిటిష్ పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ 1880లో లోకల్‌ఫండ్ సహకారంతో చిన్న డిస్పెన్సరీని ఏర్పాటు చేశారు. అప్పట్లో 10 పడకలతో ప్రారంభమైంది. జిల్లాలో ఇదొక్కటే ఉండేది. అప్పట్లో ఒక వైద్యుడే సేవలందించారు. దత్తమండలాల కలెక్టర్ సర్‌థామస్ మన్రో పేరుతో మెడికల్ డిస్పెన్సరీ 1925లో ఆసుపత్రిగా రూపాంతరం చెందింది. ఇద్దరు వైద్యులను నియమించారు. 1964లో ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చి 30 పడకలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు 52 పడకలతో వైద్యవిధాన పరిషత్తు ఆసుపత్రిగా కొనసాగుతోంది. ఒకప్పుడు ఒకే వైద్యుడితో మొదలైన డిస్పెన్సరీ ఇప్పుడు తొమ్మిది మంది వైద్యులతో నడుస్తోంది. అనంతపురం, కర్నూలు జిల్లాల సరిహద్దు గ్రామాల నుంచి వందల సంఖ్యలో రోగులు బ్రిటిష్ హయాం నుంచి వైద్యం కోసం వస్తున్నారు. ఆసుపత్రిని వంద పడకల ఏరియా అసుపత్రిగా మార్చాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. సీమ జిల్లాల్లోనే ఇది అత్యంత పురాతన ఆసుపత్రి కావడం విశేషం.

# పనుల్లేక.. పస్తులుండలేక

నాగలాపురం : వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలుచేస్తుండటంతో మన రాష్ట్రంలో వలసల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కానీ పశ్చిమబంగ నుంచి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. మూడు సంవత్సరాలుగా జిల్లాలో వరినాట్లకు ఇతర రాష్ట్ర కూలీలే స్థానిక రైతులకు ఆసరాగా నిలుస్తున్నారు.

**వరినాట్లలో వారిదే జోరు..**

పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన 10 మంది కూలీలు ఒక రోజులో రెండున్నర ఎకరాల మేరా నారు పీకి, నాటే పనిని పూర్తిచేస్తున్నారు. ఈ పనికిగానూ ఎకరాకు కాంట్రాక్ట్ పద్ధతిలో రూ.4,500, రూ.600 విలువచేసే బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఇదే పనిని స్థానిక కూలీలతో చేయించాలంటే భోజనం ఖర్చులతో కలిపి రూ.7,450 అవుతోంది. దీంతో రూ.2,350 ఆదా అవుతుండటంతో బెంగాలీ కూలీల జోరు కొనసాగుతోంది.

**అక్కడ పనులు లేక.. -** భీమోల్, వ్యవసాయ కూలీ, మహాపూర్ గ్రామం, పశ్చిమబంగ రాష్ట్రం

మా ప్రాంతంలో పనులు లేక ఏజెంట్ల సూచనలతో 80 మంది వరకు



నాగలాపురం మండలానికి వచ్చాం. బెంగాల్‌లోని మా జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతుండటంతో అక్కడ పనులు త్వరగా పూర్తైపోతాయి. ఖాళీగా ఉండలేక ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలకు వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం.

**ఒకే రోజులో.. మూడు ఎకరాలు-** దామునాయుడు, రైతు, జంబుకేశవపురం గ్రామం, నాగలాపురం మండలం.

గతేడాది మా ప్రాంతానికి వచ్చిన బెంగాలీ కూలీలు తక్కువ మొత్తానికే పని చేయటంతో పాటు వేగంగా పనులు పూర్తవుతుండటంతో ఈ దఫా వారిని పిలిపించాను. మూడు ఎకరాల పొలంలో ఒకే రోజులో వరినాట్లు పూర్తిచేశారు

# హైవేగం

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారి (బెంగళూరు-హైదరాబాద్) నిర్వహణ అధ్వానంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఈ రహదారి 84 కి.మీ. పొడవునా ఉంది. సగటున రోజుకు 150కిపైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, 300కుపైగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. చాలా ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతానికి 10 కి.మీ. దూరంలో 2021 ఫిబ్రవరి 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 మంది మదనపల్లివాసులు మృతి చెందారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం షరా మామూలైంది.

**డ్రైవరు నిర్లక్ష్యంతో..**

2019, మే 11న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన రహదారి ప్రమాదంలో 16 మంది మృత్యువాత పడ్డారు. ఏడాది కిందట డోన్ రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలో ఓ ప్రైవేటు బస్సు 140 కి.మీ. వేగంతో వెళుతూ డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు ఉన్న లారీపైకి దూసుకెళ్లింది. లారీలో ఉన్నవారు గాయపడగా.. బస్సు డ్రైవరు అక్కడికక్కడే మృతి చెందారు.

**140 కి.మీ.కు పైగా..**

బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై గంటకు 110 కి.మీ. వేగంతో మాత్రమే బస్సులు వెళ్లాలి. ప్రైవేట్ బస్సులు 140 కి.మీ.కు పైగా వేగంగా దూసుకెళ్తున్నాయి. రాత్రివేళలో ట్రాఫిక్ తక్కువగా ఉండడం.. త్వరగా గమ్యస్థానానికి చేరాలన్న ఆతృతతో మితిమీరిన వేగంతో వెళుతున్నాయి. మరోవైపు ప్రైవేటు బస్సులు పర్మిట్లు లేకున్నా రాకపోకలు సాగిస్తున్నాయి.

**బ్లాక్ స్పాట్లు ఇవే..**

బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై దత్తాత్రేయస్వామి ఆలయం, డోన్ రూరల్ పోలీసుస్టేషన్, దొరపల్లి బ్రిడ్జి, యు.కొత్తపల్లి క్రాస్‌రోడ్డు, ఓబులాపురం మెట్ట, క్రాస్ రోడ్డు, దేవరబండ, వెల్దుర్తి సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బ్లాక్ స్పాట్లు ఉన్నాయి.

**స్పీడ్‌గన్లు.. సూచికలు కరవు**

రెండేళ్ల కిందటివరకు ఈ మార్గంలో స్పీడ్‌గన్స్ ఉండేవి. ఆ తర్వాత దీనిపై అధికారులు దృష్టి సారించలేదు. ఆర్టీఏ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు వాహనాల వేగం మితిమీరింది. ప్రమాదకర మలుపులు, బ్లాక్‌స్పాట్ల వద్ద సూచికలు లేవు. రహదారిపై ఎక్కడా మొబైల్ పెట్రోలింగ్ కనిపించడం లేదు. హైవే అంబులెన్సులు అందుబాటులో లేకపోవడంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

**గతంలో జరిగిన భారీ ప్రమాదాలు**

2019 మే 11న సైతం ఎస్‌ఆర్‌ఎస్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను తప్పించబోయి ఉన్నపళంగా ఓ వైపు తిప్పడంతో.. ఎదురుగా వస్తున్న క్రూజర్ వాహనాన్ని ఢీకొట్టింది. పెళ్లి నిశ్చయం చేసుకుని వెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన 15 మంది, వెల్దుర్తికి చెందిన ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

2021 ఫిబ్రవరి 14న తెల్లవారుజామున మదార్‌పురం గ్రామ సమీపంలోని ఉపరితల వంతెనపై క్రూజర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అక్కడికక్కడే సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

**నియంత్రణ లేని అతివేగం**

2019, 2021 సంవత్సరాల్లో వెల్దుర్తి, మదార్‌పురం గ్రామాల సమీపంలో జరిగిన ప్రమాదాలు సైతం అతివేగాన్ని నియంత్రించకపోవడంతో సంభవించాయి. ఎస్‌ఆర్‌ఎస్ ట్రావెల్స్ బస్సు వెల్దుర్తి కూడలి వద్ద అతివేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న క్రూజర్‌ను ఢీకొంది. మదార్‌పురం సమీపంలో సైతం వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో 12 మంది ప్రాణాలు వదిలారు.

చురకలు



# టిడ్కో ఇళ్లు వీడిన చిక్కుముళ్లు

ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 2014–19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో కర్నూలు నగరపాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలక సంఘాల్లో 300, 365, 430 చ.అ. నివాసాలు, ఆళ్లగడ్డ, డోన్ పురపాలికల్లో షీర్ వాల్ సాంకేతికతతో 300 చ.అ. నివాసాల నిర్మాణాలు చేపట్టారు. రూ.1611.80 కోట్ల వ్యయంతో మొత్తం 30,672 ఇళ్లకు గాను 14,262 పూర్తిచేశారు. ఇప్పటికే పురపాలక సంఘాల వారీగా నిర్మాణాల పురోగతిపై పలు మార్లు సమీక్ష చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అసంపూర్తి ఇళ్లను 2026 మార్చి 31 నాటికి పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.



**రూ.25 కోట్లు విడుదల**

తెదేపా ప్రభుత్వం 2019 నాటికి 90శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణాలను ముందుకు తీసుకెళ్లకపోవడంతో లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అందివ్వలేకపోయారు. గృహాలకు వైకాపా రంగులు మార్చేందుకు రూ.లక్షలు వెచ్చించడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ పేరుతో గుత్తేదారుల జేబులు నింపే పనులు చేసింది. తెదేపా హయాంలో పనులు పూర్తయి, రావాల్సిన రూ.25 కోట్ల బిల్లులను తాజాగా కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం రూ.123 కోట్లతో పనులు పూర్తిచేయనున్నారు.

# కాలుష్య భూతం 'పట్టు'కుంది

వెల్దుర్తి : జాతీయ స్థాయిలో 'పట్టు' ప్రఖ్యాతి పొందిన శ్రమజీవులను కాలుష్య భూతం కకావికలం చేసింది. వెల్దుర్తి మండలం సూదేపల్లిలో 1,500 ఎకరాల్లో 150 మంది రైతులు మల్బరీ సాగు చేసేవారు. గ్రామంలో నెలకు 3 వేల నుంచి 4 వేల కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అయ్యేవి. ఏడాదికి 10 నుంచి 11 కోతలు తీసేవారు. వీరంతా హిందూపురానికి వెళ్లి విక్రయించి లాభాలు పొందేవారు. ఒక్కో రైతుకు సగటును ఏటా రూ.5 లక్షల ఆదాయం వచ్చేది. డోన్ మండలం ఉడుములపాడులో వెలిసిన ఓ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న కాలుష్యం 'పట్టు' దిగుబడులను చిదిమేసింది. మల్బరీ మొక్కలు ఎదగడం లేదు.. కొత్త ఆకులు రావడం లేదు.. ఏటా ఐదు పంటలు రాలేని దుస్థితి నెలకొంది. చేసేది లేక రైతులు మల్బరీ సాగును ఒక్కొక్కరు వదిలేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఐదుగురే పంట సాగు చేస్తున్నారు.



**కూలీలుగా మారుతున్న అన్నదాతలు**

మల్బరీ సాగులో మంచి దిగుబడులు సాధించి, పది మందికి ఉపాధి చూపిన రైతులు నేడు కూలీలుగా మారుతున్నారు. కాలుష్యం కారణంగా పంట దెబ్బతినడంతో పంటను వదిలేశారు. ఇతర పనుల కోసం కర్నూలు నగరానికి వెళ్తున్నారు. పట్టుగూళ్ల పెంపకంలో జాతీయ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డు అందుకున్న శివశంకరగౌడ్ కూడా సాగు వదిలేశారు.

రామానాయుడు తనకున్న మూడెకరాల్లో పదేళ్లుగా మల్బరీసాగు చేపట్టేవారు. ఏటా 11 కోతలు తీసి రూ.5 లక్షల ఆదాయం పొందేవారు. ఖర్చులు పోను ఏడాదికి రూ.3 లక్షల లాభం వచ్చేది. రాముడు మూడెకరాలు కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా మల్బరీ సాగు చేసేవారు. రెండేళ్లుగా పంట దెబ్బతినడంతో వదిలేశారు. వీరిద్దరూ కుటుంబ పోషణ కోసం కర్నూలుకు వెళ్తున్నారు.

పట్టుగూళ్ల ఉత్పత్తి చేస్తున్న రైతులకు ప్రభుత్వం కిలోకు ప్రోత్సాహకంగా అదనంగా రూ.50 అందించేవారు. దీనివల్ల ఒక్కో రైతుకు రూ.10 వేల మేర అదనపు ఆదాయం సమకూరేది. ఇవి చెల్లించకపోవడంతో రైతుల్లో నిరుత్సాహం నెలకొంది.

# భానుడితో దోస్త్..ఉపాధి మస్త్..

విజయనగరం : ఐటీఐ విద్యార్థులకు కొత్త తరం కోర్సులు పరిచయం చేయడం ద్వారా భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా సోలార్, డ్రోన్, ఏఐ, విద్యుత్తు వాహనాలకు సంబంధించిన సాంకేతికతపై శిక్షణ నిమిత్తం ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇప్పటికే విజయనగరంలోని ప్రభుత్వ ఐటీఐలో సౌర శక్తితో నడిచే ల్యాబ్‌ను ప్రారంభించారు. త్వరలో డ్రోన్ టెక్నాలజీ, ఈవీ ల్యాబ్‌లు అందుబాటులోకి రానున్నాయి.

ఇతర కళాశాలల వారికీ..

విజయనగరంలో ఏర్పాటైన ల్యాబ్‌తో విద్యార్థులకు సౌర విద్యుత్తుపై అవగాహన ఏర్పడుతుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద(సీఎస్ఆర్) కింద మైక్రోమ్యాక్స్ ఎలక్ట్రానిక్స్ రూ.7 లక్షలతో దీనిని ఏర్పాటు చేసింది. ఈనెల 13న ఎమ్మెల్యే అదితి ప్రారంభించారు. ప్రస్తుతం శిక్షణ తరగతులు సాగుతున్నాయి. ఇక్కడి వారితో పాటు ఇతర కళాశాలలకు చెందిన వారికీ తర్ఫీదునిస్తున్నారు.

ఏడు రోజుల పాటు..

'సౌరవిద్యుత్తు' అంశాన్ని చదువులో భాగం చేయనున్నారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ ట్రేడ్‌ల వారికి వారం పాటు శిక్షణ ఇస్తారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందివచ్చిన జిల్లాకు చెందిన శ్రీకాంత్, త్రినాథరావు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో మూడు ప్రభుత్వ, 25 ప్రైవేటు ఐటీఐలున్నాయి. వీటిల్లో 1400 మందికి గానూ.. ఇప్పటివరకు 500 మందికి మెలకువలు నేర్పించినట్లు జిల్లా కన్వీనర్ టీవీ.గిరి తెలిపారు. సౌర శక్తి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆ దిశగా ముందుకెళుతున్నామన్నారు.

# నిబంధనలపై 'రాళ్లు'



నంద్యాల : జిల్లాలో కంకర, లైమ్ కంకర, క్వారీల్లో నిబంధనలపై రాళ్లు వేస్తున్నారు. లీజుదారులు రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకుంటూ.. అనుమతులు వచ్చే దాకా ఆగకుండా విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నారు. నంద్యాల, బేతంచెర్ల గనుల శాఖ కార్యాలయాల పరిధిలో రోడ్డు మెటల్ క్వారీలు ఐదు ఉన్నాయి. బనగానపల్లి మండలం భానుముక్కల క్వారీల్లో కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. ప్యాపిలి, డోన్ మండలాల్లో ఉన్న క్వారీల్లో ప్రస్తుతం జరగడం లేదు. నంద్యాల కార్యాలయం పరిధి పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లె తదితర ప్రాంతాల్లో 16, ఆళ్లగడ్డ పరిధిలో రెండు క్వారీలు ఉన్నాయి. నిర్దేశిత పరిధి దాటి తవ్వకాలు జరుగుతున్నా చర్యలు మాత్రం లేవు.

**అంతా దోపిడీ**

పాణ్యం మండలం గద్దెలకొండలో కంకర తవ్వకాల్లో మూడింటికి మాత్రమే అనుమతులున్నాయి. పెద్దఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయి. అనుమతులున్న క్వారీల్లోనూ నిర్దేశించిన దానికంటే అధిక లోతులో తవ్వకాలు జరుగుతున్నాయి. బనగానపల్లి పరిధిలో ఇష్టారీతిన బ్లాస్టింగ్‌లతో దుమ్ము, ధూళి చేరడంతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. నంద్యాలలో వేస్తున్న సిమెంట్ రహదారులు, బహుళ అంతస్తులు, గృహ నిర్మాణాలకు తమ్మరాజుపల్లెలో జరుగుతున్న అక్రమ తవ్వకాల కంకరే వాడుతున్నారు. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని వివిధ నిర్మాణాలకూ ఇదే మెటల్ వాడుతున్నారు.

**లైమ్ కంకర ఇదే స్థాయిలో**

స్థిరాస్తి వ్యాపారంతోపాటు నంద్యాలలోని వివిధ ప్రాంతాల్లోని కాలనీలు, పాఠశాలలు, కళాశాలలు, రెస్టారెంట్లు తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున లైమ్ కంకర వాడుతున్నారు. దీంతో దళారులు కొందరు తమ్మరాజుపల్లె గద్దెలకొండ నుంచి ప్రత్యేకంగా తెప్పించుకుని ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. గద్దెలకొండలో రాత్రి వేళల్లో తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. పాణ్యం పోలీసులకు సమాచారం ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు

క్వారీలు: 283

రోడ్డు మెటల్ క్వారీలు: 32

రెన్యువల్ దశలో : 16

రెన్యువల్ పేరుతో 'దగా'పాణ్యం, బనగానపల్లి ప్రాంతాల పరిధిలోని క్వారీల్లో ప్రస్తుతం కొన్ని రెన్యువల్ దశలో ఉన్నాయి. 15 క్వారీలకు దరఖాస్తులను ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. ఆయా క్వారీల్లోనూ తవ్వకాలు సాగుతున్నాయి. 32 క్వారీల పరిధిలో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. పర్యావరణ అనుమతులు 9 క్వారీలకు మాత్రమే ఉన్నాయి. పాణ్యం ప్రాంతాల్లోని క్వారీల్లో ప్రైవేట్ సైన్యం ఆధ్వర్యంలో తవ్వకాలు జరుగుతున్నాయి. నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపాల్టీలతోపాటు ప్రకాశం జిల్లా దిగువమెట్ట నుంచి చలమ వరకు ప్రస్తుతం జరుగుతున్న డబ్లింగ్ రైల్వే పనుల్లో ఈ కంకర వాడుతున్నారు. నల్లమల్ల అరణ్యంలోకి నేరుగా పాణ్యం, ఆళ్లగడ్డ ప్రాంతాల నుంచి అక్రమంగా తవ్విన నల్ల కంకర రవాణా జరుగుతుంది.

# పరిశ్రమ పెట్టాలా..12 శాఖలను కలవనక్కర్లే !



విజయనగరం : పరిశ్రమ పెట్టాలంటే సుమారు 12 శాఖల అధికారులను కలవాలి. మనం వెళ్లే వేళకు వారు కార్యాలయాల్లో ఉంటారో.. క్షేత్ర పర్యటనకు వెళ్తారో తెలియదు. సరైన పత్రాలు లేవనో.. వివరాలు అసంపూర్తిగా ఉన్నాయనో ఒకటికి పదిసార్లు తిరగాల్సి వచ్చేది. గతంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎదురైన ఇబ్బందులివి. కూటమి ప్రభుత్వం రాకతో సింగిల్ విండో విధానాన్ని తీసుకొచ్చింది. 2024–29 పాలసీలో భాగంగా త్వరితగతిన ఒకేచోట అనుమతులు ఇస్తోంది.

**అన్నీ వారే చూసుకుంటారు..**

%www.apindustries.gov.in% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తే పరిశ్రమల శాఖ అధికారులు పరిశీలిస్తారు. నోడల్ ఏజెన్సీగా పనిచేస్తూ విద్యుత్తు, పంచాయతీ, పురపాలక, అగ్నిమాపక, రెవెన్యూ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ జల విభాగాలను సంప్రదిస్తారు. స్థాయిని బట్టి 7, 15, 21 రోజుల్లో అనుమతులు వచ్చేలా చూస్తారు. స్వయం ఉపాధి యూనిట్ అయితే వారంలోనే పని పూర్తిచేశారు.

**రాయితీలు పెరిగాయ్..**

పరిశ్రమలు స్థాపించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మహిళలకు గతంలో 35 శాతం రాయితీ అందించేవారు. ప్రస్తుతం 45 శాతానికి పెంచారు. ఇతరులకు పరిశ్రమల ఆధారంగా వివిధ విభాగాల్లో 25 శాతం వరకు రాయితీ దక్కనుంది.

విజయనగరం జిల్లాలో గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల్లో 4,019కు అనుమతులు ఇచ్చారు.

రెండు జిల్లాల్లో పారిశ్రామిక వాడలు రూపుదిద్దుకుంటున్నాయి. ఆయా పార్కుల్లోనే స్థలాలు సైతం కేటాయిస్తారు. ప్రాజెక్టు నివేదిక, అనుమతి పత్రాలను సమర్పించాలని పరిశ్రమల కేంద్రం విజయనగరం జీఎం ఎం.డి.షఫీ అహ్మద్, మన్యం ఇన్‌ఛార్జి జీఎం కరుణాకర్ సూచిస్తున్నారు. మన్యంలో 1,479 మందికి అవకాశం దక్కింది. ఇందులో రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు చిరు పరిశ్రమలున్నాయి.

అనుమతులు పొందిన వాటిలో రైస్ మిల్లులు, కాగితపు కప్పులు–ప్లేట్లు, పిండి మిల్లులు, ఆటోమొబైల్, ఫెర్రో అల్లాయిస్, వ్యవసాయ, పాలు, బ్యాకరీ ఉత్పత్తులు, ప్రింటింగ్, ఆహారశుద్ధి, వివిధ రకాల ఉత్పత్తుల యూనిట్లు ఉన్నాయి.

# నగరానికి పండ్ల సోయగం



విజయనగరం : వేసవిలో విజయనగరం వెళ్లలేమండీ బాబూ అంటుంటారు మన పెద్దలు. ఒకప్పుడు అంత వేడి ఉండేది. రానురానూ తగ్గినా ఉక్కబోత మాత్రం వెంటాడుతోంది. దీనికి ప్రధాన కారణంగా అక్కడి కాలుష్యమే. దీనికి అడ్డుకట్ట వేసేందుకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటోంది. పచ్చదనం పెంపులో భాగంగా తొలి విడత కింద 50 వేల పండ్ల మొక్కలు నాటనుంది. ఈమేరకు ఎన్‌క్యాప్ నిధులు రూ.20 లక్షలను ఖర్చు చేయనుంది. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇటీవల కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**డివిజన్‌కు వెయ్యి చొప్పున..**

నగర పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. 1000 చొప్పున 50 వేల మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇటీవల కడియం నుంచి 5 వేలు తెప్పించారు. ఇందులో జామ, నేరేడు, పనస, మామిడి, సపోటా, సీతాఫలం తదితర రకాలున్నాయి. విడతల వారీగా మిగిలిన వాటిని తెప్పిస్తారు. డివైడర్లు, పార్కులు, ప్రధాన కూడళ్లు, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నాటనున్నారు. మరోవైపు మిద్దె పంటలను సైతం ప్రోత్సహించనున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డులకు నగరపాలికకు చెందిన మూడు సంఘాలు ఎంపికయ్యాయి.**గత ప్రభుత్వ హయాంలో ఇలా..**

గత ప్రభుత్వ హయాంలో జగనన్న హరిత నగరాల పేరిట రూ.26 లక్షలతో 2,650, మెగా ప్లాంటేషన్ కింద రూ.53.95 లక్షలతో 5,652 మొక్కలు నాటారు. ట్రీగార్డుల కోసం మరో రూ.18.20 లక్షలు, నామ ఫలకాల పేరిట ఇంకో రూ.8.75 లక్షలు వెచ్చించారు. ఇందులో ఒక్కటీ కనిపించడం లేదు.

**కాలుష్యానికి అడ్డుకట్ట..**

నగరంలో కొన్నేళ్లుగా కాలుష్యం పెరుగుతోంది. వాహనాల వినియోగం, పరిశ్రమల నుంచి వెలువడే పొగ కారణంగా గాలిలో స్వచ్ఛత తగ్గుతోంది. ప్రస్తుతం వీటీ.అగ్రహారం, కస్పా, నగరపాలిక కూడలిలో గ్రోత్ సెంటర్ల ద్వారా వాయు కాలుష్యాన్ని పరిశీలిస్తున్నారు. పీసీబీ(పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) ప్రకారం పీఎం– 10(పార్టిక్యులేట్ మేటర్) విలువ రోజుకు 100 ఎంఎఫ్‌సీఎం(మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్) దాటకూడదు. ఏడాదిలో సరాసరి 60లోపే ఉండాలి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో 72 నుంచి 77 వరకు నమోదవుతోంది. మొక్కల పెంపకంతో దీన్ని తగ్గించనున్నారు.

**రక్షణకు చర్యలు..**పచ్చదనం పెంపు, కాలుష్యం నివారణే లక్ష్యంగా ముందుకెళుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. తొలి విడతలో డివిజన్‌కు 1000 చొప్పున మొక్కలు అందిస్తామని, అలాగే ఇప్పటికే నాటిన వాటి రక్షణ కోసం వెయ్యి ట్రీగార్డులు కొనుగోలు చేయనున్నామన్నారు. ఈ మేరకు ఒక్కో దానికీ రూ.1800 చొప్పున వెచ్చిస్తామన్నారు.

# పీవీఆర్‌కు 'వంద'నం!

ఒంగోలు : విశ్రాంత డీజీపీ నండూరి సాంబశివరావు, అప్పా పూర్వ జేడీ తోట వెంకట్రావు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.గిరిజాశంకర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ సలీం, సాహిత్యంలో జీవితకాల పురస్కార గ్రహీత తల్లావజుల శివాజీ, బీసీరాయ్ అవార్డు గ్రహీత చివుకుల లక్ష్మీనరసింహమూర్తి, ప్రముఖ సినీ నిర్మాత పోకూరి బాబూరావు, సినీ రచయిత మరుదూరి రాజా, దర్శక, నిర్మాత కోన వెంకట్ ఇలా వేలాది మంది ప్రముఖులు అక్షరాలు దిద్దింది అదే జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని పిశుపాటి వెంకట రంగయ్య నగర పాలక ఉన్నత పాఠశాల. 1925లో ప్రారంభమైన ఈ బడి లక్షలాది మందికి




విద్యాబుద్ధులు నేర్పింది. వచ్చే ఏడాది జనవరిలో శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతోంది.

అక్షర బీజం పడిందిలా..

కరవది జమీందారు పిశుపాటి బంగారుభొట్లు, వెంకట లక్ష్మమ్మ కుమారుడు వెంకటరంగయ్య ఆంగ్లేయుల పాలనలో నెల్లూరు జిల్లా బోర్డు సభ్యునిగా పనిచేశారు. 1898లో తన పేరిట ఒంగోలు నగరంలో ప్రాథమిక పాఠశాల ప్రారంభించి తరువాత దానిని పిశుపాటి వెంకట రంగయ్య హిందూ మిడిల్ స్కూలుగా అభివృద్ధి చేశారు. పాఠశాలకు సొంత భవన నిర్మాణం ప్రారంభించి 1922లో తన 51వ ఏట మరణించారు. అనంతరం ఆయన రెండో కుమారుడు వెంకట్రాయశర్మ పాఠశాల నిర్వహణ చేపట్టి 1925లో నూతన భవనంలో పాఠశాల నిర్వహించారు. 1950లో పాఠశాల పురపాలక సంఘంలో విలీనమైంది. నాటి నుంచి నేటి వరకు సరాసరిన 3 వేల మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగుతోంది.

# రాను.. నే ఒంగోలుకు రాను!

ఒంగోలు : మేఘం కమ్ముకుందంటే ఒంగోలు నగరానికి వెళ్లేందుకు జిల్లావాసులు వెనుకంజ వేస్తారు... చినుకు పడిందంటే నగరంలోకి అడుగు పెట్టేందుకు భయపడతారు...అదే వర్షం కురిసిందంటే అటువైపే చూడరు.. ఇక భారీ వర్షాలు కురుస్తున్నాయంటే ప్రయాణం చేయాలనే ఆలోచననే మానుకుంటారు. ఇదీ జిల్లా కేంద్రం పరిస్థితి. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరానికి వివిధ పనుల నిమిత్తం వచ్చినవారు బస్టాండులో అడుగుపెట్టగానే భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి చెరువును తలపిస్తుండడంతో నగరంలో తిరిగేదెలాగని మదన పడుతున్నారు. నగరంలోని రహదారులు, వీధులు, కూడళ్లు సైతం ముంపు బారిన పడుతుండడంతో నగరవాసులే కాదు నగరానికి వచ్చినవారికి జలకష్టాలు తప్పడం లేదు.

నగర జనాభాను వణికించే పోతురాజు కాలువలో పూడికను ఈ ఏడాది చాలా వరకు తొలగించడంతో 40 కాలనీలకు కొంతమేర ముంపు సమస్య తప్పింది. వచ్చే ఏడాది వర్షాకాలానికి కథ మొదటికి రాకుండా కట్టలను పటిష్ఠం చేసేవిధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. తాజాగా బుధవారం పోతురాజు కాలువ కట్ట బఫర్ జోన్‌లో ఉన్న ఆక్రమ నిర్మాణాలను మేయర్, కమిషనర్ దగ్గరుండి తొలగించారు. కాలువ పరిధిలో అక్రమ నిర్మాణాలు తొలగిస్తేనే ముంపు సమస్య తప్పుతుంది. మరోవైపు కాలువను అనుకుని ఉన్న కాలనీల వాసులు దీన్ని డంపింగ్ యార్డులా మార్చేయడంతో ముంపు సమస్య ఎదురవుతోంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నీరు పారే మార్గాలపై ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంతో మోకాలి లోతున వరదనీరు నిలిచిపోతోంది.

కారణాలెన్నో..ఒంగోలు బస్టాండు ఎదురుగా ఏళ్ల కిందట నిర్మించిన డ్రెయిన్ ఉన్నప్పటికీ సామర్థ్యం సరిపోవడంలేదు. అప్పట్లో ఆర్అండ్‌బీ అధికారులు డ్రెయిన్‌కు రహదారికి మధ్య కేబుళ్లు వేసేందుకు కాలువ మాదిరి నిర్మించారు. అసలు కాలువలోకి నీరు వెళ్లే మార్గం లేక వరదనీరు నిలిచిపోతోంది. ప్రస్తుతం రహదారికిరువైపులా రూ.కోటిన్నరతో కొత్తగా కాలువ నిర్మాణం చేపట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు.చాలాచోట్ల దశాబ్దాల కిందట నిర్మించిన రహదారులు కావడంతో వాటి కంటే ఎత్తులో డ్రెయిన్లు ఉండటంతో వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.డ్రెయిన్లు ఆక్రమించి



భారీ నిర్మాణాలు చేపట్టడంతో నీరు పారక ముంపు సమస్య ఎదురవుతోంది.నగరం అంతకంతకూ విస్తరిస్తున్నా, ఆ స్థాయిలో కాలువల నిర్మాణం జరగకపోవడంతో ముంపు ముప్పు తప్పడం లేదు.

**24 గంటలూ అత్యవసర సేవలు**

25 మంది సిబ్బందితో నగరపాలక సంస్థ సన్నద్ధం

సహాయం కోసం చేయాల్సిన నంబరు 08592227766

వర్షాలతో ఒంగోలు నగర పరిధిలో ఎటువంటి సమస్య ఎదురైనా అత్యవసర సమయంలో ఆదుకునేందుకు నగరపాలక సంస్థ 10 మంది ఇంజినీరింగ్, 15 మంది పారిశుద్ధ్య సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని నియమించింది. చెట్లు కూలినా, కాలువల్లో నీరు పారక ముంపు ఎదురైనా తక్షణం సహాయక చర్యలు చేపట్టనుంది. రెండు జేసీబీలు, నాలుగు కోత యంత్రాలను సిద్ధం చేసింది. కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 24 గంటలపాటు ఫోన్ నంబరు అందుబాటులో ఉంచింది.

**కాలువల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి**

– వెంకటేశ్వరరావు, కమిషనర్

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కాలువల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాం. మొదటి ప్రాధాన్యంగా వీటికే నిధులు కేటాయిస్తున్నాం. రానున్న కాలంలో నగర వాసులకు ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

చురకలు



# 'పట్టు'కుంటే.. కట్టేస్తారంతే

ధర్మవరం : మందపు దారంతో నేసిన సిల్క్‌చీర, వాటి పైనే వర్క్, డిజైన్ వగైరా.. కట్టుకుంటే భుజాలు లాగేంత బరువు. ఇదంతా పాత స్టైల్. ఇప్పుడు మహిళలు, యువతుల అభిరుచి మారింది. బరువు అనగానే వద్దు అంటున్నారు. చీర ఎంత తేలికగా ఉంటే అంత సౌలభ్యం అనే రీతిలో ఆలోచనాధోరణి ఉంది. ప్రధానంగా అందానికి పట్టు, సౌలభ్యతకు తేలిక అనే కోణంలో యువతులు మొగ్గు చూపుతున్నారు. ఈ మార్పును ధర్మవరం డిజైనర్లు అందిపుచ్చుకుని చీరలను తీర్చిదిద్దుతున్నారు. పెరుగుతున్న అమ్మకాలు మగువ మనసును చెప్పకనే చెబుతున్నాయి.

**డిమాండ్ వేటికి**

ఆరు నెలల నుంచి అంచులేని, చిన్నబార్డర్ ఉన్న పట్టుచీరలు కావాలని మహారాష్ట్ర, ఢిల్లీ, హరియాణా, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆర్డర్లు



వస్తున్నాయి. చిన్న బుట్టాలు కలిగిన జరీ స్థానంలో థ్రెడ్ (పట్టుదారం) కాంట్రాస్ట్ చీరలు, ప్లెయిన్ బుట్టా, బార్డర్ లెస్, చిన్న బార్డర్, లైట్ కలర్స్, థ్రెడ్ బార్డర్, ప్లెయిన్ కాంట్రాస్ట్, జరీ చెక్స్ చీరలకు విపరీత డిమాండ్ వస్తోంది.

మగ్గానికి ఏర్పాటు చేసుకున్న 3 కొమ్ముల సాయంతో పట్టు చీరలు నేస్తున్నారు. జాకెట్, కొంగు రెండువైపులా అంచులు అన్ని ఒకే రంగులో రూపొందిస్తున్నారు. చీరలో వచ్చే రంగు బ్లౌజ్, కొంగు, బార్డర్‌లో కలవకుండా ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు.

900–1000 గ్రాములు : సాధారణ పట్టుచీర బరువు

500–600 గ్రా...: ప్రస్తుతం బరువు తగ్గిన తరువాత

10–15 రోజులు: తేలిక చీర తయారీకి పట్టే సమయం

ఎగుమతులు: ఆరు నెలల నుంచి పెరుగుదల

# శ్రీసిటీ వాకిట.. సిరి వనం

వరదయ్యపాళెం : శ్రీసిటీ పరిశ్రమల సామ్రాజ్యం. ఇక్కడ కేవలం కర్మాగారాలే ఉంటాయనుకుంటే పొరపాటే. పచ్చదనానికి నిలయంగా మారడం విశేషం. దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఏజీబీసీ సంస్థ ద్వారా గ్రీన్‌సిటీ గోల్డ్ రేటింగ్ అవార్డు సైతం దక్కింది. పర్యావరణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ హరితవనంలా తీర్చిదిద్దుతుండటమే ప్రధాన కారణం. జపాన్ మియావాకీ విధానంలో మొక్కలు పెంచడంతో అవి ఇప్పుడు వృక్షాలుగా ఎదిగి అడవిని తలపిస్తుండటం గమనార్హం.

**సామాజిక ప్రయోజనం..**

పరిశ్రమలు నెలకొల్పే స్థలంలో చెట్లను కొట్టివేస్తుంటారు. పచ్చదనం అన్న మాటే ఉండదు. ఇలా సాధారణంగా పారిశ్రామిక వాడల్లో కనిపించే పరిస్థితి. కానీ ఆదర్శ సెజ్‌గా పేరొందిన శ్రీసిటీలో ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తుంది. అత్యంత విలువైన భూముల్లో కృత్రిమ అడవులను సృష్టించగా, పచ్చదనం పరిఢవిల్లుతోంది.



సెజ్ విస్తరించిన ప్రతి గ్రామంలో ఎకరాకు పైగా భూమిని కేటాయించి మొక్కలు నాటి సంరక్షించారు. అవి ఇప్పుడు అడవిని తలపిస్తున్నాయి. దారికి ఇరువైపులా పచ్చదనం కనిపిస్తుంది.

ప్రతి పరిశ్రమలోనూ పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రత్యేకంగా 25 ఎకరాలు కేటాయించగా, నర్సరీ ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచారు.

**నందనవనంలా తీర్చిదిద్దడమే..**

– రవీంద్రసన్నారెడ్డి, ఎండీ, శ్రీసిటీ

పరిశ్రమల స్థాపనే ధ్యేయంగా ఏర్పాటైన శ్రీసిటీని ఓ నందనవనంలా తీర్చిదిద్దడమే మా ఆశయం. ఇందుకు ప్రత్యేకంగా భూములను కేటాయించి కృత్రిమ అడువులను సృష్టించాం. ప్రకృతివనంలా తీర్చిదిద్దడంతో అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను సైతం ఆకట్టుకుంటోంది. శ్రీసిటీ గ్రీన్‌సిటీగా పేరొందడం ఎంతో సంతోషాన్నిస్తోంది.

# 'ఎడతెగని' వానలు

చిత్తూరు : అల్పపీడనంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లాలో జనజీవనం అతలాకుతలమైంది. పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చిత్తూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో పలుచోట్ల పొలాలు దెబ్బతిన్నాయి. చెరువులు, వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. మొత్తం 24 చెరువులకు గండ్లు పడ్డాయి. వాటికి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. అత్యధికంగా గూడూరులో 107.2, విజయపురం మండలంలో 99.2 మి.మీ. కురవగా, అత్యల్పంగా పెద్దపంజాణిలో 16.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుమూరు 86.6, కార్వేటినగరం 80.4, వెదురుకుప్పం 79.4, పూతలపట్టు 79.2, నింద్ర 70.4, ఐరాల 59.6, నగరి 54.8, రొంపిచెర్ల 40.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

**స్తంభించిన రాకపోకలు**

సోమల మండలంలోని పెద్దఉప్పరపల్లె, దేవలకుప్పం, పేటూరు, బోనమంద, పొలికిమాకులపల్లె తదితర ఎగువ ప్రాంతాలలో మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో బుధవారం పెద్దఉప్పరపల్లె– చౌడేపల్లె మార్గంలో సీతమ్మచెరువు వంక ఉధృతంగా ప్రవహించింది. ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. గార్గేయనది ఉగ్రరూపం దాల్చడంతో పెద్దఉప్పరపల్లె–బసవపల్లె మధ్య రాకపోకలు నిలిచాయి. ఆవులపల్లె–పెద్దఉప్పరపల్లె మధ్యలో వంతెనపై ఆర్టీసీ బస్సు దాటుతుండగా హఠాత్తుగా సీతమ్మచెరువు ప్రవాహం పెరిగింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రమాదాన్ని తప్పించారు.

కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం ప్రాజెక్టు గేట్లు రెండింటిని ఎత్తి వరదను కుశస్థలి నదిలోకి బుధవారం విడుదల చేశారు.

పుత్తూరు మండలం నేషనూరు పరిధిలోని మూలకోన అటవీప్రాంతం నుంచి నీటి ఉధృతి జోరుగా ఉంది. అక్కడి చెక్‌పోస్టును మూసివేశారు. వడమాలపేట మండలంలోని అత్తూరు–కల్లూరు రోడ్డు కల్వర్టుపై భారీగా నీరు చేరింది.

# పేదల స్థలం.. వైకాపా నేతల పరం



గుత్తి : పేదల నిలువ నీడ కోసం ప్రభుత్వం నివేశన స్థలాన్ని కేటాయించగా వైకాపా నాయకులు గద్దల్లా తన్నుకుపోయారు. రూ.కోట్లు విలువైన జాగాను కబ్జా చేశారు. కాసులకు కక్కుర్తిపడిన కొందరు రెవెన్యూ అధికారులు.. అక్రమార్కులకు కట్టబెట్టారు. గుత్తి పట్టణ శివారులోని పాత హైవేకు ఆనుకుని ఉన్న సర్వే నంబరు 347లో సుమారు 17 ఎకరాలు ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా రూ.5 కోట్ల వరకు పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 1996 సంవత్సరం (హెచ్.నంబరు 29–1405), జనవరిలో సుమారు 1,200 మంది పేదలకు నివేశన స్థలాలను ఇచ్చింది. నీటి సౌకర్యం, సొమ్ములేక లబ్ధిదారులు సదరు స్థలంలో ఇళ్లను నిర్మించుకోలేదు. దీంతో నాయకులు కన్నేశారు. నివేశన స్థలాన్ని సాగు భూమిగా చూపి సొంతం చేసుకున్నారు. ఇటీవల అధికారులతోపాటు ప్రభుత్వ పెద్దలకు లబ్ధిదారులు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది.

**పని మనిషి పేరుతో..**

గుత్తికి చెందిన అప్పటి తహసీల్దారు రోషన్.. పేదలకు స్థలాలు కేటాయించి.. పట్టాలు మంజూరు చేశారు. వాటిని రద్దు చేయకనే 2023లో ఓ నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తన ఇంటిలో పని చేసే మహిళ పేరుతో వన్–బీ, పట్టాదారు పాసుపుస్తకాన్ని సృష్టించి... ఆమె నుంచి కొనుగోలు చేసినట్లు దస్త్రాలు తయారు చేసుకున్నాడు.

కడప జిల్లా పచ్చికలపాడు గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో గుత్తికి చెందిన నలుగురు వైకాపా నాయకులు ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకున్నా తాడిపత్రి, గుత్తిలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మొత్తానికి 2.21 ఎకరాల భూమిని సొంతం చేసుకున్నారు.

ఈక్రమంలో మరో నాయకుడు ఈ వ్యవహారాన్ని తెలుసుకుని తన ఇంటిలోని పని మనిషి పేరుతో అడంగల్, వన్–బీ సృష్టించాడు. తన పేరిట గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మిగిలిన భూమిని సైతం ఇతరులు కాజేశారు. వైకాపాకు చెందిన ఓ మైనారిటీ నాయకుడితోపాటు మరో నాయకుడు పేదలకు ఇచ్చిన భూమిని సబ్‌డివిజన్ చేయించుకుని డి–పట్టాలు పొందారు. రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**విచారించి తగిన చర్యలు తీసుకుంటాం**

శ్రీనివాస్, ఆర్డీవో, గుంతకల్లు నివేశన స్థలాల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేయిస్తాం. తహసీల్దారుకు పట్టాలు, ఆధార్ కార్డుల ప్రతులను ఇస్తే లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. పేదల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# ఉల్లం'ఘనుల'పై ఉక్కుపాదం




తిరుపతి : ఆదాయార్జన శాఖలైన ఎక్సైజ్, గనులు, వాణిజ్య పన్నులు, రెవెన్యూ, తదితర శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే చిత్తూరు జిల్లాలో అనుమతులున్న, అనధికారికంగా నడుపుతున్న క్వారీల నిగ్గు తేల్చాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. అనంతరం ఉల్లంఘనలకు పాల్పడిన సంస్థలను ంచి జరిమానా, సీనరేజీ వసూలు చేయాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు అనుమతులు పొందిన 38 క్వారీలవారు పరిధికి మించి తవ్వకాలకు పాల్పడ్డారని తేలింది. తిరుపతి జిల్లాలోనూ గూడూరు డివిజన్‌లో ఇలాంటి అతిక్రమణలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అక్కడా తనిఖీలు చేయాల్సి ఉంది.

**ఆరు బృందాలు.. 685 గనులు**

చిత్తూరు, పలమనేరు డివిజన్ గనుల శాఖ పరిధిలో ఈ ఏడాది జులై 31 నాటికి 685 క్వారీలున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో ఆరు బృందాలు మూడు నెలల కిందట రంగంలోకి దిగాయి. కడపలోని రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారులతోపాటు రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, సాంకేతిక సహాయకులు తనిఖీలు చేశారు. ఈ ఏడాది అక్టోబరు 15 నాటికి చిత్తూరు డివిజన్‌లోని 433 క్వారీలకుగాను 341 చోట్ల తనిఖీలు పూర్తయ్యాయి.

**చిత్తూరు డివిజన్‌లోనే 30**

చిత్తూరు డివిజన్‌లో అనుమతులున్న 30 క్వారీల్లో పరిధికి మించి తవ్వారు. నగరిలో 13, వెదురుకుప్పం 5, తవణంపల్లె మూడు, ఐరాల, పూతలపట్టు, ఎస్ఆర్‌పురంలో రెండేసి, మిగతాచోట్ల ఒకటి చొప్పున గనుల్లో ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. రామకుప్పంలో 3, వి.కోట 2, కుప్పం, చౌడేపల్లె, పుంగనూరులలో 8 మంది లీజుదారులకు నోటీసులిచ్చారు.

**సిలికాలోనూ ఇదేవిధంగా** గూడూరు డివిజన్‌లో సిలికా తవ్వకాల్లో అక్రమాలు కొనసాగుతున్నాయి. అనుమతులు ముగిశాక కూడా ఇక్కడ తవ్వుతున్నారు. స్థానిక నేతల మద్దతుతోనే ఈ దందా జరుగుతోంది. సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో మాఫియా రెచ్చిపోతోంది. అధికారులకు ఫిర్యాదు వచ్చినప్పుడు ఒకట్రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని చేతులు దులిపేసుకుంటున్నారు. ఇక్కడా తనిఖీలు చేస్తేనే ఖజానాకు డబ్బు వస్తుంది.

# ఇది.. 14 నెలల మహా యజ్ఞం!




సింధియా: సాగర జలాల (బ్యాక్ వాటర్) పాయ.. మేహాద్రి గెడ్డ జలాలు కలిసే ప్రాంతం గతంలో రవాణాకు చాలా కీలకంగా ఉండేది. రహదారుల సౌకర్యం అంతగా లేని ఆరు దశాబ్దాల కిందట పడవలపై ఈ పాయ దాటి విశాఖపట్నం–గాజువాక మధ్య రాకపోకలు సాగేవి. నేవల్ డాక్ యార్డు వద్ద 1960లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ రైలు, రోడ్డు వంతెనలను ప్రభుత్వం నిర్మించింది. ఇంధన, రసాయన, నిత్యావసర వస్తువుల రవాణాలో ఈ వారధి అమూల్య సేవలందించింది. కాల క్రమంలో వంతెన బలహీన పడింది. దీంతో మరమ్మతులు అనివార్యమయ్యాయి. దాదాపు 14 నెలలుగా సాగుతున్న పనులు కొలిక్కివచ్చాయి. నగరంలో ఎప్పుడూ లేని రీతిలో ఓ వంతెన పనులకు ఇంత గడువు తీసుకొని ఎట్టకేలకు పూర్తి చేశారు.

2024, ఆగస్టు1: వంతెనను పోర్టు యాజమాన్యం పూర్తిగా మూసివేసింది. ప్రజా రవాణాకు డాక్‌యార్డు సమీప సీడబ్ల్యూసీ గోదాముల నుంచి మారుతి కూడలి మీదుగా అటు షీలానగర్, ఇటు కాన్వెంటు కూడలికి చేరుకునేలా ప్రత్యామ్నాయాన్ని సూచించింది.

9 నెలలు: మొత్తం మరమ్మతులు పూర్తి చేయాలనుకున్న కాలం.

రూ. 23 కోట్లు: తొలుత ఇంత వ్యయంతో పనులకు ప్రతిపాదించారు. చివరికి పనుల విలువ రూ.30 కోట్లకు చేరింది.

60,000: ప్రస్తుతం రోజుకి కనీసం ఇన్ని వాహనాలు ప్రయాణిస్తాయని అంచనా. 12,500: గతంలో నిత్యం ఈ వంతెనపై తిరిగే వాహనాల సంఖ్య.అలా ఆటంకం: వంతెన కింద సాగర జలాలు, బంకమట్టి.. మరోవైపు చౌడు నేల నేపథ్యంలో స్తంభాలు కుంగాయి. పోర్టు ట్రస్టు యాజయాన్యం చెన్నైకి చెందిన 'ఎస్ఈఆర్‌సీ' సంస్థతో వంతెన పటిష్ఠత, సామర్థ్యంపై పరీక్షలు నిర్వహించింది. వంతెన బాగా బలహీన పడినట్టు 2019 సెప్టెంబరులో నివేదిక ఇచ్చింది. దీంతో భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

రూ. 2 కోట్లు: రాత్రి వేళ వంతెనపై ప్రయాణం భద్రంగా సాగేందుకు ఇంత వ్యయంతో సీసీ కెమెరాలు, విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు.

కొన్నాళ్లు ఒక వైపే: నవంబరు ఒకటి లేదా రెండో తేదీన ఈ వంతెనపై రాకపోకలకు మళ్లీ అనుమతిస్తారని సమాచారం. గాజువాక, సింధియా నుంచి నగరానికి వంతెన మీదుగా వెళ్లేందుకు అనుమతిస్తారు. 'సాగరమాల' ప్రాజెక్టు పనులు సాగుతున్నందున తిరుగు ప్రయాణంలో ఇటు వచ్చేందుకు అప్పుడే వీలు కాదు. పెట్రోపార్కు, ఐఎన్ఎస్ డేగా, మారుతి కూడలి మీదుగానే రావాల్సి ఉంటుంది.

# అవినీతి జాడ్యం.. స్పందన శూన్యం!

తిరుపతి : తిరుపతి ఏసీబీ ఫోన్ నంబర్లు: 94404 46130 94404 46193 మీ పేరిట భూమి మారాలా? డబ్బు ఇవ్వాల్సిందే. మీ పదోన్నతి దస్త్రం కదలాలా? చేతులు తడపాల్సిందే. బిల్లులు మంజూరు చేయాలా? పర్సంటేజీ పంపాల్సిందే. కేసులో పేరు మాయం చేయాలా? ముడుపులు తాకించాల్సిందే.

–ఇలా డిమాండ్ చేసి దండుకోవడం నేరమని తెలిసినా.. అవినీతి ఆగడం లేదు. పనులు త్వరగా పూర్తి కావాలని అడిగింది ఇచ్చేస్తూ ప్రజలు సైతం అవినీతికి ఆజ్యం పోస్తున్నారు.

కొంతిద్దాం.. పని చేసుకుందాం: ప్రజల పనులు చేయడానికే ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారనే విషయం పక్కకు వెళ్లింది. ఎవరూ ఊరికే ఏమీ చేయరు. మన పని కావాలంటే అడిగిన దాంట్లో కొంతిచ్చి త్వరగా పని పూర్తి చేసుకుందామనే ధోరణిలో ప్రజలు ఉంటున్నారు. డబ్బు ఎందుకు ఇవ్వాలని ఎదురు తిరిగితే.. ఆ దస్త్రం లేదు, ఈ కాగితం తేవాలంటూ కొర్రీలు వేస్తూ వేధిస్తారు.

తొలి స్థానంలో రెవెన్యూ: 2020 నుంచి ఇప్పటి వరకు తిరుపతి



ప్రాంతీయ అవినీతి నిరోదక శాఖ (ఏసీబీ) పరిధిలో 40 కేసులు నమోదయ్యాయి. మొదటి స్థానంలో రెవెన్యూ శాఖ ఉంది. తర్వాత స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, అటవీ, వైద్య ఆరోగ్య, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు, ఆర్టీఏ, పంచాయతీ రాజ్ శాఖలు నిలిచాయి.

ఐదేళ్లుగా కేసులు: ఏసీబీ కేసుల విచారణలోనూ జాప్యం జరుగుతోంది. నెల్లూరు ఏసీబీ కోర్టుకు రెగ్యులర్ న్యాయమూర్తి లేకపోవడంతో.. ఆ ప్రభావం కేసుల విచారణపై పడుతోంది.

ఫిర్యాదులు చేయాలి: ఉద్యోగులు లంచం అడిగినా.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినా ఏసీబీకి ఫిర్యాదు చేయొచ్చు.

# ఈట్ స్ట్రీట్‌లో ఎంచక్కా తినేయొచ్చు..!

తిరుపతి : ఈట్‌స్ట్రీట్.. వివిధ రకాల ఆహారం అంతా ఒకే చోట లభ్యమయ్యే ప్రదేశం. తిరుపతిలో ఇది త్వరలో అందుబాటులోకి రానుంది. రేణిగుంట మార్గంలో దీన్ని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో ఇది కార్యరూపం దాల్చలేదు. నగరానికి దూరంగా ఏర్పాటు చేస్తే నగరవాసులకు వెళ్లలేరని అధికారులు భావించారు. దీంతో తిరుపతిలో అనువైన ప్రాంతాల ఎంపికకు కసరత్తు చేశారు. ఇస్కాన్ మార్గం, శ్రీనివాసం పరిసరాలు తదితర ప్రాంతాలను పరిశీలించారు. చివరకు నగరపాలిక కార్యాలయం ఎదురుగా నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఈట్‌స్ట్రీట్ ఏర్పాటుకు నిర్ణయించారు.



**రూ.కోటితో సౌకర్యాల కల్పన**

ప్రస్తుతం నిర్దేశిత ప్రాంతాన్ని వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. ఈ దారికి ఇరువైపులా శాశ్వత దుకాణాలు నిర్మించి ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు ప్రారంభించనున్నారు. పిల్లలకు ఆహ్లాదం అందించడానికి పలు వసతులు కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే నమూనాను ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. నిరంతరం కొనసాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**పారదర్శకంగా దుకాణాల కేటాయింపు**

– ఎన్.మౌర్య, కమిషనర్ఈట్‌స్ట్రీట్ ఏర్పాటుకు స్థలాన్ని నిర్ణయించాం. పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాం. పారదర్శకంగా దుకాణాలు కేటాయిస్తాం. ఇందుకు టెండరు వేస్తాం. దీనికి వచ్చే ఆదరణకు అనుగుణంగా మరోటి ఏర్పాటుచేస్తాం.

# జమదానీ.. అందాల గని

పాయకరావుపేట: జమదానీ చీరలకు ఉప్పాడ ప్రసిద్ధి. వారికి దీటుగా ఎన్నో ఏళ్ల నుంచి పాయకరావుపేట చేనేత కార్మికులు ఆ చీరలు నేస్తున్నారు. ఆపోక్కు సరఫరా చేస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. అందం, నాణ్యతతో మహిళల మనసు గెలుచుకుంటున్న చీరలకు మరింత ప్రాచుర్యం తీసుకువచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వినియోగదారులకు మరింత చేరువ చేయడంతో పాటు చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.జమదానీ చీర అంటే ఆడవాళ్లు ఎంతో ఇష్టపడుతుంటారు. దీని తయారీకి ప్రత్యేక మగ్గాలు వాడతారు. పాయకరావుపేటలో 60 మంది కార్మికులు దీనిలో ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఒక్కోచీర తయారీకి డిజైన్ ఆధారంగా 15 నుంచి నెల రోజులు పడుతుంది. ముగ్గురు కార్మికులు శ్రమించాలి. ఇటీవల



చేనేత సంఘాన్ని సందర్శించిన హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ చీరల ప్రత్యేకత చూసి ఆశ్చర్యపోయారు. వీటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా పెద్దమాల్స్, భారీ వస్త్ర దుకాణాల యాజమాన్యాలతో చర్చించే దిశగా అడుగులు వేస్తున్నారు. వ్యాపార సంస్థల అవసరాలకు అనుగుణంగా సొసైటీ నుంచి చీరలు సరఫరా చేసే విధంగా ఒప్పందం చేసుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మార్కెటింగ్ పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.




## ట్రెడిషనల్ లుక్ లో మెస్మరైజ్ చేసిన గ్లోబల్ స్టార్!

హాలీవుడ్ రేంజ్ కి ఎదిగిన ప్రియాంక చోప్రా ప్రస్తుతం పాన్ వరల్డ్ మూవీ వారణాసిలో హీరోయిన్ రోల్ పోషించిన సంగతి మనకు తెలిసిందే. తాజాగా గ్లోబ్ ట్రోటర్ పేరుతో నిర్వహించిన ఈవెంట్లో దేవకన్య లాంటి గెటప్ లో దర్శనమిచ్చింది ఈ ముద్దుగుమ్మ.. ఈ ఈవెంట్ కి సాంప్రదాయమైన లుక్ లో ప్రియాంక చోప్రా ఎంట్రీ ఇవ్వడంతో చాలామంది ఆమె లుక్ కి ఫిదా అయ్యారు. అయితే ఈ లుక్ లో ఉన్న ఫోటోలను ప్రియాంక చోప్రా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో కూడా షేర్ చేసింది.. ఆ ఫోటోలను చూసిన చాలామంది అభిమానులు అద్భుతంగా ఉన్నారు అంటూ కామెంట్లు పెడుతున్నారు.. హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా జరిగిన గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్లో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, రాజమౌళి ఇలా ఎంతోమంది తారలు వచ్చి సందడి చేశారు. వీరందరిలో ప్రియాంక చోప్రా తన డ్రెస్సింగ్ స్టైల్ తో సెంటరాఫ్ అట్రాక్షన్ గా కనిపించింది. అనామిక ఖన్నా డిజైన్ చేసిన చీరలో ప్రియాంక చోప్రా సాంప్రదాయమైన లుక్ లో కనిపించింది. సాంప్రదాయమైన డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది.. రామోజీ ఫిలిం సిటీలో చుక్కలే దిగివచ్చినట్టుగా ప్రియాంక



చోప్రా ఆ లైట్స్ కింద తన మిరుమిట్లు గొలిపే అందంతో కనిపించి అభిమానులను ఫిదా చేసింది. వైట్ క్రీమ్ కలర్ బ్లౌజ్ స్కర్ట్ తో పాటు అదే కలర్ లో ఉన్న దుపట్టా తో పెయిర్ చేసి దేవకన్యలా కనిపించింది. అంతేకాదు చేతికి కడియాలతోపాటు మెడలో పెద్ద చౌకర్, పాపిట బిళ్ళ, జడ బిల్లలు, నడుముకు వడ్డాణం పెట్టుకొని తన లుక్ ని కంప్లీట్ చేసింది.అలా అచ్చ తెలుగు ఆడపిల్లలాగా ప్రియాంక చోప్రా ఈ ఈవెంట్లో మెస్మరైజ్ చేసింది. అంతేకాదు ఈ ఫోటోలకు క్యాప్షన్ గా నా లోపల దేవిని చానెలింగ్ చేస్తున్నాను ఓ మందాకిని ఎవరాశాని అనే క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఇక రాజమౌళి డైరెక్షన్లో మహేష్ బాబు హీరోగా చేస్తున్న వారణాసి మూవీలో ప్రియాంక చోప్రా మందాకిని అనే పాత్ర పోషిస్తున్న సంగతి మనకు తెలిసిందే. రీసెంట్ గానే ప్రియాంక చోప్రా కి సంబంధించిన మందాకిని ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రివీల్ చేశారు. ఇందులో శారీ కట్టుకొని గన్ చేతిలో పట్టుకొని యాక్షన్ మోడ్ లో ప్రియాంక చోప్రా కనిపించింది. అలా తాజాగా నిర్వహించిన గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్ లో దేశ విదేశాల నుండి ఎంతోమంది అభిమానులు వచ్చి ఈవెంట్ ని సక్సెస్ చేశారు.

## మళ్లీ మెగాస్టార్ కోల్ కత్తా బ్యాక్ డ్రాప్!

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా 158వ సినిమా బాబి దర్శకత్వంలో లాక్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. చిరంజీవి 157 నుంచి రిలీవ్ అవ్వగానే పట్టాలె క్కించాలని బాబి సర్వం సిద్ధం చేస్తున్నాడు. దాదాపు నటీనటుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. హీరోయిన్ విషయంలో డైలామా కొనసాగుతుంది. చిరంజీవి ఇమేజ్..వయసు దృష్టిలో పెట్టుకుని పర్ఫెక్ట్ నాయికగా కోసం సెర్చ్ చేస్తు న్నారు. మరికొన్ని రోజుల్లో హీరోయిన్ ఎవరు? అన్నది కూడా క్లారిటీ వచ్చేస్తుంది. ఈ నేపథ్యంలో బాబి ఎలాంటి బ్యాక్ డ్రాప్ తో కథ నడిపిస్తాడు? అన్న చర్చ మొదలైంది.

**చిరు కెరీర్ లో అదో క్లాసిక్:** దీంతో ఆ విషయం బయటకు వచ్చింది. బెంగాల్ బ్యాక్ డ్రాప్ లో సాగే యాక్షన్ థ్రిల్లర్ గా తెలిసింది. ఈ బ్యాక్ డ్రాప్ చిరు-బాబి ఇద్దరకు కలిసి వచ్చింది. బాబి తొలి సినిమా 'పవర్'



లో కొంత కథ బెంగాల్ నేపథ్యంలోనే సాగుతుంది. అక్కడ చిత్రీకరించిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయింది. అలాగే చిరంజీవి హీరోగా గుణశేఖర్ దర్శకత్వంలో 'చూడాలని ఉంది' కూడా పశ్చిమ బెంగాల్ బ్యాక్ డ్రాప్ లోనే సాగుతుంది. అందులో చిరంజీవి పాత్రను ఎంతో అందంగా చూపించారు. ఆసినిమా అప్పట్లో మంచి విజయం సాధించింది.

**రెండు విజయాల అనంతరం:** చిరు సినిమాల్లో అదో క్లాసిక్ చిత్రంగా చెప్పొచ్చు. ఆ తర్వాత మళ్లీ చిరంజీవి బెంగాల్ బ్యాక్ డ్రాప్ లో చాలా కాలం పాటు సినిమాలు చేయలేదు. ఈ నేపథ్యంలో ఆ ఛాన్స్ మెహర్ రమేష్ కి ఇచ్చారు. అతడు చిరంజీవి హీరోగా తెరకెక్కిన భోళా శంకర్ కూడా బెంగాల్ డ్రాప్ లోనే సాగుతుంది. కానీ ఈ సినిమా చిరు కెరీర్ లో ఓ డిజాస్టర్. మళ్లీ బాబి సహకారంతో చిరంజీవి బెంగాల్ బ్యాక్ డ్రాప్ ని టచ్ చేస్తున్నారు. ఈ కాంబినేషన్ పై అంచనాలు మాత్రం భారీగా ఉన్నాయి. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్ లో తెరకెక్కిన వాల్తేరు వీరయ్య భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే.

**బెంగాల్ లో మరోసారి మెగాస్టార్:** ఇది వైజాగ్ బ్యాక్ డ్రాప్ లో సాగి న చిత్రం. కమర్షియల్ గా సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. ఆ నమ్మకంతోనే చిరంజీవి బాబి అప్రోచ్ అవ్వగానే మరో ఆలోచన లేకుం డా 158 అతడితో లాక్ చేసారు. మరి ఈ బెంగాల్ బ్యాక్ డ్రాప్ ను బాబి ఏ కోణంలో చూపిస్తాడు? ఎంత కొత్తగా ఆవిష్కరిస్తాడు? అన్నది చూడాలి. చిరు ఇప్పటికే స్లిమ్ లోకి మారిపోయారు. ఆయన వయసు ఏకంగా 30 ఏళ్లు వెనక్కి వెళ్లినట్లు కనిపిస్తోంది. 157 తో పాటు 158 లో కూడా చిరు అదే లుక్ లో కనిపించనున్నారని తెలుస్తోంది.

## త్రీడీలో బాలయ్య తాండవం! గూస్‌బంప్స్ కన్ఫర్మ్




నట సింహం నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం అఖండ2 సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. బోయపాటి శ్రీను ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్ బస్టర్ అఖండ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. దానికి తోడు బాలయ్య-బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వచ్చిన సినిమాలన్నీ ఒకదాన్ని మించి ఒకటి హిట్టుగా నిలవడంతో అఖండ2 పై భారీ క్రేజ్ నెలకొంది.

**పాన్ ఇండియా స్థాయిలో అఖండ2 రిలీజ్....** ఈ ఇయర్ టాలీవుడ్ నుంచి రానున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్టుల్లో అఖండ2: తాండవం కూడా ఒకటి. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే అఖండ2 ను ఈసారి చాలా భారీ స్థాయిలో రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అఖండ సినిమాకు చేసిన పొరపాటును ఈ సినిమాకు చేయకూడదని డిసైడైన దర్శకనిర్మాతలు అఖండ2ను పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

**త్రీడీ ఫార్మాట్ లో అఖండ2...** అందులో భాగంగానే అఖండ2 ప్రమోషన్స్ ను చాలా భారీ స్థాయిలో ప్లాన్ చేసిన మేకర్స్, రీసెంట్ గా ఫస్ట్ సింగిల్ ను ముంబై లో ఓ ఈవెంట్ ను ఏర్పాటు చేసి అక్కడ లాంచ్ చేశారు. అంతేకాదు, ఇప్పుడు ఈ సినిమా నుంచి మరో ముఖ్యమైన అప్డేట్ వినిపిస్తోంది. ఆడియన్స్ కు గొప్ప ఎక్స్‌పీరియెన్స్ ను అందించడానికి మేకర్స్ అఖండ2ను 3డీ ఫార్మాట్ లో రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ అప్‌గ్రేడ్ చేసిన కొన్ని త్రీడీ వెర్షన్ విజువల్స్ ను మీడియా మిత్రులకు, ఫ్యాన్స్ కు చూపించగా, ఆ విజువల్స్, త్రీడీలో యాక్షన్ సీన్స్ ను చూసి విజువల్స్ ఎంతో క్వాలిటీగా ఉన్నాయని, బోయపాటి విజన్ ఎంతో అద్భుతంగా ఉందని, బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్ ఆడియన్స్ దృష్టిని ఆకర్షించేలా ఉందని వారు ప్రశంసించారు.

**అఖండ2 కు భారీ స్థాయిలో ప్రమోషన్లు...** అఖండ2 ను మేకర్స్ ఎంత భారీగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారో ఈ ప్లానింగ్ చూస్తుంటే అర్థమవుతుంది. పైగా ఈ సినిమాకు సంబంధించిన ఈవెంట్స్ ను కూడా అన్నీ పాన్ ఇండియా స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నెల 21న బెంగుళూరు దగ్గర్లోని చింతామణిలో ట్రైలర్ ను లాంచ్ చేసి, 18న వైజాగ్ జగదాంబలో ఓ సాంగ్ ను లాంచ్ చేయాలని, ఆ తర్వాత డిసెంబర్ 3,4,5 తేదీల్లో అమెరికాలో కూడా ఈవెంట్స్ ను ప్లాన్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని, ప్రీ రిలీజ్ ఈవెంట్ ను మాత్రం మధ్యలో ఓ రోజు చూసుకుని ఆంధ్రప్రదేశ్ లో చేయాలని భావిస్తున్నారట. మేకర్స్ ప్లాన్ చూస్తుంటే ఈసారి బాలయ్య సినిమా టైటిల్ కు తగ్గట్టుగానే తాండవం చేసేట్టున్నారు. సంయుక్త మీనన్, ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ గా కనిపించనుండగా, తమన్ అఖండ2కు సంగీతం అందిస్తున్నారు.

## అవతార్ తో 'వారణాసి'.. జక్కన్న ప్లాన్ ఏంటి?






బ్లాక్ బస్టర్ హిట్ ఆర్ ఆర్ ఆర్ మూవీ తర్వాత దర్శకధీరుడు రాజమౌళి ఇప్పుడు వారణాసి మూవీ రూపొందిస్తున్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్ తో పెద్ద ఎత్తున తెరకెక్కుతున్న ఆ సినిమాలో మహేష్ బాబు లీడ్ రోల్ లో నటిస్తున్నారు. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మాలీవుడ్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా ప్రాజెక్టు షూటింగ్ జరుగుతుండగా.. వారణాసి మేకర్స్ రీసెంట్ గా టైటిల్ గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన ఈవెంట్ లో విడుదల చేయగా.. ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో కూడా రిలీజ్ చేయగా.. ఓ రేంజ్ లో ఇప్పుడు చక్కర్లు కొడుతోంది. వీడియోలో చూపించిన రాజమౌళి అండ్ టీమ్ చూపించిన విజువల్స్ వావ్ అనేలా ఉన్నాయి. మూవీపై హైప్స్ ను ఆకాశాన్ని తాకేలా చేశాయి. టైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్షన్, మైథాలజీ, యాక్షన్ అడ్వెంచర్ జోనర్స్ లో సినిమా ఉంటుందని గ్లింప్స్ చెప్పకనే చెప్పింది. ఏదేమైనా గ్లింప్స్ రిలీజ్ తర్వాత రాజమౌళికి అభిమానులు ఓ రిక్వెస్ట్ చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానున్న అవతార్: ఫైర్ అండ్ యాష్ మూవీతోపాటు వారణాసి గ్లింప్స్ ప్లే అయ్యేలా ప్లాన్ చేయాలని కోరుతున్నారు. అనేక దేశాల్లో అవతార్ రిలీజ్ అవ్వనుండగా.. వారణాసి గ్లింప్స్ కూడా అందరికీ చేరుకుంటుందని అభిప్రాయపడుతున్నారు. సినిమాకు చాలా హెల్ప్ అవుతుందని చెబుతున్నారు.

ఇంటర్నేషనల్ లెవెల్ లో సినిమాపై కచ్చితంగా బజ్ క్రియేట్ అవుతుందని అభిప్రాయపడుతున్నారు నెటిజన్లు. అయితే ఆ విషయంలో రాజమౌళి అండ్ కో ఎలాంటి ప్లాన్ తో ఉన్నారనేది ఆసక్తికరం. నిజానికి అవతార్ చిత్రాల దర్శకుడు జేమ్స్ కామెరూన్ తో జక్కన్నకు మంచి సంబంధాలు ఉన్నాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే ఆయనతోనే రాజమౌళి.. వారణాసి మూవీ టైటిల్ తోపాటు మహేష్ బాబు ఫస్ట్ లుక్ ను రివీల్ చేస్తారని కొన్ని రోజుల క్రితం జోరుగా ప్రచారం జరిగింది. ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా అంతా అదే ఫిక్స్ అయ్యారు. కానీ రామోజీ ఫిల్మ్ సిటీలో ఈవెంట్ ఏర్పాటు చేసిన రిలీజ్ చేశారు జక్కన్న. మరి ఇప్పుడు అవతార్ ఫ్రాంఛైజ్ కొత్త మూవీకి వారణాసి గ్లింప్స్ ను అటాచ్ చేస్తారో అంతా వేచి చూడాలి.

## ఎల్లో చీరలో ముద్దొచ్చేస్తున్న ఆండ్రియా..ఫోటోలు వైరల్

ఆండ్రియా జెర్మియా.. పేరుకు తమిళ నటే అయినప్పటికీ సౌత్ ఇండస్ట్రీతో పాటు నార్త్ ఇండస్ట్రీలో కూడా పేరున్న హీరోయిన్.. ఈ ముద్దుగుమ్మ అలాంటి పాత్రలకే కేరాఫ్ అడ్రస్.. సీన్ డిమాండ్ చేస్తే చాలు ఎలాంటి పాత్రలో అయినా సరే అద్భుతంగా నటిస్తుంది.. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా శారీలో ఉన్న ఫోటోస్ ని తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. ఎల్లో కలర్ సారీలో రెడ్ కలర్ బ్లౌజ్ తో పేరవ్ చేసి అచ్చ తెలుగు ఆడపిల్ల లాగా కనిపించింది. ఎల్లో కలర్ శారీలో ఆండ్రియా ని చూసిన చాలామంది వింటేజ్ లుక్ ని తీసుకు వచ్చింది అంటూ కామెంట్లు పెడుతున్నారు.. సాంప్రదాయమైన చీరకట్టుతో పాటు చెవులకు బుట్టాలు పెట్టి కొప్పు వేసుకుని దాని చుట్టూ రెడ్ రోజ్ లు పెట్టుకోవడంతో ఈమె ఫొటోస్ చూసిన చాలామంది రెడ్ రోజులా మెరిసిపోతున్నావ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం ఆండ్రియా జెర్మియాకి సంబంధించిన ఈ చీర కట్టు ఫోటోస్ నెట్టింట వైరల్ గా మారాయి.. ఆండ్రియా జెర్మియా



సినిమాలు, పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. చెన్నైలో పుట్టి పెరిగిన ఆండ్రియా జెర్మియాకి చిన్నప్పటి నుండే పాటలు పాడడం అంటే చాలా ఇష్టం. అలా చిన్నప్పటినుండే ఎన్నో స్టేజ్ పెర్ఫార్మెన్స్ కూడా ఇచ్చేది. ఆ తర్వాత 2005లో కంద నాల్ ముదల్ అనే తమిళ సినిమా ద్వారా కోలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఎన్నో తమిళ, హిందీ,మలయాళ, తెలుగు సినిమాల్లో నటించి ఇండస్ట్రీలో రాణించింది. ఇక తెలుగులో ఈ హీరోయిన్ డైరెక్ట్ గా చేసిన ఫిల్మ్ తడాఖా..అక్కినేని నాగచైతన్య,సునీల్ కాంబినేషన్లో వచ్చిన తడాఖా మూవీలో తమన్నా, ఆండ్రియాలు హీరోయిన్స్ గా చేశారు.ఇందులో ఆండ్రియా సునీల్ సరసన నటించింది. ఆ తర్వాత ఆండ్రియా తమిళం లో నటించిన చాలా సినిమాలు తెలుగులో కూడా విడుదలయ్యాయి. ఆండ్రియా నవంబర్ 21న మాస్క్ అనే మూవీ తో మన ముందుకు రాబోతుంది.కవిన్ రూహానీ శర్మ నటిస్తున్న మాస్క్ మూవీలో ఆండ్రియా కూడా ఓ ప్రధాన పాత్రలో నటిస్తుంది. అలాగే కా-ది ఫారెస్ట్, వాడి వసల్, మనుషి,అరసన్ అనే సినిమాల్లో కూడా ఆండ్రియా నటిస్తోంది.

## 'స్పిరిట్' నుంచి ప్రభాస్ ముందే బయటకు!

'స్పిరిట్' చిత్రీకరణ మొదలైన నాటి నుంచి ప్రభాస్ ఈ సినిమా షూటింగ్ కే సమయమంతా కేటాయిస్తారా? అన్న ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. దర్శకుడు సందీప్ రెడ్డి వంగతో ఆ రకంగా అగ్రిమెంట్ జరిగిన తర్వాతే ప్రాజెక్ట్ లాక్ అయిందన్నది తొలి నుంచి వినిపిస్తోంది. ఇదే జరిగితే ప్రభాస్ పూర్తి చేయాల్సిన సలార్-2, కల్కి 2 లాంటి ప్రాజెక్ట్ లు మరింత డిలే అవుతాయి? అన్నది వాస్తవం. అందుకు ఎలా లేదన్నా? ఏడాదిన్నర నుంచి రెండేళ్లు సమయం పడుతుంది. మరి ఈ ప్రతికూల ప్రభావమే ప్రభాస్ ముందుకెళ్తాడా? కొత్త వ్యూహం రచిస్తున్నారా? అంటే తాజాగా మరో ఆసక్తికర విషయం తెరపైకి వస్తోంది.

**కీలక పాత్రలన్నీ ఒకేసారి:** స్పిరిట్ చిత్రీకరణకు సంబంధించి సందీప్ కొత్త విధానాన్ని అనుసరించేలా రెడీ అవుతున్నారుట. తొలుత ప్రభాస్ కి సంబంధించిన అన్ని రకాల సన్నివేశాలను పూర్తి చేసి అతడిని బయటకు పంపించాలనే కొత్త ప్లాన్ సిద్ధం చేస్తున్నాడట. సినిమా అంతా హీరో చుట్టూనే తిరుగుతుంది కాబట్టి ప్రభాస్ లేని సన్నివేశాలు అంటూ ఏవీ ఉండవు. చాలా పాత్రలతో ప్రభాస్ కాంబినేషన్



సన్నివేశాలుంటాయి. అవిగాక ప్రత్యేకంగా అతడిపై షూట్ చేయాల్సిన సోలో సన్నివేశాలు కొన్ని ఉంటాయి. వాటన్నింటిని ఓ ఆర్డర్ ప్రకారం ముందుగానే పూర్తి చేయాలని సందీప్ ప్లాన్ చేస్తున్నాడు.

**ఆరేడు నెలలు స్పిరిట్ కోసమే:** షూటింగ్ మొదలైన నాటి ప్రభాస్ పార్ట్ మొత్తం పూర్తయ్యే వరకూ ఇతర ఆర్టిస్టుల జోలికి వెళ్లకూడదని భావిస్తు న్నాడుట. ప్రభాస్ తో కాంబినేషన్ సన్నివేశాలున్న నటులందర్నీ ఆ విధంగా డేట్లు సర్దుబాటు చేసుకోవాల్సిందిగా ఇప్పటికే సూచించినట్లు అత్యంత సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. అందుకు గాను ప్రభాస్ ఆరు నెలలు పాటు పూర్తిగా 'స్పిరిట్' కోసమే డేట్లు కేటాయించాల్సి వస్తోందిట. ప్రభాస్ తదుపరి సినిమాలను దృష్టిలో పెట్టుకుని సందీప్ ఇలా ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. మరి ఈ ప్రణాళిక ఎంత వరకూ సాధ్యమవుతుందో చూడాలి.

**స్పిరిట్ కోసం రెస్ట్ లెస్ గా:** ఇలా ఇంత వరకూ ఏ డైరెక్టర్ ట్రై చేయ లేదు. షూటింగ్ మొదలైందంటే? రకరకాల ఆర్టిస్టులను కలుపుకుని కాంబి నేషన్ సన్నివేశాలు చిత్రీకరిస్తారు. ఈ క్రమంలో మధ్యలో హీరోకి కొంత విరామం దొరుకుతుంది. ఈ సమయంలో వెకేషన్లు..ఫ్యామిలీకి సమయం కేటాయించడాలు వంటివి చేస్తారు. కానీ స్పిరిట్ విషయంలో ఆరేడు నెలలు పాటు ప్రభాస్ అలాంటి వాటికి దూరంగా ఉండాల్సి వస్తుంది. ప్రభాస్ కి మాత్రం ఒకేసారి రెండు..మూడు షూటింగ్ లకు హాజరైన అనుభవం ఉంది. ఈ నేపథ్యంలోనే రెండు షిప్టులు పని చేయడం కూడా అలవాటు అయింది. కాబట్టి స్పిరిట్ కోసం ఏకధాటిగా పనిచేయడం ప్రభాస్ కు పెద్ద సమస్య కాదు. పాజి చిత్రీకరణ మార్చి కల్లా ముగుస్తోం దని సమాచారం. అటుపై ఏప్రిల్ నుంచి డార్లింగ్ స్పిరిట్ కు డేట్లు కేటాయించే అవకాశం ఉంటుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536